


'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 263

గురువారం 14-12-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్

ఏకగ్రీవంగా ఎన్నికైన వికారాబాద్ ఎమ్మెల్యే నేడు బాధ్యతల స్వీకరణ. - 2లో



భట్టి అధికార నివాసంగా..

ప్రజాభవన్ ఇకపై ఉప ముఖ్యమంత్రి భట్టి అధికార నివాసం కానుంది. - 3లో



'గాజా'పై ఐరాసలో తీర్మానం..

'గాజా'పై ఐరాస సాధారణ సభలో ఈజిప్ట్ ప్రవేశపెట్టిన ముసాయిదా తీర్మానానికి భారత్ అనుకూలంగా ఓటు వేసింది.

- వివరాలు 6లో



ఫ్యాన్ ప్రభంజనం..

ఏపీలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 25 లోక్‌సభ స్థానాల్లో 24–25 సీట్లను వైఎస్సార్‌సీపీ చేజిక్కించుకుంటుందని టైమ్స్‌నౌ ఈటీజీ తాజా సర్వేలో తేలింది.

హస్తం హవా

అలాగే తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ 8–10 స్థానాల్లో గెలిచే వీలుందని తెలిపింది. - 5లో

కేంద్రంలో మళ్లీ ఎన్డీఏనే - 6లో



శిలాజ ఇంధనాలకు బైబై..

'శిలాజ ఇంధనాల వాడకం మానేద్దాం.. మార్పు సాధిద్దాం' అంటూ కాప్‌–28 సదస్సులో 200 దేశాలు ప్రతినబూనాయి.

- వివరాలు 6లో



లోక్‌సభకు పొగ..

కలకలం రేపిన ఇద్దరు వ్యక్తులు
విజిటర్స్ పాస్‌తో గ్యాలరీలోకి..

సభలోకి దూకి పొగ గొట్టాలు విసిరిన వైనం..

సభ నిండా పొగ, ఎంపీల పరుగులు

ఆగంతకులను నిర్బంధించి దేహశుద్ధి చేసిన సభ్యులు

పార్లమెంటు ఆవరణలోనూ పొగ గొట్టాలు విసిరిన ఇద్దరు

వారితో పాటు మరొకరి అరెస్టు, ఇంకొకరి కోసం వేట

దారుణమైన భద్రతా వైఫల్యం: కేంద్రంపై విపక్షాల ధ్వజం

పాస్‌లిచ్చిన బీజేపీ ఎంపీ బహిష్కరణకు డిమాండ్

22 ఏళ్ల క్రితం ఇదే రోజున పార్లమెంటుపై ఉగ్ర దాడి

కట్టుదిట్టమైన బందోబస్తు ఉండే పార్లమెంటు మూడంచెల భద్రత వ్యవస్థను ఇద్దరు సామాన్యులు ఏమార్చారు. బూట్లలో పొగ గొట్టాలు దాచకుని మరీ బుధవారం సాధారణ సందర్శకుల్లా దర్జాగా లోక్‌సభ గ్యాలరీలోకి ప్రవేశించారు. జీరో అవర్ కొనసాగుతుండగా గ్యాలరీలోంచి సభా ప్రాంగణంలోకి దూకి.. స్పీకర్ స్థానంకేసి దూసుకెళ్లి కలకలం రేపారు. 'నిరంకుశత్వం నశించాలి, నల్ల చట్టాలు పోవా'లని నినదిస్తూ, పొగ గొట్టాలను విసిరేశారు. వాటి నుంచి వచ్చి న పసుపు రంగు పొగతో ఎంపీలు భయాందోళనలకు లోనయ్యారు. చివరికి వారే చొరవ చేసి ఇద్దరినీ నిర్బంధించారు. అదే సమయంలో పార్లమెంటు ఆవరణ బయట కూడా ఇద్దరు వ్యక్తులు పొగ గొట్టాలు విసిరి కలకలం రేపారు. వారినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నలుగురికీ మరో ఇద్దరు కూడా సహకరించినట్టు తేల్చారు. సరిగ్గా 22 ఏళ్ల కింద పార్లమెంటుపై ఉగ్రవాదులు దాడికి ప్రయత్నించిన రోజే జరిగిన ఈ ఉదంతం సంచలనం రేపింది. దీనిపై పార్టీలకతీతంగా ఎంపీలు, నేతలు ఆందోళన వెలిబుచ్చారు. సభలోకి దూకిన వారు మైసూరు ఎంపీ (బీజేపీ) ప్రతాప్ సింహ సిఫార్సుతో విజిటర్స్ గ్యాలరీ పాస్ సంపాదించినట్టు తేలింది. -6లో



ఆగంతకులు విసిరిన గొట్టాలతో సభలో అలుముకున్న పొగ. చిత్రంలో రాహుల్ ఇతర ఎంపీలు



వారి త్యాగాలకు దేశం రుణపడింది..

- 2001 పార్లమెంట్‌పై దాడిలో అమరులకు రాష్ట్రపతి, ప్రధాని నివాళులు
- ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా తుదముట్టించాలి: ముర్ము
- అమరుల త్యాగాలను దేశం గుర్తుంచుకుంటుంది: మోదీ

- వివరాలు 6లో

రెండ్రోజుల్లో రూ.2 లక్షల రుణమాఫీ ఏమైంది?



- సాధ్యంకాని హామీలతో కాంగ్రెస్ మభ్యపెట్టింది
- గవర్నర్ ప్రసంగం పాత చింతకాయ పచ్చడే..
- రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసి ఇచ్చారని చెప్పిస్తారు
- మీడియాతో ఇష్టాగోష్టిలో మాజీ మంత్రి కేటీఆర్

- వివరాలు 2లో

సాగర్ కింద సాగు వద్దు!



- యాసంగిలో నాగార్జున సాగర్ కింద క్రాప్ హాలిడే!
- కరువు పరిస్థితి కారణంగా నీరివ్వడం కష్టమని తేల్చిన 'స్కీవం' కమిటీ
- కృష్ణా బేసిన్ పరిధి అంతటా ఇదే దుస్థితి

- వివరాలు 5లో

ఫార్మాసిటీ స్థానంలో మెగా టౌన్‌షిప్

- హైదరాబాద్ అభివృద్ధిపై త్వరలో మాస్టర్‌ప్లాన్
- ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం
- ఎంజీబీఎస్, ఎల్బీనగర్ నుంచి ఎయిర్‌పోర్టుకు మెట్రో
- అలాగే తుక్కుగూడ వరకు పొడిగించేందుకు ప్రణాళిక
- గతంలో ప్రతిపాదించిన అలైన్‌మెంట్ ఆపాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ శివార్లలోని కందుకూరు వద్ద ఫార్మా సిటీ నిర్మాణం కోసం సేకరించిన భూముల్లో పర్యావరణహితమైన మెగా టౌన్‌షిప్ నిర్మాణానికి ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నగరానికి దగ్గర్లో ఫార్మాసిటీ ఉండకూడదని.. దాన్ని నగరానికి దూరంగా తరలించడం మంచిదని అభిప్రాయపడ్డారు. మరోవైపు గత ప్రభుత్వం శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు ప్రతిపాదించిన మెట్రోరైల్ విస్తరణ అలైన్‌మెంట్‌ను నిలిపివేయాలని ఆదేశించారు. దానికి బదులు ఎంజీబీఎస్, ఎల్బీనగర్ మార్గాల్లో ఎయిర్‌పోర్టు వరకు మెట్రో రైల్ పొడిగింపుపై ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి పలు అంశాలపై మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, చీఫ్ సెక్రెటరీ మిగతా 5వ పేజీలో ▶

10 రోజుల్లో నివేదిక ఇవ్వండి

- భూ సంబంధిత సమస్యలు, ధరణిపై సమగ్ర వివరాలివ్వాలి
- ధరణిపై సమీక్షలో అధికారులకు సీఎం ఆదేశం

- వివరాలు 3లో

క్లుప్తంగా...

మీరు సహకరించండి.. మేమూ సహకరిస్తాం

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్ ఫోన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అభివృద్ధికోసం సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వ సహకారం పొందడానికి ప్రయత్నిస్తున్నారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత శాఖల వారీగా వరుస సమీక్షలతో బిజీబిజీగా గడుపుతున్న రేవంత్.. బుధవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఫోన్ చేశారు. 'తెలంగాణకు రావాల్సిన నిధులు, ఇతర అంశాలపై పరస్పర సహకారం ఉండాలి. కేంద్ర ప్రభుత్వ ముఖ్యులతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసేలా చొరవ చూపండి'అని ఈ సందర్భంగా కిషన్ రెడ్డిని రేవంత్ కోరినట్టు సీఎంవో కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

మంత్రి కోమటిరెడ్డికి కవిత పరామర్శ



హైదరాబాద్: అనారోగ్యంతో యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని బుధవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పరామర్శించారు. వెంకట్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసు కున్నారు. మంత్రి త్వరగా కోలుకోవాలని కవిత ఆకాంక్షించారు.

త్వరలోనే సీఎం కేడర్‌ను కలుస్తారు

టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు పాలన ఎలా జరిగింది? ఇప్పుడు ఎలా జరుగుతుంది? అనే రెండు విషయాలను అన్ని వర్గాలు బేరీజు వేసుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఐదు రోజులే అవుతోందని, ఈ ఐదు రోజుల్లో సీఎం రేవంత్‌తో పాటు మంత్రులందరూ రోజుకు 18 గంటలపాటు పనిచేసి అన్ని విషయాలపై అవగాహన తెచ్చుకుంటున్నారని ఆయన చెప్పారు. దీంతోపాటు ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన హామీల్లో భాగమైన ఆరు గ్యారంటీలను అమలు చేసే దిశలో సీఎం రేవంత్ పనిచేస్తున్నారని చెప్పారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సచివాలయంలోని విభాగాలన్నింటినీ ప్రక్షాళన చేసిన తర్వాత ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్తారని, అప్పుడు కాంగ్రెస్ పార్టీ కేడర్‌ను కలుస్తారని చెప్పారు. గత తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవకతవకలు, అప్పులపై రాష్ట్ర ప్రభుత్వం అవగాహనకు వస్తోందని, ఈ సమయంలోనే ప్రతిపక్షాలు అవాకులు, చెవాకులు పేలడం సరైంది కాదన్నారు. నెలరోజుల్లో అన్ని శాఖల స్థితిగతులపై శ్వేతపత్రం విడుదల చేస్తామని, రాష్ట్రం ఏర్పాటయిన తర్వాత బడ్జెట్ ప్రతిపాదనలు, అప్పులు కలిపి సుమారు 23 లక్షల కోట్ల రూపాయలను ఏం చేశారో కూడా చెప్పాల్సిన బాధ్యత తమపై ఉందని అన్నారు.

ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా

కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు



నల్లగొండ టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సమస్యలపై కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధిగా తెలంగాణ అసెంబ్లీలో గొంతు వినిపిస్తానని కొత్త గూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు చెప్పారు. నల్లగొండలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో నిర్బంధ పాలనకు స్వస్తి పలికిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తమ సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. పదేళ్లుగా నిధులు, నీళ్లు, ఉపాధి, ఉద్యోగాల కోసం ఎదురు చూసిన ప్రజలకు గత ప్రభుత్వం చేసిన చర్యలపై శ్వేతపత్రం విడుదల చేసి, అక్రమాలకు పాల్ప డిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవా లని డిమాండ్ చేశారు. నిరుద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, సింగరేణి కార్మికులు, ఆర్టీసీ కార్మికుల పక్షాన నిలబడతామని హామీ ఇచ్చారు. నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి కోసం జిల్లాకు చెందిన మంత్రి పనిచేయాలని కోరారు. నల్లగొండ జిల్లాలో ఎర్రజెండాకు పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి కమ్యూనిస్టులు ఐక్యంగా కృషి చేయాలని కోరారు.

ఇదం జగత్



'గ్యాస్' కాదుగా..!?

అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్

బీజేపీ మినహా అన్ని పక్షాలు మద్దతు

- బీఆర్ఎస్ ఎల్పీ ఆఫీసుకు శ్రీధర్‌బాబు
- సీఎం రేవంత్‌తో కలిసి వెళ్లిన కేటీఆర్
- నేడు కొత్త స్పీకర్ బాధ్యతల స్వీకరణ



గడ్డం ప్రసాద్ కుమార్ తరఫున అసెంబ్లీ కార్యదర్శికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న రేవంత్‌రెడ్డి, శ్రీధర్‌బాబు. చిత్రంలో భట్టి విక్రమార్క, తుమ్మల, కేటీఆర్, మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: శాసనసభ స్పీకర్‌గా వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్పీకర్ పదవికి బుధవారం ప్రసాద్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. గురువారం ఉదయం 10.30 గంటలకు శాసనసభ సమావేశాలు ప్రారంభమైన వెంటనే ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ నూతన స్పీకర్ పేరును అధికారికంగా ప్రకటిస్తారు. అనంతరం ప్రసాద్‌కుమార్‌ను స్పీకర్ స్థానం వద్దకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు వివిధ పక్షాలకు చెందిన ఎమ్మెల్యేలు తీసుకొని వెళతారు. ఆపై నూతన స్పీకర్ ఎన్నికకు సంబంధించి అధికారపక్షం ప్రతిపాదించే ధన్యవాద తీర్మానంపై వివిధ పార్టీల ఎమ్మెల్యేలు మాట్లాడతారు. ప్రసాద్‌కుమార్ నామినేషన్ పత్రాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం, సీపీఐ ఎమ్మెల్యేలు సంతకాలు చేశారు. అయితే స్పీకర్ ఎన్నికకు బీజేపీ ఎమ్మెల్యేలు దూరంగా ఉన్నారు. అసెంబ్లీ స్పీకర్ ఎన్నికకు సంబంధించి బుధవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు గడువు విధించారు. గడ్డం ప్రసాద్‌కుమార్ పేరును కాంగ్రెస్ ఇదివరకే ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌తో కలిసి బీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయానికి వెళ్లి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు మద్దతు ఇవ్వాల్సిందిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కోరారు. కాంగ్రెస్ నుంచి అందిన వినతి మేరకు స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తూ ప్రసాద్‌కుమార్ నామినేషన్ పత్రాలపై కేటీఆర్‌తో పాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలు బండారు లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, కాలె యాదయ్యలు సంతకాలు చేశారు. బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నుంచి కేటీఆర్, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ తదితరులు జట్టుగా అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులకు ప్రసాద్ కుమార్ తరఫున నామినేషన్ పత్రాలు అందజేశారు. తెలంగాణ తొలి శాసనసభలో బీసీ సామాజికవర్గానికి చెందిన మధుసూదనాచారి స్పీకర్‌గా పనిచేయగా, రెండో శాసనసభలో ఓసీ సామాజికవర్గానికి చెందిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్పీకర్‌గా వ్యవహరించారు. ప్రస్తుత మూడో శాసనసభలో దళిత సామాజికవర్గానికి చెందిన గడ్డం ప్రసాద్‌కుమార్ స్పీకర్‌గా ఎన్నికయ్యారు.

ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు మరోసారి పెంపు

- ఇంటి అడ్రసు తదితర వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసుకునేందుకు 2024 మార్చి వరకు ఉచితం
- ఆదేశాలు జారీ చేసిన యూఐడీఏఐ



సాక్షి, అమరావతి: ఆధార్‌లో అడ్రసు తదితర వివరాలను సొంతంగా అధికారిక ఆన్‌లైన్ వెబ్‌పోర్టల్‌లో అప్‌డేట్ చేసుకునే వారికి ఆ సేవలను ఉచితంగా అందజేసే గడువును ఆధార్‌కార్డుల జారీ సంస్థ యూఐడీఏఐ మరోసారి వచ్చే ఏడాది మార్చి 14వ తేదీ వరకు పొడిగించింది. ఆధార్‌కార్డులు కలిగి ఉన్న ఎవరైనా ఆ కార్డు పొందిన పదేళ్ల గడువులో ఒక్కసారైనా వారికి సంబంధించి తాజా అడ్రసు తదితర వివరాలను కచ్చితంగా అప్‌డేట్ చేసుకోవాలని యూఐడీఏఐ గతంలోనే సూచించింది. ప్రభుత్వ పరంగా అన్ని కార్యక్రమాల్లో ఆధార్ వినియోగం పెరిగిన నేపథ్యంలో వినియోగదారుడి పాత సమాచారం కారణంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు యూఐడీఏఐ అప్పట్లో ప్రకటించింది. అదే సమయంలో.. ఆధార్‌కు సంబంధించి వివిధ రకాల సేవలను పొందాలంటే యూఐఏడీఐ నిర్ధారించిన నిర్ణీత ఫీజు చెల్లించాల్సి ఉండగా.. ఆన్‌లైన్‌లో సొంతంగా ఆధార్ వివరాలు అప్‌డేట్ చేసుకునే వారికి ఆ సేవలకు మినహాయింపు ఉంటుందని కూడా అప్పట్లో ప్రకటించింది. మొదట 2023 ఫిబ్రవరి వరకే ఈ ఉచిత సేవలని యూఐడీఏఐ ప్రకటించగా.. అనంతరం ఆ గడువును మూడు దఫాలు పొడిగించింది. తాజాగా నాలుగోసారి 2024 మార్చి 14 వరకు గడువు పొడిగిస్తున్నట్టు పేర్కొంటూ యూఐడీఏఐ డిప్యూటీ డైరెక్టర్ సీఆర్ ప్రభాకరన్ తాజాగా ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్రపతి శీతాకాల విడిదికి ఘనంగా ఏర్పాట్లు

ఉన్నతాధికారులతో సమీక్షించిన సీఎస్ శాంతికుమారి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు శీతాకాల విడిదికి కోసం హైదరాబాద్ వస్తున్న నేపథ్యంలో ఘనంగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉన్నతాధికారులను ఆదేశించారు. రాష్ట్రపతికి ఘనస్వాగతం పలకడంతోపాటు, శాఖల మధ్య సమన్వయంతో వ్యవహరించాలని, ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆమె స్పష్టం చేశారు. సచివాలయంలో ఆమె డీజీపీ రవిగుప్తా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్‌శర్మ, సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి శేషాద్రి, ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వి, సీనియర్ పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రపతి విడిది చేసే బొల్లారంలోని రాష్ట్రపతి భవన్ వద్ద పటిష్టమైన బందోబస్తుతో పాటు, ట్రాఫిక్ సమస్యలేవీ రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వీవీఐపీల భద్రతకు ఉపయోగించే బ్లూబుక్ ఆధారంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు.

ఎంపీ పదవికి కొత్త ప్రభాకర్‌రెడ్డి రాజీనామా

లోక్‌సభ స్పీకర్‌ను కలిసి రాజీనామాపత్రం అందజేత



సాక్షి, న్యూఢిల్లీ: దుబ్బాక ఎమ్మెల్యేగా ఇటీవల గెలుపొందిన మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తన లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. బుధవారం ఉదయం పార్లమెంట్‌లో స్పీకర్ ఛాంబర్‌లో బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వర్‌రావుతో కలిసి స్పీకర్ ఓం బిర్లాను కలిసి తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు మెదక్ ఎంపీ పదవికి రాజీనామా చేసిన తర్వాత జరిగిన ఉప ఎన్నికలో కొత్త ప్రభాకర్‌రెడ్డి మెదక్ ఎంపీగా గెలుపొందారు. అనంతరం 2019 సార్వత్రిక ఎన్నికల్లోనూ 3.16 లక్షల మెజారిటీతో ఆయన విజయం సాధించారు. లోక్‌సభ స్పీకర్‌ను కలిసే ముందు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ప్రభాకర్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చేగుంట–మెదక్‌ల మధ్య లెవల్ క్రాసింగ్ 228 వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ)ను నిర్మించాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ రహదారిపై ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ఆర్‌ఓబీ నిర్మాణాన్ని ప్రత్యేక అంశంగా పరిగణించి వీలైనంత త్వరగా చేపట్టాలని వినతి పత్రాన్ని సమర్పించారు.

16 నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

- రాష్ట్రంలో 40 రోజుల పాటు కేంద్ర పథకాలపై అవగాహన కార్యక్రమాలు
- కేంద్రం, కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వం, బీజేపీ సమన్వయం
- 2047 కల్లా సుసంపన్న భారత్‌గా మార్చాలనే సంకల్పం

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 16 నుంచి రాష్ట్రంలో 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. కేంద్రం, కేంద్రంలోని వివిధ మంత్రిత్వ శాఖలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం, బీజేపీల సమన్వయంతో వివిధ సంస్థలను కూడా భాగస్వాములను చేసేలా చర్యలు చేపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలపై దాదాపు 40 రోజుల పాటు ప్రచార రథాల ద్వారా అన్ని గ్రామ పంచాయతీల్లో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని వారి కోసం అమలు చేస్తున్న పథకాలు, గిరిజనులు, ఆదివాసీలకు పథకాలు, కార్యక్రమాల గురించి వివరించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన, పీఎం ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, పీఎం విశ్వకర్మ, కిసాన్ సమ్మాన్ నిధి, జనధన్ యోజన, పీఎం ప్రణామ్, తదితరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. వివిధ పథకాల కింద అర్హులైనప్పటికీ ఇప్పటివరకు ప్రయోజనం పొందని బలహీన వర్గాలను చేరుకోవడం లక్ష్యంగా సమాచార వ్యాప్తి, అవగాహన కల్పన, అర్హులైన లబ్ధిదారుల నమోదు వంటివి చేపట్టనున్నారు.

పార్టీ తరఫు కన్వీనర్‌గా ఏవీఎన్ రెడ్డి

2047 కల్లా అభివృద్ధి చెందిన సుసంపన్న దేశంగా భారత్‌ను మార్చాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా చేపడుతున్నారు. వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికల్లాంటివి లేని రాష్ట్రాల్లో ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొన్నిచోట్ల ముగిసింది కూడా. కాగా రాష్ట్రంలో బీజేపీ తరఫున కార్యక్రమ కన్వీనర్‌గా ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి వ్యవహరించనున్నారు. రాష్ట్రాన్ని నాలుగు జోన్లుగా విభజించి ఒక్కో జోన్‌కు పార్టీ నాయకుడు ఒకరిని ఇన్‌చార్జిగా నియమించనున్నట్టు సమాచారం. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరగనున్న సమావేశంలో సంకల్ప యాత్రకు సంబంధించి చేపట్టాల్సిన కార్యాచరణపై బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌ఛుగ్, కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి నిర్ణయం తీసుకోనున్నారు.

రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి కొనసాగింపు?

నచ్చజెప్పిన బీజేపీ జాతీయ నాయకత్వం.. అంగీకరించిన కేంద్రమంత్రి!



సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని కొనసాగించాలని ఆ పార్టీ జాతీయ నాయకత్వం నిర్ణయించినట్టు సమాచారం. కాగా అందుకు ఆయన అంగీకరించారని పార్టీలో ప్రచారం జరుగుతోంది. గతంలో బండి సంజయ్ స్థానంలో నియమించినప్పుడే.. శాసనసభ ఎన్నికల దాకే ఆ బాధ్యతలు నిర్వహిస్తానని కిషన్‌రెడ్డి నాయకత్వానికి చెప్పారని, అదీగాక ఈ ఎన్నికల్లో పార్టీ ఆశించిన ఫలితాలు సాధించక పోవడంతో తనను బాధ్యతల నుంచి తప్పించాల్సిందిగా కోరారని తెలిసింది. సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పూర్తి సమయం కేటాయించాలని కిషన్‌రెడ్డి భావిస్తున్నట్టు చెబుతున్నారు. అయితే లోక్‌సభ ఎన్నికలు ముగిసేదాకా కొనసాగాలని నాయకత్వం ఆయనకు నచ్చజెప్పినట్టు సమాచారం. దీంతో పార్లమెంటు ఎన్నికల దాకా కొనసాగేందుకు ఆయన ఒప్పుకున్నట్టుగా పార్టీలో ప్రచారం జరుగుతోంది. మరో 3, 4 నెలల్లోనే ఈ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఫిబ్రవరిలోనే షెడ్యూల్ వెలువడే అవకాశం ఉండడంతో.. ఇంత తక్కువ వ్యవధిలో కొత్త అధ్యక్షుడు కుదురుకోవడం సాధ్యం కాదని బీజేపీ నాయకత్వం అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. కీలకమైన ఎన్నికలు కావడంతో పాటు తెలంగాణ నుంచి అధిక సీట్లు (గతంలో గెలిచిన 4 సీట్ల కంటే ఎక్కువగా) గెలిచేందుకు అవకాశం ఉందన్న అంచనాల మధ్య కిషన్‌రెడ్డినే కొనసాగించాలని భావించినట్టు సమాచారం.

రెండ్రోజుల్లో రూ.2 లక్షల రుణమాఫీ ఏమైంది?

సాధ్యంకాని హామీలతో కాంగ్రెస్ మభ్యపెట్టింది.. మీడియాతో ఇష్టాగోష్టిలో మాజీ మంత్రి కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ ఏమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు ప్రశ్నించారు. కొత్త ప్రభుత్వం మొట్టమొదటి మంత్రివర్గం సమావేశంలోనే ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామన్న హామీ ఏమైందని ఆయన నిలదీశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టిందని, అసలు ఆట ఇప్పుడుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. బుధవారం అసెంబ్లీ ఆవరణలోని బీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో కేటీఆర్ మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసి అప్పగించారనే పాత చింతకాయ పచ్చడినే శుక్రవారం జరిగే అసెంబ్లీ ఉభయ సభల సమావేశాల్లో గవర్నర్ నోటితో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిస్తుందని ఎద్దేవా చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల పద్దులపై గతంలో కాంగ్రెస్ హయాంలో ఏనాడూ చర్చ జరగలేదని, తాము మాత్రం పద్దులపై ప్రతీ ఏటా శ్వేతపత్రం విడుదల చేయడంతో పాటు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, కాగ్ నివేదికలను ఇచ్చామన్నారు. ప్రతీ ఏడాది తమ ప్రభుత్వం ఇచ్చిన ఆడిట్ రిపోర్ట్ శ్వేతపత్రం లాంటిదేనని, ప్రతీ అసెంబ్లీ సమావేశంలో అప్పుల వివరాలు సమర్పించామన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు అసెంబ్లీకి ఇచ్చిన నివేదికను కాంగ్రెస్ నేతలు చదవకపోతే ఏం చేస్తామన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని పరోక్షంగా ఉద్దేశిస్తూ 'ఒక ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో 45వేల ఉద్యోగాలు ఇస్తామని చెప్తున్నారు. ఇలాంటి హామీలు అనేకం ఉన్నాయి. పాలకుర్తిలోనూ నిరుద్యోగం ఉండటమేంటి, ఉద్యోగాల మేళా పెడతాం అని అక్కడి ఎమ్మెల్యే అంటున్నారు.. వేచి చూద్దాం' అని కేటీఆర్ పేర్కొన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారు

- తొమ్మిదిన్నరేళ్లలో రూ.4.50 లక్షల కోట్లకు పెంచేశారు
- బీఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి ఉత్తమ్ విమర్శలు
- ఎంపీ పదవికి రాజీనామా



ఢిల్లీలో సోనియా గాంధీ, రాహుల్‌ను కలిసిన ఉత్తమ్ దంపతులు

సాక్షి, న్యూఢిల్లీ: గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి, వాస్తవాలను దాచి రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. కొత్తగా రాష్ట్రం ఏర్పడే నాటికి రూ.67 వేల కోట్లుగా ఉన్న అప్పులను తొమ్మిదిన్నరేళ్లలో ఏకంగా రూ.4.50 లక్షల కోట్లకు పెంచేశారని ధ్వజమెత్తారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించి రూ.81 వేల కోట్లు, పౌర సరఫరాల శాఖకు సంబంధించి రూ.56 వేల కోట్లు అప్పులున్నాయని తేలిందని, ఇరిగేషన్‌కు సంబంధించి రూ.10 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని ఉత్తమ్ తెలిపారు. ఇరిగేషన్, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, మేడిగడ్డ కుంగిన ఘటనలపై విచారణ జరుగుతుందని, విచారణను జాతీయ సంస్థలతో చేయించాలా లేక రాష్ట్ర సంస్థలతోనా? అన్నది ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయిస్తామని మంత్రి చెప్పారు. మేడిగడ్డ డిజైన్, నిర్వహణ లోపాలకు ఎవరు బాధ్యులన్నది తేలుస్తామన్నారు.

సోనియా, రాహుల్‌తో భేటీ

హుజూర్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన నేపథ్యంలో ఉత్తమ్ బుధవారం తన ఎంపీ పదవికి రాజీనామా చేశారు. స్పీకర్ ఓంబిర్లాను కలిసి రాజీనామా పత్రం అందజేశారు. అనంతరం తన సతీమణి, ఎమ్మెల్యే పద్మావతితో కలిసి కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలతో భేటీ అయ్యారు. తనకు మంత్రివర్గంలో చోటు కల్పించినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు.

మా హయాంలో ఎవరినీ ఇబ్బంది పెట్టలేదు

- కేసీఆర్ పగబట్టి ఉంటే కాంగ్రెస్ నేతలు జైళ్లలో ఉండేవారు
- ఓటమి స్పీడ్‌బ్రేక్ లాంటిదే..
- నర్సాపూర్‌లో ఎమ్మెల్యే హరీశ్‌రావు



నర్సాపూర్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పనితనమే తప్ప.. పగతనం తెలియదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు అన్నారు. ఒకవేళ కేసీఆర్ పగబట్టి ఉంటే రాష్ట్రంలో చాలామంది కాంగ్రెస్ నాయకులు జైలుపాలై ఉండేవారని చెప్పారు. బుధవారం ఆయన మెదక్ జిల్లా నర్సాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన కృతజ్ఞతా సభలో మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో ఎవరినీ ఇబ్బంది పెట్టలేదని హరీశ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ గోబెల్స్‌లా ప్రచారం చేసి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కేసీఆర్ ప్రజల పక్షాన ఆలోచించారని, కష్టపడి సాధించిన తెలంగాణను ఇష్టపడి అభివృద్ధి చేసే దిశగా ప్రజల కోసం పని చేశారని పేర్కొన్నారు. 2001 నుంచి ఎన్నో విజయాలు, అపజయాలు చూశామని చెప్పారు. ఓటమి అనేది స్పీడ్ బ్రేకర్ లాంటిదని, స్పీడ్ బ్రేకర్‌తో వేగం తగ్గుతుందే తప్ప వాహనం పూర్తిగా నిలిచిపోదని చెప్పారు. కొంతకాలం ఆగితే బీఆర్ఎస్ పార్టీ గమ్యం చేరుతుందని, ముందు అద్భుత భవిష్యత్ మనదేనని హరీశ్ పేర్కొన్నారు. కాగా, పార్లమెంట్‌పై దాడి అమానుషమని హరీశ్‌రావు అన్నారు. పార్లమెంట్ సమావేశాలు కొనసాగుతున్న సమయంలో దాడి జరగడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కడియం వ్యాఖ్యలపై కేసీఆర్, కేటీఆర్ మాట్లాడాలి

- ప్రభుత్వాన్ని కూలుస్తామన్న మాటలపై సమాధానం చెప్పాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్
- ప్రజల్లోనే కాదు.. అధికారుల్లో కూడా భయం పోయి ధైర్యం వచ్చింది



కార్యకర్తలు బహూకరించిన తల్వార్‌తో పొన్నం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ప్రభుత్వాన్ని కూల్చేస్తామంటున్న బీఆర్ఎస్ నేత కడియం శ్రీహరిలాంటి వారు చేసే వ్యాఖ్యలను కాంగ్రెస్ శ్రేణులు తిప్పికొట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా కరీంనగర్ జిలా కేంద్రానికి వచ్చిన ఆయనకు పార్టీ నేతలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇందిరాచౌక్‌లో నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వం కొలువుదీరి ఆరు రోజులు కాక ముందే సర్కారును కూలుస్తామన్న కడియం శ్రీహరి వ్యాఖ్యలపై కేసీఆర్, కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇంతకాలం నెలకొన్న నియంతృత్వం పోయి ప్రశాంతత చేకూరిందన్నారు. ఒకప్పటిలా అధికారులు భయంగా బతకడం లేదని వాట్సాప్ కాల్స్ నుంచి వాయిస్‌కాల్‌కు వచ్చారని వ్యాఖ్యానించారు.

అప్పులపై అధికారులు శ్వేతపత్రమివ్వాలి

సీఎం రేవంత్‌రెడ్డి విద్యుత్ శాఖ సమీక్షిస్తే.. రూ. 85 వేల కోట్ల అప్పులు, పౌరసరఫరాల శాఖ సమీక్షలో రూ.56 వేల కోట్ల అప్పులు వెలుగుచూశాయని పొన్నం పేర్కొన్నారు. అన్నిశాఖల అధికారులను అప్పులపై శ్వేతపత్రం ఇవ్వాలని ఆదేశించామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా ఆరు గ్యారెంటీలను ఆగకుండా ముందుకు తీసుకెళ్తామన్నారు.

'కమలం'లో కదలిక

- ఎట్టకేలకు అసెంబ్లీ ఫలితాలపై సమీక్షకు బీజేపీ రెడీ
- 15న రాష్ట్ర కమిటీ, జిల్లా అధ్యక్షులు, ఇతర నేతలతో రెండు వేర్వేరు సమావేశాలు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సమీక్షకు బీజేపీ ఎట్టకేలకు సిద్ధమైంది. రెండు వారాలు గడిచినా రాష్ట్ర, జాతీయ నాయకత్వాలు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే ఈనెల 15వ తేదీన రాష్ట్ర పదాధికారులు, రాష్ట్ర కమిటీ, జిల్లా అధ్యక్షులు, ఇన్‌చార్జ్‌లు, పార్లమెంట్ ప్రభారీలు(ఇన్‌చార్జ్), ఇతర నేతలతో రెండు వేర్వేరు సమావేశాలు నిర్వహించనున్నారు. బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి తరుణ్‌ఛుగ్, కేంద్రమంత్రి, రాష్ట్రపార్టీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ తదితర నేతలు హాజరవుతారు. ఈ సమావేశాల్లో అసెంబ్లీ ఫలితాల్లో ఎదురైన ఎదురుదెబ్బలు, చేదు జ్ఞాపకాలను వెనక్కి నెట్టి, లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి అత్యధిక సీట్లు గెలిచే లక్ష్యంతో ముందుకెళ్లాలని రాష్ట్ర పార్టీకి జాతీయ నాయకత్వం దిశానిర్దేశం చేయనున్నట్టు సమాచారం. 'విశ్వకర్మయోజన'ను రాష్ట్రంలో మరింత వేగంగా అమలు చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపైనా చర్చించనున్నారు. ఇదిలా ఉంటే, ఎన్నికల ఫలితాల తీరుపై జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిల్లో కోర్‌కమిటీలో చర్చించుకోవాలని జిల్లా, అసెంబ్లీ కమిటీలకు కిషన్‌రెడ్డి సూచినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

క్షేత్రస్థాయిలోనూ లోతైన పరిశీలన

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కూడా జిల్లా అధ్యక్షులు, పోటీచేసిన అభ్యర్థులు, ఇతర నేతలతో అసెంబ్లీ కోర్ కమిటీలు సమావేశమై క్షేత్రస్థాయిలో లోతైన పరిశీలన చేయనున్నారు. ఈ సమీక్షలకు రాష్ట్రపార్టీ నుంచి ఒక పరిశీలకుడు పాల్గొంటారు. ఆశించిన స్థాయిలో ఎమ్మెల్యే సీట్లు రాకపోయినా ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగినందున ఒకరిపై ఒకరు విమర్శలు, ఆరోపణలు చేసుకోకుండా వాస్తవ పరిస్థితుల ఆధారంగా సమీక్షించుకోవాలని రాష్ట్రనాయకత్వం ఇప్పటికే నేతలకు నిర్దేశించినట్టు సమాచారం. ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పని చేసిన, నష్టం కలిగించిన నాయకులు, కార్యకర్తలను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాల్సిందేననే ఆదేశాలు పంపించినట్టు తెలిసింది.

కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలు నెరవేర్చాల్సిందే

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి అప్పులున్నాయనే సాకు చెప్పి కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా తప్పించుకునే ప్రయత్నం చేయొద్దని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షల కోట్లు అప్పులు చేసిందని ఎన్నికల్లో కాంగ్రెస్ ఆరోపించిందని, అప్పులు ఉన్నాయని తెలిసినా కాంగ్రెస్ ఉచిత హామీలు ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఉచితాలు ఎరవేసి, ప్రజలను మభ్యపెట్టి.. కాంగ్రెస్ పార్టీ ఓట్లు సంపాదించిందని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎదుట అనేక సవాళ్లు ఉన్నాయని, ఏదీ ఏమైనప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిందేనని అన్నారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు ఒకటేనని, ఇప్పుడు ఎవరు ఎవరితో కలిశారో తేలతెల్లమైందని అన్నారు. బీఆర్ఎస్ సర్కార్ అవినీతిపై పోరాడింది బీజేపీ మాత్రమేనన్నారు. కాగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నేతృత్వంలోనే లోక్‌సభ ఎన్నికలకు వెళతామని చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో జాతీయస్థాయిలో 403 సీట్లు, అలాగే తెలంగాణలో కూడా మెజారిటీ ఎంపీ స్థానాలను బీజేపీ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. తెలంగాణలో బీజేపీ ఎక్కడుందని అడుగుతున్న వారికి కామారెడ్డి ఎన్నిక ఫలితాలే సమాధానమని చెప్పారు. కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహు వద్ద దొరికిన రూ.351 కోట్లు ఎక్కడివో ఆ పార్టీనేత రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని అరుణ డిమాండ్ చేశారు.

క్లుప్తంగా...



సీపీఆర్వోగా తన నియామకంపై సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న సీనియర్ జర్నలిస్ట్ బోరెడ్డి అయోధ్యరెడ్డి

సీఎం రేవంత్‌కు టీఎస్ యూటీఎఫ్ అభినందనలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) నేతలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. విద్యా రంగం బలోపేతానికి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సీఎంను కలిసిన వారిలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావ రవి, రాష్ట్ర కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, కార్యదర్శులు వెంకట్, రాజశేఖర్‌రెడ్డి, గాలయ్య, సింహాచలం వై.జ్ఞానమంజరి, పత్రిక ప్రధాన సంపాదకుడు మాణిక్‌రెడ్డి తదితరులున్నారు.

'ప్రజాస్వామ్యంపై దాడి'

సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్‌లో భద్రతాలోపం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇది యావత్ ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ఈ చర్యకు పాల్పడిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కోరారు. ఈ మేరకు 'ఎక్స్'లో ముఖ్యమంత్రి పోస్ట్ చేశారు.

'కొత్త ప్రభుత్వంలో ప్రజలకు చేరువలో రెవెన్యూ పాలన'

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వంలో రెవెన్యూ పాలన మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరువవుతుందని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగ రవీందర్‌రెడ్డి, కె.గౌతమ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. బుధవారం తెలంగాణ సచివాలయంలో ధరణిపై జరిగిన సమావేశంలో ట్రెసా ప్రతినిధి బృందం పాల్గొంది. ఈ సందర్భంగా రైతులు, సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, రెవెన్యూ శాఖ పటిష్టత కోసం క్షేత్రస్థాయి సిబ్బంది అవశ్యకతను తెలియజేస్తూ ప్రభుత్వానికి రిప్రెజెంటేషన్ అందజేశారు. కార్యక్రమంలో ట్రెసా అసోసియేట్ అధ్యక్షుడు ఫూల్‌సింగ్ చౌహాన్, ఉపాధ్యక్షుడు రమేశ్ పాక, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఎండీ వకీల్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూ బంజారా విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా వినోద్‌నాయక్

సాక్షి, హైదరాబాద్: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంలో (జేఎన్టీయూ) బంజారా విద్యార్థి సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైంది. సంఘం అధ్యక్షుడిగా ధరావత్ వినోద్ నాయక్, ఉపాధ్యక్షులుగా కేతావత్ పరమేశ్, శ్రీకాంత్.. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బానోత్ ఆకాశ్, సంయుక్త కార్యదర్శిగా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా బాదావత్ సంతోష్, కార్యదర్శిగా సురేశ్ నియమితులయ్యారు. జేఎన్టీయూ పరిధిలో గిరిజన విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఈ సంఘం కృషి చేస్తుందని నూతన కార్యవర్గం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

ఎన్‌ఐఆర్‌డీ- పీఆర్, జీబీ ఎన్‌ఐహెచ్‌ఈ మధ్య ఎంవోయూ

సాక్షి, హైదరాబాద్: గ్రామీణాభివృద్ధి కార్యకలాపాలకు మరింత ప్రాధాన్యత, ప్రోత్సాహం కల్పించేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ (ఎన్‌ఐఆర్‌డీ–పీఆర్), జీబీ పంత్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ ఎన్విరాన్‌మెంట్ (జీబీ ఎన్‌ఐహెచ్‌ఈ)ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. బుధవారం ఎన్‌ఐఆర్‌డీలో ఎన్‌ఐఆర్‌డీ–పీఆర్ డైరెక్టర్ జనరల్ డా.జి.నరేంద్ర కుమార్, స్కూల్ హెడ్స్, డా.కేశవ రావు సమక్షంలో ఈ ఎంఓయూపై ఎన్‌ఐఆర్‌డీ- పీఆర్ రిజిస్ట్రార్ మనోజ్ కుమార్, డాక్టర్ రవీంద్ర ఎస్ గావలి (సెంటర్‌హెడ్ ఎన్‌ఐఆర్‌డీ) సంతకాలు చేశారు. జీబీ ఎన్‌ఐహెచ్‌ఈ డైరెక్టర్ ప్రొఫెసర్ సునీల్ నౌటియల్, డాక్టర్ రాకేష్ కుమార్ సింగ్ (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్), డా. జగదీష్ చంద్ర ఇతర సీనియర్ అధికారులు ఆన్‌లైన్‌లో వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మెప్మా ఆర్పీల సంక్షేమ సంఘ కార్యవర్గం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న మెప్మా ఆర్పీలు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మెప్మా ఆర్పీల సంక్షేమ సంఘం అధ్యక్షురాలిగా జాజుల చంద్రకళ ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ చాంబర్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ఈమేరకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షురాలిగా తిరునగరి జోత్స్న, అధ్యక్షురాలిగా జాజుల చంద్రకళ, ఉపాధ్యక్షురాలిగా పద్మ బాలమణి మంజులను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా రేవతి, సంయుక్త కార్యదర్శులుగా శోభన, సుభద్ర, కోశాధికారిగా పద్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మత్స్యావతారంలో రామయ్య

భద్రాద్రిలో ఘనంగా వైకుంఠ అధ్యయనోత్సవాలు



భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్ర స్వామి వారి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారిని తొలుత బేడా మండపంలో వేదికపై ఆళ్వార్లతో కలిపి ఆశీనుల్ని చేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశాక, మత్స్యావతారంలో అలంకరించిన స్వామివారిని మేళతాళాలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై భక్తుల సందర్శనార్థం కొలువుదీర్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా స్థానాచార్యులు స్థలశాయి స్వామివారి మత్స్యాలంకరణ విశిష్టతను వివరించాక తిరువీధి సేవ గావించారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా గురువారం కూర్మావతారంలో స్వామి దర్శనమిస్తారు.

భట్టి అధికార నివాసంగా ప్రజాభవన్

- కేసీఆర్ నివాసం ఉన్న భవనంలోనే ఉండనున్న డిప్యూటీ సీఎం
- గతంలో సీఎం అధికారిక నివాసం కోసం ప్రగతిభవన్ నిర్మాణం
- కాంగ్రెస్ సర్కారు వచ్చాక ప్రజాభవన్‌గా పేరు మార్పు
- సీఎం అయినా సొంత నివాసంలోనే ఉంటున్న రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధికార నివాసంగా వినియోగించిన ప్రగతిభవన్ (ప్రజాభవన్)ను ఇకపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికార నివాసంగా వినియోగించుకోనున్నారు. ప్రస్తుత సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి తన సొంత ఇంటినే అధికార నివాసంగా ఎంచుకోవడంతో.. రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ సీఎంకు ఈ భవనాన్ని కేటాయించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. భట్టి మంగళవారమే ప్రజాభవన్‌ను పరిశీలించి అంగీకరించినట్టు తెలిసింది. ఇన్నాళ్లూ కేసీఆర్ నివాసమున్న భవనంలోనే భట్టి ఉండనున్నారు.

సీఎం అధికారిక నివాసం కోసం నిర్మాణం

రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, ఎవరు ముఖ్యమంత్రి అయినా.. అధికారిక నివాసంగా వినియోగించుకునే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ సర్కారు ప్రగతిభవన్‌ను నిర్మించింది. ఇందులో విశాలమైన ప్రాంతంలో సీఎం నివాసాన్ని, దాని పక్కనే మరో భవనాన్ని కట్టించింది. నిజానికి ప్రగతిభవన్‌ను నిర్మించడానికి ముందే.. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సీఎం అధికార నివాసం, క్యాంపు కార్యాలయం కోసం భవనాలు నిర్మించారు. వైఎస్సార్ ఆ అధికార నివాసంలో ఉంటూ.. పక్కనే ఉన్న క్యాంపు కార్యాలయంలో ఐఏఎస్ అధికారుల కోసం ఏర్పాట్లు చేయించారు. అక్కడే ప్రతీరోజు ప్రజలను కలుసుకునే వారు. వైఎస్సార్ ఆకస్మిక మరణం తర్వాత తదుపరి సీఎంలు రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి ఆ అధికార నివాసాన్ని వినియోగించలేదు. క్యాంపు కార్యాలయాన్నే వినియోగించుకున్నారు. 2014లో కేసీఆర్ సీఎం అయ్యాక ఐఏఎస్ అధికారుల నివాసాలను తొలగించి ప్రగతిభవన్‌ను నిర్మించారు. దీనిని ఇప్పుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అధికార నివాసంగా కేటాయించారు. పక్కనే ఉన్న మరో భవనంలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

10 రోజుల్లో నివేదిక ఇవ్వండి

- భూ సంబంధిత సమస్యలు, ధరణిపై సమగ్ర వివరాలివ్వాలి
- ధరణిపై సమీక్షలో అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం
- పోర్టల్‌ను ఎలా డిజైన్ చేశారు?.. పోర్టల్ నిర్వహించే కంపెనీలకు ఉన్న చట్టబద్ధత ఏమిటి? అంటూ ప్రశ్నలు
- ధరణికి, రైతుబంధుకు సంబంధమేంటని అడిగిన రేవంత్
- ఏమీ లేదన్న అధికారులు.. నివేదికలో అదే రాయాలని ఆదేశం
- 'కోనేరు' కమిటీ తరహాలో అధ్యయన కమిటీకి యోచన



ధరణిపై సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో రాజనర్సింహ, పొంగులేటి, భట్టి, సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని భూసంబంధిత సమస్యలు, ధరణి పోర్టల్ అంశాలపై పది రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. 'ధరణి పోర్టల్‌ను ఎలా డిజైన్ చేశారు? భూ రికార్డులు అందులో ఎలా భద్రపరిచారు? సదరు డేటా ఎక్కడ ఉంది? పోర్టల్ నిర్వహిస్తున్న కంపెనీ కాంట్రాక్టు ఎప్పటివరకు ఉంది? ఆ కంపెనీ మళ్లీ ఎందుకు వేరే కంపెనీలకు లీజుకిచ్చింది? ఈ పోర్టల్ నిర్వహిస్తున్న, నిర్వహించిన కంపెనీలకు ఉన్న చట్టబద్ధత ఏంటి? ఒకవేళ పోర్టల్‌లోని రికార్డులు కరప్ట్ అయి వివరాలన్నీ పోతే రాష్ట్రంలోని భూములకు మాన్యువల్ రికార్డులు అందుబాటులో ఉన్నాయా? ఈ పోర్టల్ ద్వారా వస్తున్న దరఖాస్తులు ఏడాదిన్నరగా ఎందుకు పెండింగ్‌లో ఉంటున్నాయి?' అని ప్రశ్నించారు. అన్ని అంశాల తో నివేదిక రూపొందించిన తర్వాత మళ్లీ సమావేశమవుదామని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన కోనేరు రంగారావు కమిటీ తరహాలో రాష్ట్రంలోని భూసమస్యల అధ్యయనానికి కమిటీ కూర్పుపై అధ్యయనం చేయాలని చెప్పారు. భూదాన్, అసైన్డ్ భూముల అంశాలపై ఇంకోసారి సమావేశమై సమగ్రంగా చర్చిద్దామని అన్నారు. బుధవారం మధ్యాహ్నం సచివాలయంలో ధరణి పోర్టల్ నిర్వహణపై సీఎం సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, సీఎస్ శాంతికుమారి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, సీసీఎల్‌ఏ నవీన్ మిత్తల్, అధికారులు, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, భూచట్టాల నిపుణుడు సునీల్‌కుమార్, రెవెన్యూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారులపై ప్రశ్నల వర్షం

సమీక్ష సందర్భంగా సీఎంతో పాటు పలువురు మంత్రులు రెవెన్యూ అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. 'నారాయణపేట జెడ్పీ చైర్మన్ ధరణి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. తన దరఖాస్తు పరిష్కారం కాకపోగా ఆ డబ్బులు మీరు తిరిగి ఇవ్వలేదు. ఆయన కోర్టుకు వెళ్లి తన డబ్బులు తనకివ్వాలని ఆర్డర్ తెచ్చుకున్నా మీరు స్పందించలేదు. ధరణి పోర్టల్ కింద చేసుకునే ప్రతి దరఖాస్తుకు రైతుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారు? ఎందుకు వసూలు చేస్తున్నారు? ఆ డబ్బులు నేరుగా ప్రభుత్వ ఖాతాకే వస్తున్నాయా? ప్రైవేటు కంపెనీకి వెళ్లి మళ్లీ ప్రభుత్వానికి వస్తున్నాయా? భూముల రికార్డులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉండడం వల్ల భూ యజమానుల హక్కులకు భంగం కలుగుతుంది కదా? డేటాను దుర్వినియోగం చేయకుండా నియంత్రించే మెకానిజం ఏంటి? స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత రద్దు చేసుకుంటే ఆ డబ్బులు రైతులకు ఎందుకు ఇవ్వడం లేదు? నిషేధిత భూముల జాబితాలో ఉన్న భూములపై విచారణ సుమోటోగా ఎందుకు చేయొద్దు? నోషనల్ ఖాతా అంటే ఏంటి? ఆ ఖాతాలో భూములెందుకున్నాయి? 31 కాలమ్స్ ఉన్న పహాణీలో 16వది అయిన అనుభవదారు కాలమ్ ఎందుకు తీసేశారు?..' అని రేవంత్ ప్రశ్నించారు.

నివేదికపై సంతకం పెట్టి ఇవ్వండి

ధరణి పోర్టల్‌కు, రైతుబంధుకు సంబంధమేంటని సీసీఎల్‌ఏ మిత్తల్‌ను సీఎం ప్రశ్నించారు. సంబంధమేమీ లేదని మిత్తల్ చెప్పగా, ఇదే విషయాన్ని ప్రభుత్వానికి ఇచ్చే నివేదికలో పొందుపర్చాలని రేవంత్ సూచించినట్టు తెలిసింది. నివేదికను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ రూపంలో కాకుండా అధికారికంగా సంతకం పెట్టి ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

వైఎస్ జగన్ వేగం మీకెందుకు లేదు?

కాంగ్రెస్ హయాంలో రెవెన్యూ సదస్సులు పెట్టిన తీరు, అనుసరించాల్సిన విధివిధానాలపై కాంగ్రెస్ నేత కోదండరెడ్డి నివేదికను సమర్పించారు. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఉన్న వేగం మీకెందుకు లేకుండా పోయిందని ప్రశ్నించారు. భూముల సర్వే, టైటిల్ గ్యారంటీ, అసైన్డ్ భూముల చట్టం, కౌలు రైతుల చట్టం అమలు లాంటి విషయాల్లో జగన్ వేగంగా దూసుకుపోతుంటే మీరేం చేశారని ప్రశ్నించారు.

కమిటీ ఏర్పాటు చేయండి: భూమి సునీల్


రాష్ట్రంలోని భూసమస్యలపై సమగ్రంగా ఆలోచించాల్సిన సమయం వచ్చిందని, ఈ సమస్యలపై అధ్యయనం చేయడానికి ఓ కమిటీని ఏర్పాటు చేయాలని భూమి సునీల్ కోరారు. భూ సంబంధిత అంశాలపై ఆయన ప్రెజెంటేషన్ ఇచ్చారు. సాదా బైనామాల చట్ట సవరణ చేయాలని, రెవెన్యూ సదస్సులు పెట్టి సుమోటోగా రైతుల సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

పెండింగ్‌లో 2.30 లక్షల దరఖాస్తులు

సమీక్షలో భాగంగా రెవెన్యూ శాఖ, సీసీఎల్‌ఏ అధికారులు ధరణిపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ పోర్టల్ ద్వారా భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం రూపొందించిన మాడ్యూల్స్‌లో ఎన్ని దరఖాస్తులు వస్తే ఎన్ని పరిష్కారమయ్యాయో వివరించారు. టెక్నికల్ మాడ్యూల్ 1 నుంచి టీఎం 33 వరకు మొత్తం 2.30 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, 1.80 లక్షల ఎకరాలకు పాస్ పుస్తకాలు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. సమీక్షలో కాంగ్రెస్ నేతలు అన్వేష్‌రెడ్డి, హర్కర వేణుగోపాల్, మన్నె నర్సింహారెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, ఎన్నం శ్రీనివాస్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డి, రాజ్ ఠాకూర్‌లతో పాటు ట్రెసా ప్రతినిధులు వంగ రవీందర్‌రెడ్డి, కె.గౌతమ్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం తరఫున వి.లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ముగిసిన ర్యాటిఫికేషన్

- ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల ధ్రువీకరణ పూర్తి
- రాష్ట్రవ్యాప్తంగా 25 వేల సీట్లకు ఉన్నత విద్యా మండలి ఆమోదం
- 34 కాలేజీలపై ఫిర్యాదులు.. ఆధారాల్లేవంటున్న అధికారులు
- 3 నెలల ముందే పూర్తి కావడంపై విద్యార్థి సంఘాల సందేహాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల ధ్రువీకరణ (ర్యాటిఫికేషన్) ప్రక్రియ దాదాపుగా పూర్తయింది. కొన్నేళ్లతో పోలిస్తే ఈ ప్రక్రియను ఇంత వేగంగా ముగించడం ఇదే తొలిసారి. వాస్తవానికి ర్యాటిఫికేషన్ కోసం ఉన్నత విద్యా మండలి అధికారులు ప్రతి ఏటా కుస్తీ పడుతుంటారు. ప్రతి ప్రైవేటు కాలేజీకి కేటాయించిన సీటును నిశితంగా పరిశీలించి, ఎలాంటి అభ్యంతరాలు లేవని మండలి సభ్యులు నిర్ణయించిన తర్వాతే ఆమోదం తెలుపుతారు. ఈ కారణంగా ర్యాటిఫికేషన్ ప్రక్రియ ప్రతి సంవత్సరం మార్చి వరకూ కొనసాగుతుంది. మండలి కార్యాలయంలో దీనికి ప్రత్యేక విభాగం కూడా ఏర్పాటు చేస్తారు. రోజుకు కొన్ని కాలేజీలు చొప్పున పెద్ద ఎత్తున ఫైళ్లతో వస్తుంటాయి. ఈసారి మాత్రం ఈ హడావుడి ఏమీ కన్పించలేదు. రాష్ట్రంలోని 150కి పైగా ప్రైవేటు కాలేజీల్లో ఉండే 25 వేల మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన ఇంత వేగంగా ముగించడం, అన్నీ సక్రమమేనంటూ ధ్రువీకరించడంపై పలు విద్యార్థి సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి.

ఫిర్యాదులకు ఆధారాల్లేవా?

ప్రతి ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీకి కొన్ని సీట్లు కేటాయిస్తారు. ఇందులో 70 శాతం కన్వీనర్ కోటా కింద భర్తీ చేస్తారు. మిగిలిన 30 శాతం సీట్లలో 15 శాతం ప్రవాస భారతీయుల పిల్లలు, ఎన్‌ఆర్‌ఐలు సిఫారసు చేసిన వారికి కేటాయిస్తారు. మిగిలిన 15 శాతం సీట్లను యాజమాన్య కోటా (బి కేటగిరీ) కింద భర్తీ చేస్తారు. అయితే వీటి విషయంలో కొన్ని షరతులు పాటించాల్సి ఉంటుంది. జేఈఈ ర్యాంకర్లకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. వాళ్ళు లేకుంటే ఎంసెట్ ర్యాంకర్లకు, ఆ తర్వాత ఇంటర్‌లో ఎక్కువ మార్కులు తెచ్చుకున్న వారికి ఇవ్వాలి. సర్టిఫికెట్లు అన్నీ సరిగ్గా ఉండాలి. బి కేటగిరీ కింద కేటాయించిన సీట్లకు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు మాత్రమే తీసుకోవాలి. అయితే కాలేజీలు ఈ నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్టుగా ప్రతి ఏటా మండలికి ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ ఏడాది కూడా 34 కాలేజీలపై 42 ఫిర్యాదులు వచ్చినట్టు మండలి వర్గాలే తెలిపాయి. అయితే వీటిని పరిశీలించేందుకు ఏర్పాటైన కమిటీని ఎలాంటి చర్యలు తీసుకున్నది అధికారులు వెల్లడించడం లేదు. అదే సమయంలో ఆధారాలుంటే తప్ప ఫిర్యాదుల విషయంలో తామేమీ చేయలేమని అంటున్నారు.

ప్రైవేటు కాలేజీలు ఖుషీ

ర్యాటిఫికేషన్ ప్రక్రియ ఈసారి సజావుగా సాగిపోవడంతో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు సంతోషంగా ఉన్నాయి. మండలికి అందిన ఫిర్యాదులన్నీ అవాస్తవమని చెబుతున్నాయి. విద్యార్థి సంఘాల పేరుతో సీట్లు డిమాండ్ చేశారని, వాటిని తిరస్కరించడం వల్లే మండలికి ఫిర్యాదు చేశారని ఆరోపిస్తున్నాయి. మరోవైపు ఇష్టానుసారం సీట్లు అమ్ముకున్నట్టుగా ఆరోపణలున్న కాలేజీల పట్ల అధికారులు సానుకూలంగా వ్యవహరించారంటూ ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసేందుకు సంఘాలు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

కేసీఆర్‌కు ప్రముఖుల పరామర్శ



కేసీఆర్‌ను పరామర్శిస్తున్న నాగార్జున, వెంకట్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును బుధవారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. కేసీఆర్‌ను పరామర్శించిన వారిలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మాజీ కేంద్ర మంత్రి రేణుకా చౌదరి, సినీ నటుడు నాగార్జున ఉన్నారు. కేసీఆర్‌ను పరామర్శించిన వారిలో రాష్ట్ర ప్రణాళిక బోర్డు మాజీ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ మంత్రి హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్, లక్ష్మారెడ్డి, జగదీశ్‌రెడ్డి, కడియం శ్రీహరి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి ఉన్నారు.

పార్లమెంట్ తరహాలో
అసెంబ్లీకి కొత్త సొబగులు

- శాసనసభ, మండలి పరిసరాలను పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి
- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోగా పూర్తి చేయాలంటూ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: వచ్చే సమావేశాలు ప్రారంభమయ్యేలోగా అసెంబ్లీ రూపురేఖలు మార్చేసి పార్లమెంట్ తరహాలో తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పార్లమెంట్ వద్ద విజయ్‌చౌక్ తరహాలో అసెంబ్లీ పరిసరాలు సిద్ధం చేయాలన్నారు. శాసనసభ స్పీకర్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం గంటన్నరకుపైగా అసెంబ్లీ పరిసరాలను పరిశీలించారు. శాసనసభ ఆవరణతో పాటు జూబ్లీహాల్‌లోని శాసనమండలిని కూడా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతమున్న వివిధ పార్టీల శాసనసభా పక్ష కార్యాలయాల బ్లాక్‌తో పాటు కొన్ని షెడ్లు కూల్చివేసి శాసనసభ, శాసనమండలి ఒకే ఆవరణలో ఉండేలా నిర్మాణాలు చేయాలన్నారు. శాసనసభ, మండలి మినహా ఇతర ఏ ఇతర రకాలైన నిర్మాణాలు అసెంబ్లీ ప్రాంగణంలో లేకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అసెంబ్లీ ఆవరణలో ప్రస్తుతమున్న భారీ వృక్షాలు తొలగించకుండానే పచ్చదనం మరింత పెంచాలని చెప్పారు. అసెంబ్లీ సభ్యులు, సిబ్బంది అవసరాలకు సరిపడేలా వాహన పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. అసెంబ్లీకి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. నాంపల్లి రైల్వేలైన్ వైపు ఉన్న ప్రహరీ ఎత్తు పెంచాలని, సభ్యులు ఉదయం పూట వాకింగ్ చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సీఎం వెంట పలువురు మంత్రులు కూడా ఉన్నారు.

సీఎంకు మండలి చైర్మన్ సన్మానం

అసెంబ్లీ ఆవరణ పరిశీలనలో భాగంగా జూబ్లీహాల్‌లోని శాసనమండలికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సన్మానించారు. సీఎం వెంట వచ్చిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు కూడా మండలి చైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగులకు అండగా ఉంటాం: భట్టి



భట్టిని అభినందిస్తున్న రాష్ట్ర ట్రెజరీ సంఘం ఉద్యోగులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు. బుధవారం రాష్ట్ర ట్రెజరీ ఉద్యోగుల సంఘం భట్టిని కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమల్లో ఉద్యోగులది కీలకపాత్ర అని పేర్కొన్నారు. ప్రజలతో పాటు ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. భట్టిని అభినందించిన వారిలో ట్రెజరీస్, అకౌంట్స్ గెజిటెడ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, కార్యదర్శి పరుశురామ్, నాయకులు జగన్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సులపై ఆటో డ్రైవర్లు అధైర్యపడవద్దు

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యంపై ఆటో డ్రైవర్లు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, 15 రోజుల్లో వారి సమస్యలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చినట్టు అఖిల భారత అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసీ) రాష్ట్ర చైర్మన్ కౌశల్ సమీర్ తెలిపారు. కేకేసీ ప్రతినిధి బృందం బుధవారం భట్టి విక్రమార్కను ఆయన నివాసంలో మర్యాదపూర్వకరంగా కలిసి శుభాకాంక్షలు తెలిపింది. అనంతరం ఆటో విభాగం రాష్ట్ర కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్ బషీర్‌బాగ్‌లో మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఆటో సంఘాల నేతలు చెప్పే మాటలు నమ్మి తొందరపడవద్దని, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలను పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం ఏర్పడి 15 రోజులు కూడా కాలేదని, అప్పుడే ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేయడం సమంజసం కాదని హితవు పలికారు.

మల్లారెడ్డిపై అట్రాసిటీ, చీటింగ్ కేసులు

- శామీర్‌పేట ఠాణాలో 9 మంది అనుచరులపై కూడా...
- 47.18 ఎకరాల వారసత్వ భూమిని మల్లారెడ్డి లాక్కున్నాడంటున్న బాధిత గిరిజనులు



శామీర్‌పేట పోలీస్ స్టేషన్ ఎదుట బాధిత గిరిజనుల నిరసన

శామీర్‌పేట్: మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితోపాటు ఆయన అనుచరులైన 9 మందిపై శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో అట్రాసిటీ, చీటింగ్ కేసులు నమోదయ్యాయి. బాధిత కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవరం రెవెన్యూ పరిధిలోని 33, 34, 35 సర్వే నంబర్లలోని 47.18 ఎకరాల భూమిని మల్లారెడ్డి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని లాక్కున్నాడని, గత నెలలో శామీర్‌పేట పీఎస్‌లో బాధిత గిరిజనులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన పోలీసులు మల్లారెడ్డితోపాటు అతని అనుచరులైన 9 మందిపై కేసులు నమోదు చేశారు.

ఠాణా ఎదుట నిరసన: మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి పోలీసులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని బాధిత గిరిజనులు ఆరోపించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఎఫ్‌ఐఆర్‌లో మల్లారెడ్డి అని మాత్రమే పేర్కొనడంతో గిరిజనులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ బుధవారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

ఎంపీటీసీకి ఏటా బడ్జెట్‌లో రూ.20 లక్షలు ఇవ్వండి

సీఎంకు తెలంగాణ ఎంపీటీసీ సంఘం విజ్ఞప్తి

లక్డీకాపూల్ (హైదరాబాద్): రాష్ట్రంలోని ఎంపీటీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర ఎంపీటీసీ సంఘం అధ్యక్షుడు గడీల కుమార్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తమ సమస్యలు తెలిసిన సీఎం సానుకూలంగా స్పందిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఏటా ప్రతి ఎంపీటీసీకి రూ.20 లక్షల చొప్పున బడ్జెట్‌లో కేటాయించాలన్నారు. గ్రామ పంచాయతీలో గౌరవప్రదమైన సీటుతో కూడిన ఒక గదిని కేటాయించాలన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలలో జెండా ఎగరవేసే గౌరవాన్ని ఇవ్వాలని కుమార్ విన్నవించారు. ఎంపీటీసీల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఏడు రకాల స్టాండింగ్ కమిటీలను పునరుద్ధరించాలని, అలాగే వారికి రూ.15 వేల గౌరవ వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. త్వరలోనే తమ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్కలకు వివరించనున్నట్లు కుమార్ వెల్లడించారు. సమావేశంలో ఎంపీటీసీ సంఘం ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

జీవో 46 రద్దు చేయించండి

గాంధీభవన్‌కు పోలీస్ ఉద్యోగార్థులు

సాక్షి, హైదరాబాద్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన జీవో 46ను రద్దు చేయించాలని పోలీస్ ఉద్యోగార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పలువురు నిరుద్యోగులు గాంధీభవన్‌కు వెళ్లారు. ఈ జీవో కారణంగా హైదరాబాద్ మినహా ఇతర జిల్లాల్లోని నిరుద్యోగులకు నష్టం జరిగిందని వాపోయారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విధంగా వెంటనే చర్యలకు ఉపక్రమించాలని కోరారు. ఈమేరకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. అంతకు ముందు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం గాంధీభవన్‌లో జరిగింది. సమావేశంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షుడు పాల్గొన్నారు. ఇటీవలి ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసిన అందరికీ సమావేశం అభినందనలు తెలిపింది.



ప్రపంచంలో ఆకలిని మించిన సాస్ (వ్యంజనం) లేదు.
– మిగెల్ డె సెర్వాంటీజ్

సాక్షి
గురువారం, 14 డిసెంబర్ 2023

మార్పులే మంత్రం!

రాజకీయాల్లో ఆశ్చర్యకర పరిణామాలు కొత్త కాదు కానీ, కొన్ని ఘటనలు అమితాశ్చర్యానికి గురి చేస్తాయి. ఆకర్షిస్తాయి. అవి సంభవించడానికి ప్రేరణ ఏమిటన్న ఆలోచనకు పురిగొల్పుతాయి. ఇటీవలి వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో 3 రాష్ట్రాల్లో విజయకేతనం ఎగరేసిన బీజేపీ కొత్త ముఖ్యమంత్రుల ఎంపిక అక్షరాలా అలాంటిదే. మూడు చోట్లా సీనియర్లను కాదని కొత్త ముఖాలను కాషాయ పార్టీ ఎంచుకున్న తీరు ఆశ్చర్యాన్నీ, ఆలోచననూ కలిగిస్తోంది. కొత్త నేతల పేర్లు పెద్దగా తెలియకున్నా... రకరకాల స్థానిక సామాజిక వర్గాల లెక్కలను పరిగణనలోకి తీసుకొన్నాకనే మధ్యప్రదేశ్‌లో మోహన్ యాదవ్, ఛత్తీస్‌గఢ్‌లో విష్ణుదేవ్ సహాయ్, రాజస్థాన్‌లో భజన్‌లాల్ శర్మలను అధిష్ఠానం ఎంపిక చేసినట్టుంది. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు రానున్న వేళ కమలనాథులు అనుసరిస్తున్న ఈ కొత్త సీఎం ముఖాల వ్యూహం లోతుపాతుల పట్ల అంచనాలు, విశ్లేషణలను పెంచుతోంది.

ప్రజాస్వామ్యంలో సభలో సంఖ్యా బలంతో అధికార పీఠంపై కూర్చొనే రాజకీయ పార్టీకీ, ఎన్నికైన ఆ పార్టీ చట్టసభ సభ్యులకూ తమకు నచ్చిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా ఎన్నుకొనే పూర్తి స్వేచ్ఛ, స్వాతంత్య్రం ఉంటాయి. అది ఆ పార్టీల అంతర్గత వ్యవహారం. అయితే, శ్రమించి పార్టీని అధికారంలోకి తెచ్చిన, నిలబెట్టిన సీనియర్ నేతలకు సీఎం పీఠం దక్కకపోవడం, రాజస్థాన్ లాంటి చోట్ల తొలిసారి ఎమ్మెల్యేనే సరాసరి సీఎంను చేయడం, మంత్రులుగా ఎన్నడూ పనిచేయనివారిని డిప్యూటీ సీఎంలను చేయడం విచిత్రమే. కానీ నిత్యం ఎన్నికల పోరులో ఉన్నట్టే ఏడాది పొడుగూతా శ్రమించే బీజేపీకి తనవైన లెక్కలున్నాయి. విస్తృత రాజకీయ, సైద్ధాంతిక వ్యూహమూ ఈ ఎంపికలో కనిపిస్తోంది. ప్రతి రాష్ట్రంలో ప్రాంతాల మధ్య సమతూకం పాటిస్తూ, సామాజిక వర్గాల బలాబలాలను అంచనా వేసుకొంటూ ఈ కొత్త సీఎంల ఎంపికకు వ్యూహరచన చేశారని అర్థమవుతోంది. కొత్త సీఎంలు ముగ్గురూ హిందూత్వ వాదులే. ఆరెస్సెస్‌కు సన్నిహితులే. అధినేతలకు విధేయులే.

మాజీ కేంద్ర మంత్రి, ఛత్తీస్‌గఢ్ బీజేపీ అధ్యక్షుడైన విష్ణుదేవ్‌ను అక్కడి సీఎం పీఠంపై కూర్చోబెట్టడం వెనుక దేశంలోని 9 శాతం ఆదివాసీలను అక్కున చేర్చుకొనే వ్యూహం ఉంది. ఇప్పటికే ద్రౌపదీ ముర్ముతో దేశానికి తొలి గిరిజన రాష్ట్రపతిని అందించిన బీజేపీ ఆ వర్గంతో ఓట్ల బంధాన్ని బలోపేతం చేసుకోవాలనేది ఎత్తుగడ. ఇక, మధ్యప్రదేశ్‌లో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, విద్యామంత్రిగా పనిచేసిన మోహన్ యాదవ్ రాష్ట్రంలో బలమైన ఓబీసీ వర్గానికి చెందినవారు కావడం కలిసొచ్చిన అంశం. ఆయన డిప్యూటీలుగా బ్రాహ్మణ, ఎస్సీ వర్గీయుల్ని నియమించడంలో, ఇతర ప్రధాన ఓటుబ్యాంకుల్ని తృప్తిపరిచే యత్నం కనిపిస్తోంది. రాజస్థాన్‌లోనైతే అధికారిక ప్రకటన ముందు దాకా సమావేశ ఏర్పాట్లలో ఉన్న ఎమ్మెల్యే భజన్‌లాల్ పేరును ఆకస్మికంగా ప్రకటించారు. ఆయనే ఊహించని ఆ ఎంపిక మరోసారి పదవిపై ఆశపడ్డ వసుంధరకు అధిష్ఠానం వేసిన గుగ్లీ.

రాజవంశీయురాలైన వసుంధరా రాజె రెండు దశాబ్దాలలో తొలిసారిగా రాజస్థాన్‌లో ఇటు సీఎం కాకుండా, కనీసం సీఎం అభ్యర్థిగానైనా కాకుండా మిగిలారు. ఇక, మధ్యప్రదేశ్‌లో దీర్ఘకాలిక సీఎంగా పేరు తెచ్చుకొని, తాజా ఎన్నికల్లో ఏటికి ఎదురీది పార్టీని విజయతీరానికి చేర్చిన శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మళ్ళీ పగ్గాలు దక్కలేదు. ఛత్తీస్‌గఢ్‌కు ఒకప్పుడు సీఎంగా వ్యవహరించిన రమణ్ సింగ్ పరిస్థితీ అదే. ఇప్పుడిక ఒక విషయం స్పష్టం. వసుంధరా రాజె, చౌహాన్‌లను పక్కనబెట్టడంతో కమలం పార్టీ ఇప్పుడిక ఒకప్పటి వాజ్‌పేయి, అద్వానీల శకం నుంచి పూర్తిగా బయటపడి, మోదీ, షాల కొత్త జమానాలోకి సంపూర్ణంగా చేరుకున్నట్టే. పాత కాపులుగా చక్రం తిప్పుతున్న అనేకులకు అనధికారికంగా... అధికార పీఠం నుంచి బలవంతపు పదవీ విరమణ ఇచ్చేసినట్టే. అయితే, సీఎం పదవి ఇవ్వనంత మాత్రాన బీజేపీలో ఈ సీనియర్ల కథ ముగిసిపోయిందని అనుకోలేం. రానున్న రోజుల్లో కాషాయపార్టీ వీరి సేవలను ఎలా వినియోగించుకుంటుందో వేచిచూడాలి.

ఏమైనా, ఎన్నికల్లో గెలిచిన తొమ్మిది రోజుల తర్వాత బీజేపీ ఆచితూచి సీఎంల ఎంపిక తతంగాన్ని పూర్తిచేసింది. రాజకీయాల్లో తరాల మార్పే కాక అధికార మార్పిడి సైతం సాఫీగా సాగేలా చూసుకుంది. దేశంలో 60 ఏళ్ళు ఆ పైబడ్డ ఓటర్లు 15 నుంచి 20 శాతమే అని లెక్కలు వినిపిస్తున్న వేళ పెరుగుతున్న యువ ఓటర్లను ఆకర్షించే నవతరం నేతలను భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు తీర్చిదిద్దే పథకరచనకు విజయవంతంగా శ్రీకారం చుట్టింది. వ్యక్తుల కన్నా వ్యవస్థ (పార్టీ) పెద్దదనే నిష్ఠురసత్యాన్ని నసాళానికి అంటేలా సీనియర్లకు సంకేతించింది. ఇక, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో కొత్త సీఎంలు బుధవారం కొలువుతీరారు. కొన్ని ధార్మికస్థలాలే లక్ష్యమనిపించేలా బహిరంగ ప్రదేశాల్లో లౌడ్‌స్పీకర్లపై నిషేధమంటూ మధ్యప్రదేశ్‌లో మోహన్‌యాదవ్ పని మొదలెట్టేశారు. పాతవారిని మరిపించేలా పాలన అందించడమే కాక, తక్షణమే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి మరిన్ని సీట్లు సాధించే సవాలు ఈ ముగ్గురు కొత్త సీఎంల ముందుంది.

బీజేపీ మాత్రం వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ తమదే విజయమన్న దిలాసా కనబరుస్తోంది. తరగని మోదీ మాయ, పార్టీ సైద్ధాంతిక పునాది, ప్రారంభం కానున్న అయోధ్య రామాలయం, ఆర్టికల్ 370 రద్దు సహా ఈ కులసమీకరణాలూ తమకు లాభిస్తాయనే భరోసాతో ఉంది. మార్పే మంత్రమని నమ్మిన బీజేపీ ఇప్పటికైతే అధికారంలో ఉన్నప్పుడైనా, లేనప్పుడైనా ఓటర్లపై పట్టు నిలుపుకోవడానికీ, పెంచుకోవడానికీ పై స్థాయిలో మార్పులు కీలకమని ఆచరణలో పెట్టింది. కొత్త యంత్రాన్ని పాత సాఫ్ట్‌వేర్‌తో కాక, కొత్త సాఫ్ట్‌వేర్‌తో నడపాలని నమ్మిన బీజేపీ వ్యూహం ఏ మేరకు ఫలిస్తుందో చూడాలి. అది ఫలిస్తే ప్రతిపక్షాలెంత ఆశపడ్డా ఢిల్లీ గద్దెపై మార్పును 2024లోనూ చూడలేవు.

రాష్ట్రాల అసమానతలు తొలగాలంటే...

అభిప్రాయం



ఎస్. మహేంద్ర దేవ్

16వ ఆర్థిక సంఘం (ఫైనాన్స్ కమిషన్) నియామకం త్వరలో జరగనుందని భావిస్తున్నారు. 15వ కమిషన్ ఏర్పాటైన 2017తో పోలిస్తే ఇప్పుడు ప్రపంచ, దేశీయ సవాళ్లు భిన్నంగా ఉన్నాయి. కోవిడ్–19 ప్రేరేపించిన ఆర్థిక షాక్‌లు, భౌగోళిక రాజకీయ సవాళ్లతో సహా ప్రపంచ స్థూల ఆర్థిక అనిశ్చితిని 16వ కమిషన్ పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ఫైనాన్స్ కమిషన్ మినహా మరే ఇతర ప్రభుత్వ సంస్థ కూడా రాష్ట్రాల మధ్య అసమానతలపై దృష్టి సారించలేదని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ వైవీ రెడ్డి అన్నారు. కొన్ని రాష్ట్రాలు అఖిల భారత పేదరిక నిష్పత్తిలో చాలా వెనుకబడి ఉన్నాయి. 16వ ఆర్థిక సంఘం ఈ అసమానతలను పరిశీలించి, ఆర్థిక పరిష్కారాలను అందించాలి.

2022–23లో కేంద్రం, రాష్ట్రాల సంయుక్త లోటు, అప్పులు వరుసగా 10 శాతం, 89 శాతంగా ఉన్నాయి. కేంద్ర పన్ను రాబడిలో రాష్ట్రాలకు ఎంత ఇవ్వాలి అనే క్షితిజ లంబ(వెర్టికల్) వాటాలనూ, దాన్ని రాష్ట్రాల మధ్య ఎలా పంపిణీ చేయాలి అనే క్షితిజ సమాంతర(హారిజాంటల్) వాటాలనూ ఆర్థిక సంఘం నిర్ణయిస్తుంది. కేంద్ర పన్నుల భాగస్వామ్య పూల్‌లో రాష్ట్రాల వాటాలను 14వ ఆర్థిక కమిషన్ 32 నుండి 42 శాతానికి పెంచింది. అయితే రాష్ట్రాల సంఖ్యను 28కి తగ్గించినప్పుడు, రాష్ట్రాల వాటాను 41 శాతంగా 15వ కమిషన్ సిఫార్సు చేసింది. 2022–23లో 6.5 శాతం ఆర్థిక లోటు, 58 శాతం అప్పుతో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక అసమతుల్యతతో ఉన్నందున ఈ వాటాను పెంచే అవకాశం లేనట్లు కనిపిస్తోంది.

అయితే, 16వ ఆర్థిక కమిషన్ సెస్సులు, సర్‌ఛార్జీల అంశాన్ని పరిశీలించాలి. 2011–12లో ఉన్న 10 శాతం నికర పన్ను రాబడి (జీటీఆర్) నుండి 2019–20కి 20 శాతానికి పెరిగింది. వాస్తవానికి, కేంద్ర జీటీఆర్‌లో రాష్ట్రాల నిష్పత్తి 2018–19లో ఉన్న 36.6 శాతం నుండి 2022–23లో 30.2 శాతానికి తగ్గింది. సెస్సులు, సర్‌చార్జీల కోసం 10 శాతం జీటీఆర్ గరిష్ఠ పరిమితిగా ఉండాలని రంగరాజన్, శ్రీవాస్తవ సూచించారు. కమిషన్ దీనిని సిఫారసు చేయవచ్చు. అది 10 శాతాన్ని దాటితే, కేంద్ర పన్నులలో రాష్ట్రాల వాటాను పెంచవచ్చు. మరో మాటలో చెప్పాలంటే– సెస్సులు, సర్‌ఛార్జీల వాటాపై ఆధారపడి క్షితిజ లంబ వాటాను మార్పు చేయవచ్చు.

పెరుగుతున్న అంతరాలు

ఫైనాన్స్ కమిషన్ అమలు చేస్తున్న క్షితిజ సమాంతర పంపిణీ ఫార్ములా అనేది, రాష్ట్రాల అసమానతలను పరిష్కరించడానికి ఒక ముఖ్యమైన పరికరం. ఆర్‌బీఐ మాజీ గవర్నర్ వైవీ రెడ్డి అసమానతలపై రాసిన ఒక కథనంలో, ఫైనాన్స్ కమిషన్ మినహా మరే ఇతర ప్రభుత్వ సంస్థ కూడా రాష్ట్రాల మధ్య అసమానతలపై దృష్టి సారించలేదని సూచించారు. అంతకుముందు ప్రణాళికా సంఘం తలసరి ఖర్చులు కూడా ధనిక రాష్ట్రాలకే ఎక్కువగా ఉండేవి. కేంద్ర ప్రాయోజిత పథకాలకు తగిన వాటా రాష్ట్రాలు చెల్లించగలగాలి. కానీ దేశీయ మార్కెట్ రుణాలు, బాహ్య రుణాల నిబంధనలు, షరతులు ధనిక రాష్ట్రాలకు అనుకూలంగా ఉంటాయి. అభివృద్ధి చెందిన రాష్ట్రాలలోనే పరిశ్రమ, వ్యాపారం కేంద్రీకృతమై ఉన్నందున బ్యాంక్ రుణ పరపతి తిరోగమనంగా ఉంటుంది. కేంద్ర పన్ను రాయితీలు కూడా తిరోగమనంగానే ఉంటాయి. 12వ ఆర్థిక సంఘం నుండి 15వ ఆర్థిక సంఘం వరకు తలసరి స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)పై పోల్చదగిన డేటాను పరిగణనలోకి తీసుకున్నప్పుడు రాష్ట్రాల్లో అసమానతలు విస్తృతమవుతున్నాయి. రాష్ట్రాల వ్యాప్తంగా 'కోఎఫిషియెంట్ ఆఫ్ వేరియేషన్' 0.46 నుండి 0.67కి పెరిగింది. తలసరి జీఎస్‌డీపీలో అసమానతలు 15వ కమిషన్ నివేదికలో ఇచ్చిన డేటాలో అత్యధికంగా ఉన్నాయి. కాబట్టి, రాష్ట్ర స్థాయిలో ఆదాయంలో విస్తరిస్తున్న అసమానతలను 16వ కమిషన్ పరిగణనలోకి తీసుకోవాలి.



రాష్ట్రాలన్నింటిలోనూ, క్షితిజ సమాంతర పంపిణీ అనేది జనాభా, ప్రాంతం, తలసరి ఆదాయం వంటి సూచికలపైనా, జనాభా మార్పు, అటవీ విస్తీర్ణం వంటి ప్రోత్సాహక సంబంధిత సూచికలపైనా ఆధారపడి ఉంటుంది. రాష్ట్రాలన్నింటిలోనూ ఆదాయ అసమానతలను పరిష్కరించడానికి తలసరి ఆదాయంలో అంతరం అత్యంత ముఖ్యమైన సూచిక. 15వ కమిషన్‌లో ఆదాయ అంతరం 45 శాతం. ఆదాయ అంతరం వెనుక ఉన్న ముఖ్యమైన ఆలోచన ఏమిటంటే, రాష్ట్రాల మధ్య ఆర్థిక సామర్థ్య వ్యత్యాసాలు అనేవి పౌరులకు ఆరోగ్యం, విద్య, నీరు, పారిశుధ్యం వంటి ప్రాథమిక సేవలను పొందడానికి ఆటంకం కాకూడదు.

ఇప్పటికీ దిగువే...

ఫైనాన్స్ కమిషన్ నివేదికల్లోని పోల్చదగిన గణాంకాలను బట్టి, బిహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, అస్సాం వంటి రాష్ట్రాలు తక్కువ ర్యాంకులో ఉన్నాయి. గత రెండు దశాబ్దాలుగా వీటిలో పెద్ద మార్పు లేదు. కనిష్ఠ తలసరి జీఎస్‌డీపీ (బిహార్‌కి చెందినది) మరియు గరిష్ఠ తలసరి జీఎస్‌డీపీ నిష్పత్తి (ఇది గోవాను మినహాయించిన తర్వాత, పంజాబ్ లేదా హరియాణాను సూచిస్తుంది) 1999–2002 లోని త్రైవార్షిక సగటు 23.3 శాతం నుండి 2016–2019లో 17.7 శాతానికి తగ్గింది. బహుమితీయ పేదరికంపై నీతి ఆయోగ్ ఇటీవలి నివేదిక ప్రకారం చూసినప్పుడు, అఖిల భారత పేదరికం నిష్పత్తి అయిన 15 శాతంతో పోలిస్తే బిహార్‌లో అత్యధిక పేదరికం (33.76 శాతం) ఉంది. తర్వాతి స్థానాల్లో జార్ఖండ్ (28.81), యూపీ (22.93), మధ్యప్రదేశ్ (20.63), అస్సాం (19.35) ఉన్నాయి.

ఈ నేపథ్యంలో, 16వ కమిషన్ సిఫార్సులు అసమానతలను తగ్గించడంలో, ప్రత్యేకించి ఆదాయం విషయంలో ముఖ్యమైనవి. క్షితిజ సమాంతర పంపిణీ అనేది రాజకీయంగా అత్యంత సున్నితమైన అంశం. అధిక పనితీరు కనబరుస్తున్న దక్షిణాది రాష్ట్రాలు, కాలక్రమేణా తమ వాటా తగ్గుముఖం పట్టిందనీ, ఆదాయం, జనాభా స్థిరీకరణ, మానవాభివృద్ధిలో మెరుగైన పనితీరు కారణంగా తమను దండిస్తున్నారనీ ఫిర్యాదు చేస్తున్నాయి. పన్నుల పంపిణీకి సమాంతర పంపిణీ సూత్రంతో ముడిపెట్టకూడదని ఒక సూచన. తక్కువ అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు గ్రాంట్లు అందించవచ్చు. కానీ పన్నుల పంపిణీ అనేది మొత్తం బదిలీలలో 80 శాతంగా ఉన్నట్లయితే ప్రగతిశీలంగా ఉంటుందనీ, గ్రాంట్లు (మొత్తం బదిలీలలో 20 శాతం)గా ఉన్నట్లయితే తిరోగమన శీలంగా ఉంటుందనీ అనుభవం సూచిస్తోంది. అందువల్ల, తక్కువ తలసరి ఆదాయ రాష్ట్రాలకు సహాయం చేయడానికి గ్రాంట్లు మరింత ప్రగతిశీలంగా ఉండాలి. సాధారణంగా, అంతర్రాష్ట్ర అసమానతలను పరిష్కరించే ఏకైక సంస్థ అయినందున, ఫైనాన్స్ కమిషన్ పన్నుల పంపిణీ, గ్రాంట్లు రెండింటిలోనూ సమధర్మ సూత్రానికి మరింత సున్నితంగా ఉండాలి.

రాష్ట్రాలే ప్రగతికి కీలకం

16వ ఆర్థిక సంఘం పరిశీలించాల్సిన ఇతర అంశాలు: సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి మరిన్ని ప్రోత్సాహకాలు, మానవాభివృద్ధిని మెరుగుపరచడం, రెవెన్యూ లోటు గ్రాంట్ల పరిశీలన, స్థానిక సంస్థలకు నిధుల బదిలీ, కేంద్రం, రాష్ట్రాలు రెండూ అందిస్తున్న ఉచితాలు, కేంద్ర ప్రాయోజిత పథకాల (సీఎస్‌ఎస్) పునరుద్ధరణ. సీఎస్‌ఎస్ విషయానికొస్తే, రాష్ట్రాలు మరింత సరళతతో పథకాల రూపకల్పనలో పాల్గొనవచ్చు. ఆదాయ వ్యయాల శాతంగా ఉచితాలపై కొంత పరిమితి ఉండాలి. ఉచితాలపై సిఫార్సులు కేంద్రం, రాష్ట్రాలు రెండింటికీ వర్తిస్తాయి. ఆర్థిక నియమాల ఆధారంగా రుణాన్ని, ఆర్థిక స్థిరత్వ విశ్లేషణను అందించడానికి స్వతంత్ర ఆర్థిక మండలిని ఏర్పాటు చేయాలనే సూచనలు కూడా ఉన్నాయి.

చివరగా, సమ్మిళిత అభివృద్ధితో 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశ హోదాను సాధించాలని భారతదేశం ఆకాంక్షిస్తోంది. ఈ లక్ష్యాలను సాధించడంలో రాష్ట్రాల పాత్ర సమానంగా లేదా అంతకంటే ముఖ్యమైనది. రాష్ట్రాలు మొత్తం ప్రభుత్వ వ్యయంలో 60 శాతం ఖర్చు చేస్తాయి. విద్య, ఆరోగ్య వ్యయంలో 70 శాతం, మూలధన వ్యయంలో మూడింట రెండు వంతులు ఖర్చు చేస్తాయి. ప్రభుత్వ ఉద్యోగులలో 79 శాతం మందిని రాష్ట్రాలు నియమిస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, అంతర్రాష్ట్ర అసమానతలను తగ్గించడంలో 16వ ఆర్థిక సంఘం సిఫార్సులు ముఖ్యమైనవి.

వ్యాసకర్త హైదరాబాద్ 'ఇక్ఫాయ్'లో విశిష్ట ప్రొఫెసర్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పట్టించుకోలేదు!



భద్రతా లోపాలను రెండు సందర్భాల్లో ఎత్తిచూపాను. ప్రత్యేక సమావేశాల్లో సందర్శకుల గ్యాలరీ నుంచి స్లోగన్లు వినిపించినప్పుడు లేఖ రూపంలో; ఖలిస్తానీ తీవ్రవాది పన్నూ బెదిరింపు గురించి నిన్న జీరో అవర్లో! విషాదమేమంటే... విపక్షం నుంచి వచ్చినందువల్ల మా సూచనలను ధిక్కారంగానే చూశారు.

– ప్రియాంక చతుర్వేది, రాజ్యసభ ఎంపీ

దారుణాతి దారుణం



పార్లమెంట్ సమావేశాలు జరుగుతూ అత్యంత భద్రత ఉన్నప్పటికీ, పార్లమెంట్ మీద జరిగిన దాడి (2001 డిసెంబర్ 13)కి వార్షిక స్మరణ నేపథ్యంలో నిఘా సంస్థలు హెచ్చరికలు చేసినప్పటికీ, పన్నూ వ్యాఖ్యలతో ప్రత్యేక హెచ్చరికలు జారీ అయినప్పటికీ... పార్లమెంటులోకి చొరబాటు జరిగింది.

– శివ్ అరూర్, జర్నలిస్ట్

ఇద్దరు స్టార్లు?



ప్రతి బెంగాలీ తెలుసుకోవాల్సింది: గత రెండేళ్లలో తలసరి జీడీపీలో బెంగాల్‌ను ఒడిషా దాటిపోయింది. ఈ ఏడాది మధ్యప్రదేశ్ దాటిపో తుంది. అదృష్టవశాత్తూ బెంగాల్‌కు ఇంకా మహువా మొయిత్రా 5 స్టార్ ఫెమినిజం, మమతా బెనర్జీ 5 స్టార్ ఉదారవాదం ఉన్నాయి.

– అభిషేక్ బెనర్జీ, కాలమిస్ట్

అన్నీ అంతే!



పెప్సీ, కోక్ అనారోగ్యకరమని అందరికీ తెలుసు. కానీ ట్రాపికానా, పేపర్ బోట్, గింజర్ ఏల్, నీంబూజ్ సంగతి? ఇందులో కొన్ని తమది ఆరోగ్యకరమైన పానీయంగా, విటమిన్లతో కూడినదిగా మార్కెట్ చేసుకుంటాయి. కానీ వీటిల్లో కూడా అంతే చక్కెర ఉంటుంది.

– రేవంత్ హిమత్‌సింగ్‌కా, ఫుడ్ యాక్టివిస్ట్

సుందర కశ్మీర్!



ఆర్టికల్ 370 రద్దు నిలిచింది. కశ్మీర్ సంపూర్ణంగా భారత్‌లో ఏకీకృతమైంది. కశ్మీరీ ముస్లింల గందరగోళపు అస్తిత్వం పరిష్కృతమైంది. ముప్పై ఏళ్లుగా ఆ ప్రాంతం మీద ఉన్న జిహాదీ శిక్షను వెనక్కి తిప్పే అవకాశం వారికి దక్కింది.

– అర్షియా మాలిక్, రచయిత్రి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

జీవితాంతం జ్వలిస్తూనే...

చరిత్రలో రెండు రకాల కవులూ, కళాకారులూ మనకు గోచరిస్తారు. ప్రభు వర్గాలనూ, పాలక వర్గాలనూ కీర్తిస్తూ వారి దోపిడీ, పీడనలను సమర్థిస్తూ వారి అడుగులకు మడుగులొత్తే వారు ఒక కోవకు చెందినవారు కాగా... దానికి భిన్నంగా ప్రజల పక్షం, పీడితుల పక్షం వహించి తమ గళాన్నీ, కలాన్నీ ప్రజా ప్రయోజనాల కోసం సంధించే వారు రెండో కోవకు చెందుతారు. 'జ్వాలాముఖి' రెండోకోవకు చెందిన కవులలో ప్రముఖుడు.

ఆయన 1938 ఏప్రిల్ 12న హైదరాబాదులోని సీతారాంబాగ్‌లో జన్మించారు. చిన్నతనంలోనే తాను నివాసముండే దేవాలయ ప్రాంగణంలోని పేద అర్చకుల ఇండ్లస్థలాల సమస్యపై పోరాటం చేసి పేద ప్రజల ప్రేమకు పాత్రుడయ్యారు. ఎన్నో రుగ్మతలకు ఆలవాలమైన నేటి దోపిడీ వ్యవస్థపై 'దిగంబరకవి'గా తిరుగుబాటు బావుటాను ఎగురవేసిన ఆయన క్రమంగా తన నిరంతర అధ్యయనం, పరిశీలన ద్వారా నేటి సమాజంలోని ప్రజల కడగండ్లకు దేశంలో కొనసాగుతున్న భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీ వ్యవస్థే మూలకారణమని గ్రహించారు. ఈ దోపిడీ నిర్మూలనకు మార్క్సిజం –లెనినిజం–మావో ఆలోచనా విధానమే శరణ్యమనీ అవగాహనకు వచ్చారు. అంతేగాక భారత విప్లవోద్యమ నాయకులు కామ్రేడ్స్ తరిమెల నాగిరెడ్డి (టీఎన్), దేవులపల్లి వెంకటేశ్వరరావు (డీవీ)ల సాంగత్యం, రచనలతో ప్రభావితులై భారతదేశంలో అనుసరించ వలసిన విప్లవ మార్గం పట్ల స్పష్టతను ఏర్పరచుకున్నారు.



జ్వాలాముఖి

ఒక మానవుడు మరో మానవుణ్ణి దోచుకోవటానికి వీలులేని వ్యవస్థకు బాటలు వేసే సోషలిస్టు సమాజం కోసం జ్వాలాముఖి పరితపించారు. జన చైనా చూచి రావడం తన జీవితంలో సంతోషకరమైన సంఘటనగా చెప్పుకున్నారు. సోషలిస్టు చైనా అన్ని రంగాలలో సాధిస్తున్న గణనీయ అభివృద్ధినీ, ఈ అభివృద్ధి వెనుక ఉన్న తాత్విక చింతననూ, రాజకీయ విధానాలనూ మన దేశవ్యాప్తంగా ఎలుగెత్తి చాటారు. 'బాల్యానికి శిక్షణ, యవ్వనానికి క్రమశిక్షణ, వృద్ధాప్యానికి రక్షణ లేని దేశం ఒక దేశమేనా?' అని ప్రశ్నిస్తూ ప్రజలందరికీ ఇటువంటి మౌలిక సౌకర్యాలు సోషలిస్టు సమాజంలోనే సాధ్యపడతాయని, అటువంటి సమాజంకోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని నొక్కి చెప్పేవారు.

కామ్రేడ్ జ్వాలాముఖి చక్కటి వక్త. అన్నిరంగాల ప్రజల హృదయాలలో విప్లవ భావాలను గుదిగుచ్చటంలో ఆయన మేటి. విద్యార్థులనూ, యువకులనూ భావి భారత ఆశాకిరణాలుగా జ్వాలాముఖి అభివర్ణించేవారు. భారత సమాజంలోని సమస్యలన్నింటికీ మౌలిక పరిష్కార మార్గాన్ని చూపిన కామ్రేడ్స్ డీవీ, టీఎన్‌ల విప్లవకర జీవితాలనుండి స్ఫూర్తిని పొందాలని చెప్పేవారు. పేదరికం, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం వంటి సమస్యలు చుట్టుముట్టినా లెక్క చేయకుండా జ్వాల విప్లవ ఆశయాల కోసం జీవితం అంతా పోరాడుతూ 2008 డిసెంబర్ 14న తుది శ్వాస విడిచారు. ఆయన జీవితం నుండి స్ఫూర్తినీ, ప్రేరణనూ పొంది, ఆయన ఆశించిన నూతన సమాజ స్థాపన కోసం కృషి చేయటమే ఆ విప్లవ తపస్వికి మనమందించే నివాళులు!

– సి. భాస్కర్, యూసీసీఆర్ (ఎం–ఎల్)

సవరణ తప్పట! రద్దు మాత్రం రైటట!!

సందర్భం




మాడభూషి శ్రీధర్

కేంద్ర ప్రభుత్వం జమ్మూ–కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని ఇచ్చే 370 అధికరణాన్ని రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ అధ్యక్షతన న్యాయమూర్తులు ఎస్కే కౌల్, సంజీవ్ ఖన్నా, బీఆర్ గవాయ్, సూర్యకాంత్ లతో కూడిన రాజ్యాంగ బెంచి కీలకమైన తీర్పును వెలువరించింది. దేశ సమగ్రతను పరిరక్షించాలంటూ సొలిసిటర్ జనరల్ 'సమర్థవంతంగా' వాదించడంతో ఒకే ఒక్క అంశం మినహా అన్ని అంశాలలో అత్యున్నత న్యాయస్థానం, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం వాదనలతో పూర్తిగా ఏకీభవించింది. రాజ్యాంగ నిపుణులూ, 'రూల్స్ ఆఫ్ లా' తెలిసిన వాళ్లూ తీవ్రంగా ఆలోచించవలసిన విషయం ఇది. ఈ 370 అధికరణ రద్దుపై తీర్పు దాదాపు అన్ని వాదాలనూ అంగీకరించింది. అయితే ఆర్టికల్ 370 రద్దు కోసం ఆర్టికల్ 367ను సవరించడం చట్టబద్ధం కాదని కోర్టు పేర్కొనడం గమనార్హం.

సుప్రీంకోర్టు చర్చించిన ఎనిమిది ప్రశ్నలకు జవాబులు వచ్చాయి. అయితే అందులో 6వ అంశాన్ని నిశితంగా పరీక్షించాల్సి ఉంది. ఈ అంశాన్నే కోర్టు తప్పు పట్టింది. ఆర్టికల్ 370ని రద్దు చేయడం కోసం ఆర్టికల్ 367ను సవరించడం మొత్తం చట్టపరమైన ప్రక్రియకు కీలకమైనది. అయితే ఈ సవరణ చట్టబద్ధం కాదని న్యాయమూర్తుల ధర్మపీఠం పేర్కొంది. ఆర్టికల్ 367 అనేది ఇంటర్‌ప్రెటేషన్ (వ్యాఖ్యానించే లేదా వివరించే) క్లాజ్ మాత్రమే. అంతేకానీ అది డెఫినిషన్‌ల (నిర్వచనాల)ను సబ్‌స్టిట్యూట్ (ప్రత్యామ్నాయంగా చూపే) చేసే క్లాజ్ కాదు. అందుకే 1954లో జమ్మూ–కశ్మీర్‌కు అనువర్తించేలా తెచ్చిన కాన్‌స్టిట్యూషనల్ ఆర్డర్ (సీఓ) 272 ప్రకారం ఆర్టికల్ 370 రద్దు కోసం ఆర్టికల్ 367ను సవరించడం చట్టవిరుద్ధం అని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. కోర్టు తీర్పులోని అంశాలను గమనిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

ప్రధాన న్యాయమూర్తి ఇచ్చిన విస్తృతమైన తీర్పులో సీఓ 272 ఉద్దేశ్యం ఆర్టికల్ 367లో మార్పులు చేయడానికి అన్నట్టుగా మొదట కనిపించినా, అది సమర్థంగా ఆర్టికల్ 370ని పూర్తిగా మార్చివేసిందని పేర్కొన్నారు. ఈ మార్పులు గణనీయంగా బలమైనవీ, స్థిరమైనవనీ కోర్టు పేర్కొంది. సవరణ ప్రక్రియలో రాజ్యాంగ నియమ భంగం చేస్తూ ఒక అధికరణాన్ని రద్దు చేయడానికి ఇంటర్‌ప్రెటేషన్ క్లాజ్ (వ్యాఖ్యాన నిబంధన)ను సవరించే హక్కు ప్రభుత్వానికి లేదు. ఒక రాజ్యాంగ సవరణకు నిర్దేశిత మార్గాన్ని తప్పించుకునేందుకు ఇంటర్‌ప్రెటేషన్ క్లాజ్‌ను ఉపయోగించే అధికారం లేదు కనుక ఆర్టికల్ 367ని ఆశ్రయించి ఆర్టికల్ 370కి చేసిన సవరణలు చట్టబద్ధం కాదని నిర్ధారించామనీ, ఇటువంటి అక్రమమైన పద్ధతుల ద్వారా సవరణలను అనుమతించడం దురదృష్టకరం అనీ సుప్రీంకోర్టు పేర్కొంది. ఆర్టికల్ 370 (1) (డి) కింద అధికారాన్ని ఉపయోగించి ఆర్టికల్ 370ని సవరించే అధికారం కేంద్రానికి లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ విషయంలో సీజేఐ అభిప్రాయంతో ఏకీభవిస్తూ, ఆర్టికల్ 367ను ఉపయోగించి 370ని సవరించే విషయంలో ఒక పద్ధతిని నిర్దేశించారనీ, దానిని అనుసరించకుండా దొడ్డి దారిలో అక్రమ మార్గం నుంచి సవరణ అనుమతించడం సరికాదనీ జస్టిస్ ఎస్కే కౌల్ తన తీర్పులో వ్యాఖ్యానించారు.



జమ్మూ–కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని ఇస్తున్న ఆర్టికల్ 370ని రద్దు చేయడానికి కేంద్ర ప్రభుత్వం పెద్ద కసరత్తే చేసింది. మొదటగా 'సీఓ272'గా ప్రాచుర్యం పొందిన రాజ్యాంగపు (జమ్మూ–కశ్మీర్ అనువర్తిత) ఉత్తర్వు– 1954ను రద్దు చేసి, భారత రాజ్యాంగంలోని అన్ని నిబంధనలూ జమ్మూ–కశ్మీర్‌కు వర్తిస్తాయని ప్రకటించింది. రెండవ దశలో అది రాజ్యాంగంలోని ఆర్టికల్ 367ను కూడా సవరించి, 370 ఆర్టికల్ రద్దుకు మార్గం వేసుకొంది.

పైన పేర్కొన్న రెండు దశల కన్నా ముందు, జారీ అయిన రాజ్యాంగపు (జమ్మూ–కశ్మీర్ అనువర్తిత) ఉత్తర్వు– 2019... సీఓ272 రద్దుకు కీలకమైన ఆధారం అని సుప్రీంకోర్టు నిర్ణయించింది. జమ్మూ–కశ్మీర్ రాజ్యాంగ సభ సూచనల మేరకు మాత్రమే ఆర్టికల్ 370ని సవరించాలి. కానీ ఆ రాజ్యాంగ సభ మనుగడలో లేదు కాబట్టి ఆర్టికల్ 367లో సీఓ272 ఉత్తర్వు ద్వారా ఒక క్లాజును ప్రవేశపెట్టారు. ఈ క్లాజ్ ప్రకారం ఆర్టికల్ 370 క్లాజ్(2) అనుసరించి రాష్ట్ర రాజ్యాంగ సభను 'రాష్ట్ర శాసన అసెంబ్లీ'గా చదువుకోవాలి. అయితే 2018 లోనే జమ్మూ–కశ్మీర్ శాసనసభను రద్దు చేసినందున, రాష్ట్రం రాష్ట్రపతి పాలన కింద ఉండటం వల్ల పార్లమెంటు ఆదేశం 'రాజ్యాంగ శాసన సభకు సమానం' అన్నట్టు పరిగణించారు. అంతే కాకుండా జీఓ272లో ఉన్న 'జమ్మూ–కశ్మీర్ ప్రభుత్వం' అంటే 'జమ్మూ–కశ్మీర్ గవర్నర్'గా అర్థం చేసుకోవాలి వంటి క్లాజులను ఆర్టికల్ 367లో సృష్టించారు.

వీటన్నింటినీ ఆధారంగా చూపి ఆర్టికల్ 370ని రద్దు చేయాలని సూచిస్తూ కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధమైన తీర్మానాన్ని లోక్ సభలో ప్రవేశ పెట్టింది. ఈ తీర్మానాన్ని అత్యధిక మెజారిటీతో లోక్‌సభ ఆమోదించింది. తర్వాత రాజ్యసభ ఆమోద ముద్ర వేసింది. అయితే పార్లమెంటు ఆమోదించిన చట్టపరమైన తీర్మానంపై, 2019 ఆగస్టు 6 నాటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆర్టికల్ 370కి సంబంధించిన అన్ని క్లాజులూ '2019 ఆగస్టు 6' నుంచి నిర్వీర్యం అవుతాయని నోటిఫికేషన్ (సీఓ273)ని జారీ చేశారు. ఈ విధంగా జమ్మూ– కశ్మీర్ ప్రత్యేక హోదాను సమర్థవంతంగా కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఆర్టికల్ 370(3) కింద ఈ నోటిఫికేషన్ జారీ చేసేందుకు రాష్ట్రపతి అధికారాలను ఉపయోగించుకున్నారు.

ఈ అధికరణం రాష్ట్రపతి నిర్దేశించిన తేదీ నుంచి ఉనికిలో ఉంటుందని కానీ, లేక పని చేయడం మానేస్తుందని కానీ, లేదా మినహాయింపు, సవరింపులతో పని చేస్తుందని ప్రకటించేందుకు రాష్ట్రపతికి ఆర్టికల్ 370 (3) అధికారమిస్తుంది. కనుక రాష్ట్రాన్ని జమ్మూ–కశ్మీర్, లద్దాఖ్‌లుగా విభజించేందుకు 'జమ్మూ–కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లు–2019'ను పార్లమెంటు ఆమోదించడం అత్యంత రాజ్యాంగ వ్యతిరేక చర్య. ప్రత్యేకంగా, విడిగా చూసినప్పుడు... అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు మొత్తంలో 367 అధికరణకు సవరణ చేయడం తప్పని కోర్టు చెప్పడం కేవలం ఒక అంశంగా మాత్రమే ఉందనిపిస్తోంది. కానీ, మొత్తం తీర్పే ఈ అంశాన్నే ఆధారం చేసుకొని సమర్థించడం 'రాజ్యాంగ బద్ధమేనా?'

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా'లో ప్రొఫెసర్



గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.విదియ రా.2.51 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** మూల ఉ.11.33 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ఉ.10.00 నుండి 11.32 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.04 నుండి 10.52 వరకు, తదుపరి ప.2.31 నుండి 3.19 వరకు, **అమృత ఘడియలు:** లేవు ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.25, **సూర్యాస్తమయం:** 5.24.

క్లుప్తంగా...

తలసాని ఓఎస్డీ పిటిషన్‌లో ప్రతివాదులకు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: పశుసంవర్ధక శాఖలో ఫైల్స్ చోరీ జరిగిన ఉదంతంలో తనపై నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఓఎస్డీ కల్యాణ్ కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌లో హైకోర్టు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. వారం క్రితం పశుసంవర్ధక శాఖలో ఫైల్స్ చోరీ అయిన విషయం తెలిసిందే. ఈ ఉదంతంలో కల్యాణ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. కార్యాలయం నుంచి పలు కీలక దస్త్రాలను తీసుకెళ్లారని.. మిగతా ఫైళ్లను చిందరవందరగా పడేశారని పేర్కొన్నారు. ఆఫీస్ లో సీసీ కెమెరాలను ధ్వంసం చేశారన్న వాచ్ మన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ సాగిస్తున్నారు. కల్యాణ్‌తో పాటు మరో నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ కోరుతూ కల్యాణ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.సురేందర్ బుధవారం విచారణ చేపట్టి.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు.

పంటకు తెగుళ్లు.. మెడకు అప్పులు

- గిరిజన జంట ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ భర్త మృతి.. ప్రాణాపాయస్థితిలో భార్య

కేసముద్రం: తెగుళ్లు సోకి పంట దెబ్బ తినడం, అప్పులతో తీవ్ర మనస్తాపం చెందిన గిరిజన దంపతులు ఇటీవల పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, చికిత్స పొందుతూ భర్త మృతి చెందాడు. భార్య ప్రాణాపాయ స్థితిలో ఉంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం క్యాంపుతండా జీపీలో బుధవారం వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన వివరాలివి. క్యాంపుతండాకు చెందిన ధారావత్ వీరన్న (40) లలిత దంపతులకు ఇద్దరు కుమారులు యాకేష్ (8వ తరగతి), వికాస్ (6వ తరగతి) ఉన్నారు. మూడున్నర ఎకరాల్లో ఈ ఏడాది పత్తి, మిర్చి, వరి పంటలను సాగు చేశారు. మిర్చి, పత్తి పంటలకు తెగుళ్లు సోకడంతో దిగుబడి తగ్గిపోయింది. పైగా చేతికి వచ్చిన ధాన్యం ఇటీవల కురిసిన వర్షాలతో తడిసి మొలకెత్తడంతో నష్టం వాటిల్లింది. ఈ క్రమంలో ఈనెల 8న భార్యాభర్తలిద్దరూ పంటచేను వద్దకు వెళ్లి పురుగు మందు తాగారు. ఇది గమనించిన ఇరుగు పొరుగు రైతులు వారిని ఆస్పత్రికి తరలించారు. బుధవారం పరిస్థితి విషమించడంతో వీరన్న మృతి చెందాడు. కాగా మానుకోటలోని ఓ ఆస్పత్రిలో లలిత చికిత్స పొందుతోంది.

'ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో మా జోక్యం అక్కర లేదు'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నిర్వహించిన ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కౌన్సిలింగ్‌లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని హైకోర్టు స్పష్టం చేసింది. మెడికల్ కళాశాలల్లో మిగిలిపోయిన సీట్లను కాళోజీ నారాయణ రావు యూనివర్సిటీ చట్టప్రకారమే భర్తీ చేసిందని పేర్కొంటూ.. ఈ మేరకు దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. మిగిలిపోయిన సీట్ల కౌన్సెలింగ్‌లో ఇప్పటికే సీట్లు పొందిన విద్యార్థులకు కూడా అవకాశం కల్పించారని.. తమకు అవకాశం ఇవ్వలేదని పేర్కొంటూ ఏపీకి చెందిన సాయిరేవంత్, సంకీర్తన హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. సీట్లు పొందిన విద్యార్థులకు మిగిలిపోయిన సీట్ల కౌన్సెలింగ్‌లో అవకాశం ఇవ్వరాదని గతంలో సుప్రీంకోర్టు చెప్పిందని పేర్కొన్నారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. సీట్లు పొందిన విద్యార్థులకు మిగిలిన సీట్ల కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశం ఇవ్వరాదని హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ మార్గదర్శకాల్లో ఉన్నా వర్సిటీ వాటిని పాటించలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది తిరుమలరావు వాదించారు. మిగిలిపోయిన సీట్ల కౌన్సెలింగ్ తర్వాత కూడా అంతకుముందు అడ్మిషన్లు పొందిన విద్యార్థుల స్థితిలో ఎలాంటి మార్పు ఉండదని, ఈ ప్రక్రియ అంతా స్లైడింగ్ మెథడ్ ప్రకారం జరుగుతుందని కాళోజీ వర్సిటీ తరఫు న్యాయవాది ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. నిబంధనల మేరకే కౌన్సెలింగ్ జరిగిందని పేర్కొంటూ పిటిషన్లను కొట్టివేసింది.

బస్తర్ అడవుల్లో పీఎల్‌జీఏ వారోత్సవాలు



చర్ల: ఈనెల 2 నుంచి 8వ తేదీ వరకు పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) 23వ వారోత్సవాలను జరుపుకోవాలని పిలుపునిచ్చిన మావోయిస్టు పార్టీ.. బస్తర్ అడవుల్లో వారోత్సవ సభ నిర్వహించినట్లు తెలిసింది. ఈ సభకు పెద్ద సంఖ్యలో మావోయిస్టులతో పాటు మిలీషియా సభ్యులు, కొరియర్లు, సానుభూతిపరులు హాజరైనట్లు సమాచారం. దీనికి సంబంధించి మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ బుధవారం వీడియోలను విడుదల చేసింది. పాలస్తీనాకు మద్దతుగా మావోయిస్టులు ప్రదర్శన నిర్వహించి నినాదాలు చేసినట్లు వీడియోలో తెలుస్తోంది. ఈ సందర్భంగా అమరులైన మావోయిస్టుల స్మారకార్థం ఏర్పాటు చేసిన స్థూపాలను పార్టీ ఆవిష్కరించినట్లు తెలుస్తోంది.

ఫ్యాన్‌దే ప్రభంజనం

- 25 లోక్‌సభ స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ ఘన విజయం
- ఏపీలో ఇప్పుడు ఎన్నికలు జరిగితే మళ్లీ విజయఢంకా ఖాయం
- ఒక్క స్థానంలోనూ ఉనికి చాటుకోలేని టీడీపీ
- తాజా సర్వేలో టౌమ్స్‌నౌ ఈటీజీ వెల్లడి



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని ప్రముఖ జాతీయ మీడియా సంస్థ టైమ్స్‌నౌ ఈటీజీ తాజా సర్వేలో వెల్లడైంది. రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాల్లో 24–25 సీట్లను ఆ పార్టీ చేజిక్కించుకుంటుందని ప్రకటించింది. ఫ్యాన్ తుపాన్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ, ఇతర పక్షాలు కొట్టుకుపోతాయని స్పష్టం చేసింది. టీడీపీ గరిష్టంగా ఒక స్థానంలో ఉనికి చాటుకునే అవకాశం ఉందని పేర్కొంది. జనసేన ఖాతా తెరిచే అవకాశమే లేదంది. టైమ్స్‌నౌ ఈటీజీ సర్వే ఫలితాలను బుధవారం రాత్రి టైమ్స్‌నౌ చానల్ ప్రసారం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో 2019 ఎన్నికల్లో 22 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించిన వైఎస్సార్‌సీపీ.. ప్రస్తుతం మరింత బలపడిందని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 24–25 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధిస్తుందన్నది తేల్చింది. గత ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో వైఎస్సార్‌సీపీకి ప్రజాదరణ మరింతగా పెరిగింది. అందుకే ఆ పార్టీ 22 లోక్‌సభ స్థానాల నుంచి 25 లోక్‌సభ స్థానాల్లోనూ క్లీన్ స్వీప్ చేసి, తిరుగులేని విజయం సాధించే స్థాయికి చేరుకుందని విశ్లేషించింది.

ఏపీలో 2019 ఎన్నికల్లో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు

పార్టీ	గెలిచిన లోక్‌సభ స్థానాలు
వైఎస్సార్‌సీపీ	22
టీడీపీ	03
జనసేన	0
బీజేపీ	0
ఇతర పక్షాలు	0

టైమ్స్‌నౌ ఈటీజీ తాజా సర్వే ఫలితాలు

పార్టీ	గెలిచే లోక్‌సభ స్థానాలు
వైఎస్సార్‌సీపీ	24–25
టీడీపీ	0–1
జనసేన	0
బీజేపీ	0
ఇతర పక్షాలు	0

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే పైచేయి


- తెలంగాణలో 8–10 లోక్‌సభ సీట్లు గెలిచే అవకాశం
- బీఆర్‌ఎస్‌కు 3–5 స్థానాలు, బీజేపీకీ అంతే
- టైమ్స్ నౌ–ఈటీజీ ఒపీనియన్ పోల్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఇప్పటికిప్పుడు పార్లమెంట్ ఎన్నికలు జరిగితే అధికార కాంగ్రెస్ పార్టీకి మెరుగైన ఫలితాలు దక్కే అవకాశం ఉందని ఈటీజీ సంస్థతో కలిసి టైమ్స్ నౌ చేపట్టిన ఒపీనియన్ పోల్‌లో వెల్లడైంది. పోల్ వివరాలను టైమ్స్ నౌ బుధవారం వెల్లడించింది. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు గాను కాంగ్రెస్ 8 నుంచి 10 స్థానాలు గెలిచే వీలుందని తెలిపింది. బీఆర్‌ఎస్ 3 నుంచి 5 స్థానాలు సాధించే అవకాశాలు కన్పిస్తున్నాయని పేర్కొంది. బీజేపీ కూడా కనిష్టంగా మూడు, గరిష్టంగా 5 స్థానాలు దక్కించుకునే వీలుందని తెలిపింది. వాస్తవానికి బీజేపీ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 6.92 శాతం ఓట్లు సాధిస్తే, 2023లో 13.9 శాతం తెచ్చుకుంది. 8 అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంది. అదే సమయంలో కాంగ్రెస్‌కు ఓటింగ్ 10.97 శాతం పెరిగింది. బీఆర్‌ఎస్‌కు ఓట్లు 9.52 శాతం తగ్గాయి.

సాగర్ కింద సాగు వద్దు

- యాసంగిలో నాగార్జునసాగర్ కింద క్రాప్ హాలిడే!
- కరువు పరిస్థితి కారణంగా నీరివ్వడం కష్టమని తేల్చిన 'స్కివం' కమిటీ
- కృష్ణా బేసిన్ పరిధి అంతటా ఇదే దుస్థితి
- ఏఎమ్మార్పీ, కల్వకుర్తి, భీమా తదితర ప్రాజెక్టులూ ఖాళీ
- గోదావరి బేసిన్‌లో మాత్రమే కాస్త ఆశాజనకం
- ఎస్సారెస్పీ స్టేజ్–1, 2ల కింద 11.55 లక్షల ఎకరాలకు..
- గత ఏడాదితో పోల్చితే తగ్గిన సాగు అంచనాలు
- మొత్తంగా 28.98లక్షల ఎకరాలకే సాగునీటి సరఫరా
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేసిన కమిటీ



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత యాసంగి (రబీ) సీజన్‌లో నాగార్జునసాగర్‌తోపాటు కల్వకుర్తి, భీమా, పాలేరు, వైరా, మల్లూరు, లంకాసాగర్, గొల్లవాగు ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు క్రాప్ హాలిడే ప్రకటించాలని రాష్ట్ర స్థాయి సమగ్ర నీటి ప్రణాళిక, నిర్వహణ (స్కివం) కమిటీ ప్రతిపాదించింది. ప్రస్తుత నీటి లభ్యత ఆధారంగా పెద్ద చిన్న ప్రాజెక్టులన్నింటి కింద కలిపి 28.95 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీటిని సరఫరా చేయగలమని తేల్చింది. ఈ ఏడాది వర్షాభావంతో ఎగువ నుంచి ఆశించిన వరద రాక కృష్ణా బేసిన్‌లోని శ్రీశైలం, నాగార్జునసాగర్, ఇతర ప్రాజెక్టుల్లో నిల్వలు అడుగంటిపోయాయి. దీంతో కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల కింద ఖరీఫ్ (వానాకాలం) పంటల సాగే కష్టంగా కొనసాగింది. కొంత మేర ఉన్న నీళ్లు దీనికే సరిపోయే పరిస్థితి. ఈ నేపథ్యంలో నాగార్జునసాగర్ ఆయకట్టుకు యాసంగిలో క్రాప్ హాలిడే ప్రకటించక తప్పదని స్కివం కమిటీ స్పష్టం చేసింది. రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, ఆయకట్టు విస్తీర్ణం, తాగు నీటి అవసరాలను పరిగణనలోకి తీసుకుని యాసంగి సీజన్‌లో ఏ ప్రాజెక్టు కింద ఎంత ఆయకట్టుకు సాగునీరు అందించాలనే అంశంపై రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ నేతృత్వంలో బుధవారం జలసౌధలో స్కివం కమిటీ సమావేశమై ప్రతిపాదనలను సిద్ధం చేసింది. 2023–24 యాసంగిలో 28.95 లక్షల ఎకరాలకు 215 టీఎంసీల సాగునీటిని సరఫరా చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. గత ఏడాది యాసంగి లక్ష్యం 33.46 లక్షల ఎకరాలకన్నా ఇది తక్కువ కావడం గమనార్హం.

యాసంగిలో ప్రాజెక్టుల వారీగా..

ఆయకట్టుకు నీటి సరఫరా అంచనాలివీ..

ప్రాజెక్టు	2023–24 (ఎకరాల్లో)
గోదావరి బేసిన్ పరిధిలో..	
ఎస్సారెస్పీ స్టేజ్–1	8,28,297
ఎస్సారెస్పీ స్టేజ్–2	3,26,914
కాళేశ్వరం	93,070
మధ్య మానేరు	54,224
దేవాదుల	2,02,400
నిజాంసాగర్	1,24,825
అలీసాగర్	48,282
సింగూరు	40,000
గుత్ప	33,725
కడెం	0
కృష్ణా బేసిన్ పరిధిలో..	
జూరాల	23,346
ఆర్డీఎస్	0
నాగార్జునసాగర్	0
మూసీ	30,000
నెట్టెంపాడు	5,000
కల్వకుర్తి	0
ఏఎమ్మార్పీ	0
ఎస్ఎల్‌బీసీ	0

మొత్తంగా 6.40లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇక శ్రీశైలం ప్రాజెక్టులోనూ 57 టీఎంసీలే నీళ్లు ఉండటంతో.. ఏఎమ్మార్పీ, కల్వకుర్తి ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు సాగునీరివ్వలేని పరిస్థితి. కేవలం నెట్టెంపాడు కింద 5వేల ఎకరాలకు, మూసీ ప్రాజెక్టు కింద 30వేల ఎకరాలకే సాగునీరు ఇవ్వగలమని అధికారులు పేర్కొన్నారు.

రాష్ట్రంలోని జలాశయాల్లో నీటి నిల్వల పరిస్థితి ఇదీ.. (టీఎంసీల్లో)

ప్రాజెక్టు	గరిష్ట నిల్వ	ప్రస్తుత నిల్వ
శ్రీశైలం	215	57
నాగార్జునసాగర్	312	157
శ్రీరాంసాగర్	90	78.66
మిడ్ మానేరు	27.50	23
లోయర్ మానేరు	24	19.42
ఎల్లంపల్లి	20	16.03
సింగూరు	29.17	25.81
నిజాంసాగర్	17.80	16.16
కడెం	7.60	4.3
మొత్తం	743.07	397.38

(ప్రాజెక్టుల్లో డెడ్ స్టోరేజీలుపోగా.. 215 టీఎంసీలనే వినియోగించుకోగలమని అంచనా వేశారు)

గత రెండు యాసంగి సీజన్లతో పోల్చితే ఈసారి నీటి సరఫరా లక్ష్యం

కేటగిరీ	2021–22	2022–23	2023–24
వెట్‌క్రాప్స్	11,95,256	19,81,301	11,57,014
ఆరుతడి	22,32,433	13,84,291	17,38,565
మొత్తం	34,27,689	33,65,592	28,95,579

ప్రాజెక్టుల తరహాను బట్టి నీటి సరఫరా లక్ష్యం (ఎకరాల్లో..)

ప్రాజెక్టు	2023–24 (యాసంగి)
భారీ ప్రాజెక్టులు	18,68,883
మధ్యతరహా	2,18,535
మైనర్ ప్రాజెక్టులు	6,72,938
ఐడీసీ	1,35,223
మొత్తం	28,95,579

ఆన్ ఆఫ్ పద్ధతిలో సాగునీరు

స్కివం కమిటీ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన వెంటనే ప్రాజెక్టుల వారీగా నీటి విడుదల తేదీలను ఖరారు చేసేందుకు నీటిపారుదల శాఖ కసరత్తు చేస్తోంది. ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో.. అంటే 8 రోజులు నీటి విడుదల చేస్తూ, 7 రోజులు ఆపుతూ ఇస్తారు. ఇప్పటికే ఈ దిశగా రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సాగర్ ఎడమ కాల్వ పరిధిలో కరువు

నాగార్జున సాగర్ గరిష్ట నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలుకాగా.. ప్రస్తుతం 157.61 టీఎంసీలు ఉన్నాయి. ఇందులో డెడ్ స్టోరేజీకిపైన వినియోగించుకోగలిగిన నీరు చాలా తక్కువ. దీనితో సాగర్ ఎడమ కాల్వ కింద ఆయకట్టుకు నీరివ్వలేమని అధికార యంత్రాంగం తేల్చింది. ఎడమ కాల్వ కింద

గోదావరి బేసిన్‌లో కాస్త మెరుగ్గా..

గోదావరి బేసిన్ పరిధిలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద దాదాపు 11.55లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వాలని ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఎస్సారెస్పీ నిల్వ సామర్థ్యం 90టీఎంసీలుకాగా.. ప్రస్తుతం 78.66 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. 6.50 టీఎంసీలను తాగునీటికి, మిగతా నీటిని యాసంగి పంటల కోసం కేటాయించారు. ఎస్సారెస్పీ స్టేజ్–1 కింద మొత్తంగా 9,65,013 ఎకరాలు ఉన్నా.. 8,28,297 ఎకరాలకే సాగునీరివ్వాలని లక్ష్యంగా పేర్కొన్నారు. ఇందులో 3.87 లక్షల ఎకరాలు ఆరుతడి పంటలకు, 4.41 లక్షల ఎకరాలు తరి పంటలకు నీళ్లు ఇవ్వనున్నారు.

ఫార్మాసిటీ స్థానంలో మెగా టౌన్‌షిప్

▶ మొదటి పేజీ తరువాయి

శాంతికుమారి, హెచ్‌ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్, హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, సీఎంఓ అధికారులు వి.శేషాద్రి, బి.శివధర్‌రెడ్డి, షానవాజ్ ఖాసీం తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. ఇప్పటికే ఔటర్‌రింగ్‌రోడ్డు, జీవో 111 ప్రాంతాల్లో ఎంతో అభివృద్ధి జరిగిందని, మెరుగైన రవాణా సదుపాయాలు ఉన్నాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ చెప్పారు. హైదరాబాద్ నగరం నలువైపులా సమంగా అభివృద్ధి చెందాల్సి ఉందని, ఈ క్రమంలో ఎయిర్‌పోర్టు మెట్రో అలైన్‌మెంట్ మార్చాలని పేర్కొన్నారు.

ఆ రెండు రూట్ల మీదుగా..

''హైదరాబాద్ జనాభా ఎక్కువగా సిటీ మధ్యలో, తూర్పు ప్రాంతంలో, పాతబస్తీలో ఉంది. ఈ ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందేందుకు మెట్రో అలైన్‌మెంట్ మార్చాలి. ఈ మేరకు ఎంజీబీఎస్, ఓల్డ్‌సిటీ, ఫలక్‌నుమా నుంచి ఎయిర్‌పోర్టు వరకు.. అలాగే ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట రూట్‌లో ఎయిర్‌పోర్టు వరకు మెట్రో నిర్మాణం చేపట్టాలి. అలాగే మైలార్‌దేవ్‌పల్లి, జల్‌పల్లి, పీ–7 రోడ్, లేదా బార్కాస్, పహాడీషరీఫ్, శ్రీశైలం రోడ్డు రూట్లను కూడా పరిశీలించాలి..'' అని రేవంత్ సూచించారు. ఈ రూట్లలో మెట్రో నిర్మాణానికి అయ్యే ఖర్చును అంచనా వేయాలని మెట్రో రైల్ అధికారులను ఆదేశించారు. ఎలాంటి మలుపులు లేకుండా నేరుగా ఉండే మార్గాల్లో మెట్రో నిర్మించడం వల్ల వ్యయం తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. ఎయిర్‌పోర్టు మెట్రోను శ్రీశైలం రోడ్డులోని తుక్కుగూడ వరకు పొడిగించే అంశాన్ని పరిశీలించాలన్నారు.



కేబినెట్ సమావేశంలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

ఓల్డ్ సిటీ మెట్రో ఎందుకు చేపట్టలేదు?

పాతబస్తీలోని 5.5 కిలోమీటర్ల మెట్రో రైలును ఎల్‌అండ్‌టీ ఇప్పటివరకు నిర్మించకపోవడంపై సీఎం రేవంత్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి ఎన్నో ప్రయోజనాలు పొందినా ఓల్డ్‌సిటీ మెట్రోను పూర్తి చేయకపోవడం సరికాదన్నారు. ఈ అంశంపై న్యాయ నిపుణులతో చర్చించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఎయిర్‌పోర్టు మెట్రో ప్రస్తుత అలైన్‌మెంట్ నిలిపివేత నేపథ్యంలో.. జీఎంఆర్‌తో కుదుర్చుకున్న ఒప్పందంపై కూడా నివేదిక కోరారు.

నేడు కేబినెట్ భేటీ

సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం అసెంబ్లీలో రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం జరగనుంది. అసెంబ్లీలో స్పీకర్ ఎన్నిక ప్రక్రియ పూర్తయి, సభ వాయిదా పడ్డాక ఈ భేటీని నిర్వహించనున్నారు.

నగర అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్

హైదరాబాద్ నగరాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని రేవంత్ ఆదేశించారు. మూసీ సుందరీకరణ చేపట్టాలన్నారు. తూర్పు నుంచి పడమర వరకు మూసీ మార్గంలో నాగోల్ నుంచి గండిపేట్ దాకా ఎంజీబీఎస్‌ను కలుపుతూ రోడ్, మెట్రో కనెక్టివిటీ ఉండాలని సూచించారు. హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని.. ప్రస్తుతం నగర జనాభా 2 కోట్లకు చేరువలో ఉందని చెప్పారు. భవిష్యత్తులో 3 కోట్ల జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఔటర్ చుట్టూ శాటిలైట్ టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేయాల్సి ఉందని స్పష్టం చేశారు.

వ్యవసాయ కార్పొరేషన్లు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష



సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకుని, అన్నదాతలకు ఉపయోగపడేలా కార్పొరేషన్లు పనిచేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం సచివాలయంలో ఆయన వ్యవసాయ అనుబంధ శాఖలపై మూడో రోజు సమీక్ష నిర్వహించారు. సమావేశంలో 14 వ్యవసాయ కార్పొరేషన్లకు చెందిన ఉన్నతాధికారులతో ఆయన వివిధ అంశాలపై చర్చించారు. టీఎస్ ఆయిల్ ఫెడ్, టీఎస్ ఆగ్రో, మార్క్ ఫెడ్, హాకా తదితర కార్పొరేషన్ల అధికారులు ఇందులో పాల్గొన్నారు. కార్పొరేషన్లు విజయవంతంగా రైతులకు సేవలు అందించేందుకు అవసరమైన పద్ధతులను అవలంభించాలని మంత్రి అన్నారు. పంటల సాగులో ఇతర దేశాలు అనుసరిస్తున్న అత్యాధునిక విధానాలను మనం అలవరుచుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్పొరేషన్లు కేవలం వ్యాపార దృక్పథంతోనే పనిచేయవద్దని, రైతులకు ఉపయోగపడేలా పనులు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలను వినియోగించుకోవాలని చెప్పారు. ఈ దిశగా ఇప్పటి వరకు కార్పొరేషన్లు చేసిన కృషి ఏంటో నివేదిక సమర్పించాలని అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు.

రూ.1,050 కోట్లతో 6 ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలు !

రూ.1,050 కోట్లతో 6 ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలు నిర్మించాలని ఆయిల్‌ఫెడ్ నిర్ణయించింది. ఈ మేరకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వాటికి పచ్చజెండా ఊపారు. మొదటి విడతలో 2025–26 నాటికి సిద్దిపేట, గద్వాల, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలు అందుబాటులోకి రానున్నాయి. వీటిని రూ. 600 కోట్లతో నిర్మిస్తారు. రెండో విడతలో నారాయణపేట, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో ఏర్పాటు చేస్తారు.

మా పార్టీ సభ్యులను విడుదల చేయాలి

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్

చర్ల: వయోభారం, అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమ పార్టీ సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకుని తప్పుడు కేసులతో జైలులో పెట్టడం సరికాదని, వారిని వెంటనే విడుదల చేయాలని మావోయిస్టు పార్టీ డిమాండ్ చేసింది. మావోయిస్టు పార్టీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి వర్గ సభ్యుడిగా, సెంట్రల్ టెక్నికల్ కమిటీ సభ్యుడిగా పనిచేసిన 74 ఏళ్ల వేంగ్ అలియాస్ గంగాధర్‌రావు, టెక్నికల్ విభాగం సభ్యురాలిగా పనిచేసిన ఆయన భార్య 60 ఏళ్ల భవాని వయోభారం, అనారోగ్య సమస్యలతో మంచిర్యాల జిల్లా ఇందారంలో చికిత్స పొందుతుండగా పోలీసులు అరెస్టు చేశారని పార్టీ వెల్లడించింది. ఈ సందర్భంగా పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ బుధవారం ఓ లేఖ విడుదల చేశారు. వీరికి మెరుగైన వైద్యం అందించడమే కాక జైలు నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వీరు పార్టీకి విరాళాల వసూళ్లు, యువతను నియమించడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడానికి వచ్చారంటూ పోలీసులు ప్రకటించడం సరికాదన్నారు. ఇలాంటి తప్పుడు కేసులతో సుదీర్ఘకాలం వారిని జైలులో నిర్బంధించాలనే కుట్ర జరుగుతోందని, తెలంగాణలో విప్లవోద్యమాన్ని అణచివేసేందుకే పోలీసులు ఇలా వ్యవహరిస్తున్నారని అభయ్ మండిపడ్డారు.

లోక్‌సభకు పొగ

సభలో ఇద్దరు, బయట ఇద్దరు పొగ గొట్టాలు విసిరిన వైనం

సాక్షి, న్యూఢిల్లీ: బుధవారం మధ్యాహ్నం. ఒంటి గంట సమయం. లోక్‌సభలో జీరో అవర్ ముగింపుకు వచ్చింది. బీజేపీ సభ్యుడు ఖగేన్ ముర్ము మాట్లాడుతుండగా ఉన్నట్టుండి పెద్ద శబ్దం! ఏమైందో అర్థం కాక లోక్‌సభ సభ్యులంతా ఒక్కసారిగా అయోమయానికి లోనయ్యారు. సందర్శకుల గ్యాలరీ నుంచి ఎవరో సభలోకి పడిపోయారని తొలుత భావించారు. అదేమీ కాదని, ఒక వ్యక్తి ఉద్దేశపూర్వకంగానే సభలోకి దూకాడని అర్థమై బిత్తరపోయారు. ఆలోపే మరో వ్యక్తి కూడా సభలోకి దూకి మరింత కలకలం రేపాడు. ఇద్దరూ బెంచీలపై గెంతుతూ స్పీకర్‌ను చేరుకునేందుకు వెల్‌కేసి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. బూట్లలోంచి పొగ గొట్టాలు తీసి విసిరారు. వాటినుంచి వెలువడ్డ పొగ హాలంతటా కమ్ముకుంది. ఈ పరిణామాలతో ఎంపీలు తీవ్ర ఆందోళనకు లోనై అటూ ఇటూ పరుగులు తీశారు. చివరికి ఎంపీలు, భద్రతా సిబ్బంది వారిని నిర్బంధించారు. అదే సమయంలో పార్లమెంటు ప్రాంగణం బయట కూడా పొగ గొట్టాలు విసిరి కలకలం రేపిన ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. 2001లో సరిగ్గా డిసెంబర్ 13వ తేదీనే పాకిస్తాన్‌లోని లష్కరే తొయిబాకు చెందిన ఉగ్రవాదులు పార్లమెంటు ప్రాంగణంపై దాడికి తెగబడి విచ్చలవిడి కాల్పులతో తొమ్మిది మందిని పొట్టన పెట్టుకోవడం తెలిసిందే. తాజా ఉదంతంపై కేంద్ర హోం శాఖ సమగ్ర దర్యాప్తుకు ఆదేశించింది.

తీవ్ర భద్రతా లోపం: ఎంపీలు

ఘటన అనంతరం మధ్యాహ్నం రెండింటికి లోక్‌సభ తిరిగి సమావేశమయ్యాక సభ్యులు తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. 2001 దాడి అనంతరం ఇది అతి తీవ్రమైన భద్రతా లోపమంటూ మండిపడ్డారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా దీనిపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 13లోగా పార్లమెంటుపై దాడికి పాల్పడతానంటూ ఖలీస్థానీ వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్ను హెచ్చరించిన విషయాన్ని కొందరు సభ్యులు గుర్తు చేశారు. మొదటి వ్యక్తి తన సమీపంలోనే సభలోకి దూకాడని జేడీ(యూ) ఎంపీ రామ్‌ప్రీత్ మండల్ చెప్పారు. తామంతా తీవ్ర ఆందోళనతో అటూ ఇటూ పరుగులు తీశామన్నారు. వాళ్ల దగ్గర బాంబు, మారణాయుధాలుంటే పరిస్థితేమిటని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సుదీప్ బంధోపాధ్యాయ ప్రశ్నించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపిస్తామని స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సభను వాయిదా వేసి ఈ ఉదంతంపై అఖిలపక్ష భేటీ ఏర్పాటు చేశారు. కేంద్రం తక్షణం క్షమాపణ చెప్పాలని, పార్లామెంటు భద్రతను తక్షణం మరింత కట్టుదిట్టం చేయాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. దుండగులకు పాస్‌లు సిఫార్సు చేసిన బీజేపీ ఎంపీ సింహాను విచారించాలన్నారు. ఆయన్ను తక్షణం సభ నుంచి బహిష్కరించాలని తృణమూల్ సభ్యులు డిమాండ్ చేశారు.

ఇలా జరిగింది...

సభలోకి దూకి కలకలం రేపిన వారిని కర్ణాటకలోని మైసూరుకు చెందిన డి.మనోరంజన్ (34), యూపీలోని లక్నోకు చెందిన సాగర్ శర్మ (26)గా గుర్తించారు. జీరో అవర్ కాసేపట్లో ముగుస్తుందనగా ముందుగా సాగర్ ఒక్కసారిగా గ్యాలరీ నుంచి సభలోకి దూకాడు. దాంతో ఎంపీలు షాక్‌కు గురై అటూ ఇటూ పరుగులు తీశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ గోరంట్ల మాధవ్, ఆరెల్పీ ఎంపీ హనుమాన్ బెనీవాల్ అతన్ని పట్టుకునేందుకు ప్రయతిస్తుండగానే మరో వ్యక్తి కూడా గ్యాలరీ నుంచి సభలోకి దూకాడు. ఇద్దరూ వెల్‌కేసి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. మొదటి వ్యక్తిని బెనీవాల్ తదితర ఎంపీలు పట్టుకుని దేహశుద్ధి చేశారు. నియంతృత్వం చెల్లదని అతను నినాదాలు చేశాడు. ''దగ్గరికి రావద్దు. మేం దేశభక్తులం. నిరంకుశత్వంపై నిరసన తెలపడానికే వచ్చాం'' అంటూ బిగ్గరగా అరిచాడు. ఇద్దరూ తమ బూట్ల నుంచి పొగ గొట్టం వంటివాటిని తీసి విసిరారు. వాటినుంచి వెలువడ్డ పసుపు రంగు పొగ సభ అంతటా వ్యాపించడంతో ఎంపీలంతా తీవ్ర భయాందోళనలకు లోనయ్యారు. తర్వాత ఎంపీలంతా కలిసి వారిని నిర్బంధించారు. బాగా దేహశుద్ధి చేసి పార్లమెంటు సిబ్బందికి అప్పగించారు. వెంటనే సభాపతి స్థానంలో ఉన్న రాజేంద్ర అగర్వాల్ సభను గంటపాటు వాయిదా వేశారు.

ఆరుగురూ ఒకే ఇంట్లో...

పార్లమెంటు ఆవరణలో పొగ గొట్టాలు విసిరి పట్టుబడ్డ వారిని హరియాణాలోని హిస్సార్‌కు చెందిన నీలమ్ (42), మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన అమోల్ షిండే (25)గా గుర్తించారు. వీరికి, మనోరంజన్, సాగర్‌లకు లలిత్, విశాల్ అనే మరో ఇద్దరు కూడా సహకరించినట్టు ఢిల్లీ పోలీసులు తేల్చారు. విశాల్‌ను గురుగ్రాంలో పట్టుకున్నారు. ఐదుగురినీ లోతుగా విచారిస్తున్నారు. ఆరుగురూ గ్యాలరీలోకి వెళ్లాలనుకున్నా ఇద్దరికే పాస్ దొరికినట్టు సమాచారం. వీరందరికీ కనీసం నాలుగేళ్లుగా పరిచయముందని, సోషల్ మీడియా ద్వారా టచ్‌లో ఉండేవారని చెబుతున్నారు. అంతాకొంతకాలంగా గురుగ్రాంలో లలిత్ ఇంట్లోనే ఉంటున్నట్టు పోలీసులు తెలిపారు. వీరు 3 నెలలుగా పార్లమెంటు పాస్‌ల కోసం ప్రయతిస్తున్నట్టు విచారణలో తేలింది.

సభలో లేని మోదీ, అమిత్ షా

ఘటన జరిగినప్పుడు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, మంత్రులు ప్రహ్లాద్ జోషీ, అర్జున్‌రామ్ మేఘ్వాల్‌తో పాటు కాంగ్రెస్ సభ్యులు రాహుల్ గాంధీ, అధీర్ రంజన్ చౌధరి సహా మొత్తం 100 మందికి పైగా ఎంపీలు సభలో ఉన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా లేరు.



బుధవారం పార్లమెంట్ ఆవరణలో పొగ గొట్టాలు విసిరాక పోలీసుల నిర్బంధంలో నీలం, షిండే



ఎవరీ సింహా?

దుండగులకు విజిటర్స్ పాస్‌లు సిఫార్సు చేసిన బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహా మాజీ జర్నలిస్టు. కర్ణాటకలోని మైసూరు నుంచి రెండుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. ప్రధాని మోదీ జీవిత చరిత్ర రాశారు. పార్లమెంటు కార్యకలాపాలు చూస్తామంటూ మనోరంజన్ పాస్‌లు తీసుకున్నట్టు ఎంపీ కార్యాలయం తెలిపింది. ఇలా నియోజకవర్గాల ప్రజలకు ఎంపీలు పాస్‌లు జారీ చేయడం మామూలేనంది. తాజా ఘటన నేపథ్యంలో పార్లమెంటులోకి సందర్శకులకు పాస్‌ల జారీని నిలిపేశారు.



పబ్లిక్ గ్యాలరీ నుంచి సభలోకి దూకి బల్లపైకి ఎక్కిన వ్యక్తిని పార్లమెంట్ సభ్యులు పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యం

అన్యాయంపై గొంతు ఎత్తేందుకే: నీలం

తానో నిరుద్యోగ విద్యార్థినని, తమకు ఎలాంటి సంస్థతోనూ సంబంధాలు లేవని పార్లమెంటు బయట పొగ గొట్టాలు విసిరిన నీలం చెప్పింది. రైతులు, చిన్న వ్యాపారులు, అణగారిన వర్గాల వారికి జరుగుతున్న అన్యాయంపై గొంతెత్తేందుకే నిరసన తెలిపామని వివరించింది. నీలం, షిండే ఇద్దరూ భారత్‌మాతా కీ జై, జై భీం అంటూ నినాదాలు చేశారు. బీఏ చదివిన షిండే పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాడు. తల్లిదండ్రులు, ఇద్దరు సోదరులతో పాటు కూలీ పనులు కూడా చేసేవాడని మహారాష్ట్ర పోలీసులు తెలిపారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ కోసమని చెప్పి డిసెంబర్ 9న అతను ఢిల్లీ బయల్దేరినట్టు తల్లిదండ్రులు చెప్పారు.

తప్పు చేస్తే ఉరేయండి: మనోరంజన్ తండ్రి

మైసూరు: తన కొడుకు మంచివాడని మనోరంజన్ తండ్రి దేవరాజే గౌడ అన్నారు. తప్పు చేసుంటే అతన్ని ఉరి తీయాలని మైసూరులోని విజయనగరలో మీడియాతో అన్నారు. ''మనోరంజన్ 2014లో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. ఉద్యోగంలో చేరకుండా పొలం పనులు చేసుకుంటూ బతికాడు. ఖర్చులకు కూడా నేనే డబ్బులిచ్చేవాన్ని. విప్లవ పుస్తకాలు చదివేవాడని, స్వామి వివేకానంద సాహిత్యం చదివేవాడు. ఒక్కడే కొడుకైనా ఇంకా పెళ్లి చేసుకోలేదు'' అన్నారు. ''మూడు రోజుల క్రితం తను ఇంటి నుంచి వెళ్లాడు. ఉదయమే ఫోన్‌లో మాట్లాడా'' అని తల్లి చెప్పారు. లక్నోకు మరో నిందితుడు సాగర్ శర్మ కూడా మైసూరులోని విజయనగరలోనే ఉంటున్నాడు.

గ్యాలరీకి వెళ్లాలంటే...

ఎంపీలు, జర్నలిస్టులు, సిబ్బంది మినహా ఇతరులెవరికీ పార్లమెంటులోకి అడుగు పెట్టే అవకాశముండదు. పార్లమెంటు కొత్త భవనాన్ని సందర్శించేందుకు గత సెప్టెంబర్ నుంచి సందర్శకులు భారీగా వస్తున్నారు. వారిని అనుమతించేందుకు పెద్ద ప్రక్రియే ఉంటుంది. పార్లమెంటు సభ్యుల సిఫార్సుపై వారికి విజిటర్స్ పాస్ ఇస్తారు. సదరు సందర్శకుడు తన బంధువు/వ్యక్తిగత మిత్రుడు/వ్యక్తిగతంగా తెలిసినవాడని, అతని పూర్తి బాధ్యత తనదేనని ఎంపీ స్పష్టం చేయాల్సి ఉంటుంది. తర్వాత సందర్శకుల నేపథ్యం, గుర్తింపు కార్డు తదితరాలను క్షుణ్నంగా తనిఖీ చేసి సెక్యూరిటీ క్లియరెన్స్ ఇచ్చాకే అనుమతిస్తారు.

మూడంచెల భద్రత

గ్యాలరీలోకి అనుమతించేలోపు సందర్శకులను పార్లమెంటు ప్రవేశ ద్వారం, భవనం లోపలి ఎంట్రీ గేటు, చివరగా గ్యాలరీ రూట్లోని కారిడార్... ఇలా మొత్తం మూడంచెల్లో మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేస్తారు. వీటన్నింటినీ దాటుకుని బుధవారం మనోరంజన్, సాగర్ ఏకంగా పొగ గొట్టాలనే గ్యాలరీలోకి తీసుకెళ్లడం పార్లమెంటు భద్రతా వ్యవస్థలో తీవ్ర లోపాలను తెరపైకి తెచ్చింది...

- వారికి నిజానికి కేవలం 45 నిమిషాల కోసమే పాస్ జారీ చేశారు.
- కానీ ఏకంగా రెండు గంటల పాటు గ్యాలరీలోనే ఉన్నట్టు తేలింది.
- సాధారణంగా విజిటర్స్‌ను గంటపాటే అనుమతిస్తారు.
- గడువు ముగుస్తుండగానే భద్రతా సిబ్బంది వారిని ఖాళీ చేయిస్తారు.
- కానీ బుధవారం గ్యాలరీ వద్ద సిబ్బందే లేరని, వారిని వేరే విధుల్లో వినియోగించారని చెబుతున్నారు.
- పార్లమెంటు భద్రత నిమిత్తం 301 మంది భద్రతా సిబ్బంది భర్తీకి అనుమతి ఉంది. కానీ ఈ నియామకాలు పదేళ్లుగా నిలిచిపోయినట్టు సమాచారం. దాంతో ప్రస్తుతం 176 మంది సిబ్బందే ఉన్నారు.

శిలాజ ఇంధనాలకు బైబై

- కాప్-28 సదస్సులో చరిత్రాత్మక ఒప్పందానికి ఆమోదం
- 2050 నాటికి నెట్‌జీరో ఉద్గారాలే లక్ష్యం
- భూగోళాన్ని కాపాడుకుంటేనే భవిష్యత్తు తరాలకు మనుగడ
- కాప్-28 అధ్యక్షుడు సుల్తాన్ అల్-జబేర్ స్పష్టీకరణ

దుబాయ్: హరిత గృహ వాయువుల ఉద్గారానికి, తద్వారా భూతాపానికి, భూగోళంపై ప్రకృతి విపత్తులకు, జీవకోటి మనుగడకు పెనుముప్పుగా పరిణమించిన శిలాజ ఇంధనాల వాడకానికి వీడ్కోలు చెప్పే దిశగా అడుగులు వేసేందుకు దాదాపు 200 దేశాలు అంగీకారానికి వచ్చాయి. ఈ మేరకు దుబాయ్‌లో జరుగుతున్న 'కాప్-28' సదస్సులో చరిత్రాత్మక ఒప్పందానికి అన్ని దేశాలు మద్దతు పలికాయి. 'శిలాజ ఇంధనాల వాడకం మానేద్దాం.. మార్పు సాధిద్దాం' అంటూ ప్రతిన బూనాయి. కాప్-28 సదస్సులో బుధవారం చివరి సెషన్ జరిగింది. శిలాజ ఇంధనాలకు వ్యతిరేకంగా కీలక ఒప్పందాన్ని సభ్యదేశాల ప్రతినిధులంతా ముక్తకంఠంతో ఆమోదించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణం కరతాళ ధ్వనులతో మార్మోగింది. 2050 నాటికి నెట్‌జీరో(సున్నా) ఉద్గారాలే లక్ష్యంగా ఒప్పందంలో 8 సూత్రాల ప్రణాళికను జోడించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఈ ఏడాది కాప్ సదస్సులో చెప్పుకోదగ్గ తీర్మానాలేవీ ఉండబోవన్న అనుమానాలు పటాపంచలయ్యాయి. భూగోళాన్ని కాపాడుకుంటేనే భవిష్యత్తు తరాలకు మనుగడ ఉంటుందని కాప్-28 అధ్యక్షుడు సుల్తాన్ అల్-జబేర్ తేల్చిచెప్పారు. పారిస్ ఒప్పందాన్ని పరిగణనలోకి తీసుకుంటూ, ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయాలని, ఇందుకోసం ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా పని చేయాలని, పటిష్టమైన, నిర్మాణాత్మక చర్యలకు శ్రీకారం చుట్టాలని కాప్-28 సదస్సు పిలుపునిచ్చింది. ప్రమాదకరమైన గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాన్ని గణనీయంగా తగ్గించాల్సిన బాధ్యత అన్ని దేశాలపైనా ఉందని స్పష్టం చేసింది.

కాప్-28 టాప్ 10

1. చరిత్రాత్మక శిలాజ ఇంధన ఒప్పందంతో కాప్-28 సదస్సు ముగిసింది. ఇలాంటి కాలుష్య ఇంధనాల వాడకాన్ని క్రమంగా నిలిపివేయడానికి ప్రపంచ దేశాలు అంగీకరించాయి. పెట్రోల్, డీజిల్, బొగ్గు వినియోగం అంతమయ్యే దిశగా అడుగులు పడ్డాయని చెప్పొచ్చు.
2. సంపన్న దేశాల నిర్వాకం వల్లే వాతావరణ మార్పులు సంభవిస్తున్నాయి. వాటి వల్ల పేద దేశాలు నష్టపోతున్నాయి. పేద దేశాలకు వాటిల్లుతున్న నష్టానికి గాను బడా దేశాలు పరిహారం ఇవ్వాలన్న ప్రతిపాదన చాలాఏళ్లుగా ఉంది. ఈ సదస్సులో దానికి కార్యరూపం వచ్చింది. వాతావరణ మార్పుల వల్ల నష్టపోయే పేద దేశాలకు ఆర్థిక సాయం అందించడం కోసం ఒక ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయడానికి ఆమోదం లభించింది.
3. నిర్దేశిత గడువు కంటే నెట్‌జీరో కర్బన ఉద్గారాల లక్ష్యాన్ని సాధిస్తామని కెనడా, బెల్జియం వంటి దేశాలు ప్రకటించాయి. 2030 నాటికి ఉద్గారాలను 50 శాతం తగ్గించుకుంటామని దుబాయ్ వెల్లడించింది.
4. 2030 కంటే ముందే గ్రీన్‌హౌజ్ వాయువుల ఉద్గారాన్ని అరికట్టడానికి శుద్ధ ఇంధనాల వనరుల వాడకాన్ని గణనీయంగా పెంచుకోవాలని నిర్దేశించారు.
5. క్లైమేట్ యాక్షన్ కోసం సంపన్న దేశాల నుంచి నిధులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలకు బదిలీ చేయాలన్న ప్రతిపాదనపై చర్చలు జరిగాయి.
6. జీవ వైవిధ్యానికి, మానవళికి ఎలాంటి హాని కలగకుండా వాతావరణ మార్పుల నియంత్రణకు కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలని నిర్దేశించారు.
7. ప్రస్తుతం అమల్లో ఉన్న పారిస్ ఒప్పందం లక్ష్యాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా శిలాజ ఇంధనాల వినియోగం, ఉత్పత్తిని తగ్గించుకోవాలని ఆదేశించారు.
8. పర్యావరణ పరిరక్షణ కోసం గ్రీన్ క్లైమేట్ ఫండ్ తరహాలో క్లైమేట్ ఫైనాన్స్, సపోర్టింగ్ ఫండ్స్ ఏర్పాటు చేయాలన్న ఆలోచనకు కొన్నిదేశాలు, సంస్థలు మద్దతు ప్రకటించాయి.
9. కాప్-26 సదస్సు ఫలితాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత కర్బన్ ఉద్గారాల సమాచారాన్ని నమోదు చేసే విషయంలో నిబంధనలు సవరించారు.
10. అన్ని దేశాల, అన్ని వర్గాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని శిలాజ ఇంధనాల నుంచి ఇతర ప్రమాద రహిత ఇంధనాల వైపు క్రమానుగతంగా మారాలని సూచించారు.

చేతలు కావాలి: బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తిని తగ్గించుకోవాలని గతంలో జరిగిన కాప్ సదస్సుల్లో ప్రత్యేకంగా సూచించారు. ఈసారి మాత్రం ఈ ప్రస్తావన లేకపోవడం గమనార్హం. బొగ్గుతో విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంలో ప్రపంచంలో చైనా, భారత్ ముందంజలో ఉన్నాయి. తమ విద్యుత్ అవసరాలు తీర్చుకోవడానికి బొగ్గుపై ఆధారపడుతున్నాయి. ఉష్ణోగ్రతల పెరుగుదలను నియంత్రించడానికి బుధవారం ఆమోదించిన ఒప్పందమే అతిపెద్ద కార్యాచరణ ప్రణాళిక అని సుల్తాన్ అల్-జబేర్ అన్నారు.

ఇజ్రాయెల్‌పై బైడెన్ అసంతృప్తి!

వాషింగ్టన్: గాజాలో పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దండయాత్రను అమెరికా అధ్యక్షుడు బైడెన్ తొలిసారిగా తప్పుబట్టారు. బుధవారం వాషింగ్టన్‌లో నిధుల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఇజ్రాయెల్ యుద్ధరీతిపై బైడెన్ మాట్లాడారు. '' ఇజ్రాయెల్ భద్రత అనేది అమెరికాతో ముడిపడి ఉంది. ఇన్నాళ్లూ ఐరోపా సమాఖ్య, యూరప్ దేశాలూ ఇజ్రాయెల్‌కు మద్దతుగా నిలబడ్డాయి. కానీ ఇప్పుడా పరిస్థితి నెమ్మదిగా మారుతోంది. గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న విచక్షణారహిత బాంబుదాడులే ఇందుకు ప్రధాన కారణం. మరి ఈ విషయం ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు తెలుసో తెలీదో. గాజావ్యాప్తంగా ఇళ్లలో ఉన్న సాధారణ ప్రజానీకాన్ని చిదిమేస్తూ భవనాలపై దారుణ బాంబింగ్ కొనసాగుతోంది. ఈ దాడుల పర్వం మరికొన్ని వారాలు, నెలలపాటు కొనసాగుతుందని ఇజ్రాయెల్ సైన్యాధికారులే చెబుతున్నారు. అమాయక పాలస్తీనియన్ల భద్రత ఇప్పుడు ప్రమాదంలో పడింది'' అని ఇజ్రాయెల్ భీకర గగనతల, భూతల దాడులను బైడెన్ ఆక్షేపించారు. ఈ విషయమై అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలీవాన్ ఈ వారమే ఇజ్రాయెల్‌లో పర్యటించి భారీ దాడులకు ఎప్పుడు చరమగీతం పాడుతారనే దానిపై ఒక హామీ తీసుకోనున్నారు. '' 2001 సెప్టెంబర్ 11 దాడుల తర్వాత అమెరికా అఫ్గానిస్తాన్‌లో యుద్ధానికి దిగింది. అమెరికా చేసిన ఇలాంటి అతి 'స్పందన' తప్పిదాల నుంచి ఇజ్రాయెల్ ఏమీ నేర్చుకున్నట్లు కనిపించట్లేదు. ఇది ఇలాగే కొనసాగితే అంతర్జాతీయ మద్దతును ఇజ్రాయెల్ కోల్పోతుంది'' అని బైడెన్ హెచ్చరించారు. బైడెన్ వ్యాఖ్యలపై హమాస్ సాయుధసంస్థ ప్రతినిధి బీరుట్ నగరంలో మాట్లాడారు. ''ఈ యుద్ధ విపరిణామాలు ఇజ్రాయెల్‌లో త్వరలోనే కనిపిస్తాయి. అమెరికాలో అధ్యక్ష ఎన్నికల తర్వాత శ్వేతసౌధంలో బైడెన్ సీటు గల్లంతవుతుంది'' అని హమాస్ రాజకీయవిభాగం నేత ఒసామా హమ్దాన్ వ్యాఖ్యానించారు.



ఛత్తీస్ సీఎంగా విష్ణుదేవ్ ప్రమాణం



మోహన్ యాదవ్‌ను అభినందిస్తున్న ప్రధాని మోదీ

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ సీఎంలుగా మోహన్ యాదవ్, విష్ణుదేవ్ ప్రమాణం

భోపాల్/రాయ్‌పూర్: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా మోహన్ యాదవ్, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిగా విష్ణుదేవ్ సాయి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని లాల్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ మంగూభాయి పటేల్ సీఎంగా మోహన్ యాదవ్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే ఉప ముఖ్యమంత్రులుగా జగదీష్ దేవ్‌డా, రాజేంద్ర శుక్లా ప్రమాణం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మోహన్ యాదవ్ ఉజ్జయిని సౌత్ స్థానం నుంచి బీజేపీ టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలుపొందిన సంగతి తెలిసిందే. సీఎంగా ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన మాట్లాడారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి, ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తానని చెప్పారు. అలాగే ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో సీఎంగా విష్ణుదేవ్ సాయితో రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఉప ముఖ్యమంత్రులుగా అరుణ్ సావో, విజయ్ శర్మ ప్రమాణం చేశారు. మోహన్ యాదవ్, విష్ణుదేవ్ సాయి ప్రమాణం స్వీకారోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తదితరులు పాల్గొన్నారు.

వారి త్యాగాలకు దేశం రుణపడింది

2001 పార్లమెంట్‌పై దాడిలో అమరులకు రాష్ట్రపతి నివాళులు

న్యూఢిల్లీ: ఇరవై రెండేళ్ల క్రితం పార్లమెంట్‌పై దాడి ఘటనలో అమరులైన భద్రతాబలగాలకు దేశం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వ్యాఖ్యానించారు. బుధవారం పార్లమెంట్ దాడి మృతులకు ఆమె నివాళులర్పించారు. ''ప్రజాస్వామ్య దేవాలయంపైనే దాడికి తెగబడి అత్యున్నత స్థాయి రాజకీయనేతలను అంతం చేయాలని ఉగ్రవాదులు హేయమైన కుట్రపన్నారు. ఆ కుట్రను భారత భద్రతాబలగాలు వమ్ముచేసి ఆ క్రమంలో ప్రాణత్యాగంచేశాయి. ఆ ధైర్యశాలులకు నా నివాళులు. మాతృభూమి కోసం మీరు చేసిన ప్రాణత్యాగానికి దేశం సదా రుణపడి ఉంటుంది. ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు సిద్ధమని అందరం ప్రతినబూనుదాం'' అని సామాజిక మాధ్యమ ఖాతా 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు. మానవాళికి ముప్పుగా పరిణమించిన ఉగ్రవాదం ఏ దేశంలో ఏ రూపంలో ఉన్నాసరే దానిని సమూలంగా తుదముట్టించాలని వ్యాఖ్యానించారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ నేత సోనియా గాంధీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, ప్రహ్లాద్ జోషి, పియూష్ గోయల్, జితేంద్ర సింగ్, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో అమరులకు నివాళులర్పించారు. అమరుల త్యాగాన్ని భారత్ సదా స్మరించుకుంటుందని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు.

త్యాగాలు చిరస్థాయిగా నిలిచిపోతాయి: ప్రధాని

పార్లమెంట్‌లో అమరులకు బుధవారం ప్రధాని మోదీ సైతం నివాళులర్పించారు. ''దాడిలో ప్రాణాలు కోల్పోయిన వీరోచిత భద్రతా సిబ్బందికి నా హృదయపూర్వక నివాళులు. ఆపత్కాలంలో తెగువ చూపిన వారి త్యాగాలను యావత్ దేశం చిరస్థాయిగా గుర్తుంచుకుంటుంది'' అని మోదీ వ్యాఖ్యానించారు. అమరులకు లోక్‌సభ నివాళులర్పించింది. లోక్‌సభ కార్యకలా పాలు బుధవారం మొదలవగానే స్పీకర్ బిర్లా మాట్లాడారు. ' ఉగ్రవాదులతో పోరాటంతో ప్రాణాలు కోల్పోయిన భద్రతా బలగాల కుటుంబాలకు భారత ప్రభుత్వం అండగా ఉంటుంది. ఉగ్రవాదంపై భారత పోరు కొనసాగుతుంది'' అని అన్నారు. ఈ సందర్భంగా సభ్యులంతా లేచి నిల్చుని కొద్దిసేపు మౌనం పాటించారు.

మళ్లీ ఎన్డీఏనే!

- లోక్‌సభకు ఇప్పటికిప్పుడు ఎన్నికలొస్తే 323 సీట్లు
- ఇండియా కూటమికి 163
- టైమ్స్ నౌ-ఈటీజీ పోల్ వెల్లడి

న్యూఢిల్లీ: ఇప్పటికిప్పుడు లోక్‌సభకు ఎన్నికలు జరిగితే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి హ్యాట్రిక్ కొడుతుందని టైమ్స్ నౌ నవజీవన్, ఈటీజీ ఒపీనియన్ పోల్ బుధవారం వెల్లడించింది. మొత్తం 543 స్థానాల్లో ఎన్డీఏ కూటమికి ఏకంగా 323 సీట్లొస్తాయని అంచనా వేసింది. విపక్ష ఇండియా కూటమి 163 సీట్లకు పరిమితమవుతుందని చెప్పింది. ఇతర ప్రాంతీయ పార్టీలన్నీ కలిపి 57 స్థానాలు దక్కించుకుంటాయని వెల్లడించింది. ముఖ్యంగా ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించిన మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోనైతే ఆ పార్టీ దాదాపుగా క్లీన్‌స్వీప్ చేస్తుందని తెలిపింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి 354 సీట్లు రావడం తెలిసిందే. కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏకు 93 సీట్లు రాగా ఇతరులకు 96 దక్కాయి.

'గాజా'పై ఐరాసలో ముసాయిదా తీర్మానం

అనుకూలంగా ఓటు వేసిన భారత్

ఐక్యరాజ్యసమితి: గాజా స్ట్రిప్‌లో వెంటనే కాల్పుల విరమణ పాటించాలని, హమాస్ మిలిటెంట్ల చెరలో ఉన్న బందీలను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని, పాలస్తీనియన్లకు మానవతా సాయం అందించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఐక్యరాజ్య సమితి సాధారణ సభలో తాజాగా ఒక ముసాయిదా తీర్మానాన్ని ఈజిప్టు ప్రవేశపెట్టింది. సభలో మొత్తం 193 సభ్యదేశాలు ఉండగా, భారత్ సహా 153 దేశాలు ఈ తీర్మానానికి అనుకూలంగా ఓటు వేశాయి. 10 దేశాలు వ్యతిరేకంగా ఓటు వేశాయి. 23 దేశాలు గైర్హాజరయ్యాయి. గాజాలో ఇజ్రాయెల్ దాడులు నానాటికీ ఉధృతం అవుతుండడం, నిత్యం పదుల సంఖ్యలో జనం మరణిస్తుండడంతో తాజా పరిస్థితిపై చర్చించడానికి ఐరాస సాధారణ సభ అత్యవసర ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముసాయిదా తీర్మానాన్ని ఆస్ట్రియా, ఇజ్రాయెల్, అమెరికా తదితర దేశాలు వ్యతిరేకించాయి.

మహాదేవ్ యాప్ 'రవి' అరెస్టు

న్యూఢిల్లీ: సంచలనం సృష్టించిన మహాదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ యజమాని రవి ఉప్పల్ (43)ను దుబాయ్ పోలీసులు గత వారం అదుపులోకి తీసుకున్నట్లు ఈడీ అధికారులు బుధవారం వెల్లడించారు. అతడిని భారత్‌రప్పించి విచారిస్తామని తెలిపారు.

సాక్షి
కరీంనగర్
గురువారం । 14 । డిసెంబర్ । 2023



ధర ఉన్నా.. మిగిలేది సున్నా

కష్టపడి సాగు చేసిన వరి రైతుకు దిగుబడి దిగాలుగా మారుతోంది. మార్కెట్లో ధర ఉన్నా.. తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గింది. 8లో▸



గోదావరిలో పోటెత్తిన భక్తులు

ధర్మపురి: ధర్మపురి వద్ద గోదావరి భక్తులతో బుధవారం పోటెత్తింది. పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 27.0/18.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయి. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సీపీఐ ప్రజల పక్షం: మర్రి



కరీంనగర్: ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు మార్పుకోరుకున్నారని, నియంతపాలన సాగించిన బీఆర్‌ఎస్‌కు చరమగీతం పాడి అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పట్టారని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. బుధవారం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో మాట్లాడుతూ.. సీపీఐ పార్టీ ప్రజల పక్షమని, ఎన్నికల వరకే పొత్తులని, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తే ప్రతిఘటన పోరాటాలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు మిగతా హామీలు ప్రజలకు అందించాలని, లేనిపక్షంలో సీపీఐ చూస్తూ ఊరుకోబోదని స్పష్టం చేశారు. కరీంనగర్‌లో విచ్చలవిడిగా భూ దందాలు పెరిగాయని, అక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో మానేరు వాగులో నిర్మిస్తున్న ఎంఆర్‌ఎఫ్ ప్రాజెక్టు పనుల్లో అంచనాలు భారీగా పెంచి కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టిన వైనంపై దృష్టిసారించాలని సూచించారు. సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు టేకుమల్ల సమ్మయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బోనగిరి మహేందర్, బూడిద సదాశివ పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా రాజేశ్




తిమ్మాపూర్: కరీంనగర్ రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా రాజేశ్ నియామకం అయ్యారు. ఆయన బుధవారం తిమ్మాపూర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన మైసయ్య సస్పెండ్ కాగా ఇదే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జావీద్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ఎన్నికల కోడ్ కారణంగా సబ్ రిజిస్ట్రార్ నియామకంలో జాప్యం జరిగింది. ఎట్టకేలకు రాజేశ్‌ను నియమించారు. ఆయనకు కార్యాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

'నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి'



కరీంనగర్: నిబంధనలు పాటించని ఎస్సీ సంక్షేమ హాస్టళ్ల వార్డెన్లను సస్పెండ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం సంఘ కార్యాలయంలో జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న ఎస్సీ సంక్షేమ హాస్టళ్లవార్డెన్లు సమయపాలన, విద్యార్థులకు మెనూ పాటించడం లేదన్నారు. హాస్టల్‌లో కనీసం స్కావెంజర్ లేక మరుగుదొడ్లను శుభ్రం చేయడం లేదని అన్నారు. ఇంతవరకు దుప్పట్లు పంపిణీ చేయలేదని తెలిపారు. హాస్టళ్లలో గ్రీజర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్లో నీరులేక విద్యార్థులు బయటకు వెళ్లి బకెట్లలో తెచ్చుకునే పరిస్థితి జిల్లాలోని సంక్షేమహాస్టళ్లలో కనిపిస్తోందని అన్నారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న వార్డెన్లను సస్పెండ్ చేసేంతవరకు పోరాటాలు చేస్తామని అన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పారపు రోహిత్, వినీషా రత్నం సురేశ్, ప్రవీణ్, రమ్య పాల్గొన్నారు.

జాతీయ సదస్సు కరపత్రాల ఆవిష్కరణ



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో జనవరి–23,24 తేదీల్లో నిర్వహించనున్న ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ అండ్ మానిటరింగ్ టెక్నిక్స్ జాతీయ సదస్సు కరపత్రాలు బుధవారం శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ సంకశాల మల్లేశ్ ఆవిష్కరించారు. రసాయన, సూక్ష్మజీవనశాస్త్రం విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సదస్సులో పాల్గొనేందుకు గుగూల్ ఫారం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వీసీ సూచించారు. ప్రిన్సిపాల్ డి.శ్రీహరి, వైస్ ప్రిన్సిపాల్ సమత, లైబ్రేరియన్ మోహన్‌రావు, సదస్సు కన్వీనర్ సుష్మ, కో–కన్వీనర్ స్వప్న ఉన్నారు.

ప్రజల ఆశీర్వాదమే బలం

- ఆదర్శ జిల్లాగా ఉమ్మడి కరీంనగర్
- దివంగత సీఎం రాజశేఖరరెడ్డి ఆశీస్సులే ఇంతటివాడిని చేశాయి
- పొన్నం అంటేనే కాంగ్రెస్
- ఎస్‌ఆర్‌ఆర్ నుంచే రాజకీయ జీవితం
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, పక్కన ఎమ్మెల్యేలు, నాయకులు



కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

సాక్షిప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్రంలోనే ఉమ్మడి కరీంనగర్‌ను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తనకు రాజకీయ జీవితాన్ని ప్రసాదించింది ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల అని, రాజకీయ ఉద్దండులు వైఎస్.రాజశేఖరరెడ్డి, జువ్వాడి చొక్కారావు, ఎమ్మెస్సార్, జి.వెంకటస్వామి, జైపాల్‌రెడ్డిల నుంచి అక్షరాలు నేర్చుకున్నానని పేర్కొన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా బుధవారం పొన్నం ప్రభాకర్ కరీంనగర్ వచ్చారు. నగరంలోని ఇందిరాచౌక్‌లో ఏర్పాటు చేసిన విజయభేరి సభలో ఆయన మాట్లాడుతూ సహచర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేల సహకారంతో ఉమ్మడి జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామన్నారు. గత ప్రభుత్వం మాటలకే పరిమితమైందని, తమది చేతల ప్రభుత్వమన్నారు. ప్రభుత్వం మారిందని, అధికారులు కూడా వ్యవస్థను మార్చుకోవాలని సూచించారు. ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకేనని, తాను కరీంనగర్ బిడ్డనన్నారు. ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల అధ్యక్షుడిగా తన రాజకీయ జీవితం ప్రారంభమైందని, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా, రాష్ట్ర అధ్యక్షుడిగా, మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా పనిచేశానన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో కరీంనగర్ ఎంపీ అయ్యానన్నారు. తన రాజకీయ గురువు జువ్వాడి చొక్కారావు 1973లో రవాణా శాఖ మంత్రి అయితే, చొక్కారావు శిష్యుడినైనా తాను 2023లో రవాణా శాఖ మంత్రి అయ్యానన్నారు. తాను 1987లో రాజకీయ జీవితం ప్రారంభించానని, ఈ 36 సంవత్సరాల్లో ఎక్కడా అవినీతి, ఎలాంటి ఆరోపణలు లేవన్నారు. కొంతమంది చేతగాక పార్టీలు మారినోళ్లు తనను విమర్శిస్తే, భగవంతుడు ఒక్క అవకాశం ఇస్తాడని చెప్పానంటూ గుర్తు చేసుకున్నారు. తాను పార్టీ మారలేదని కాంగ్రెస్ అంటే పొన్నం, పొన్నం అంటేనే కాంగ్రెస్ అని స్పష్టం చేశారు. తనకు ప్రజల ఆశీర్వాదమే టానిక్ అని, కేసీఆర్ వాడే టానిక్ కాదంటూ చమత్కరించారు. ఎంపీగా తాను పార్లమెంట్‌లో తెలంగాణ కోసం కొట్లాడి, మా ఎంపీ పొన్నం అని ప్రజలు గర్వంగా చెప్పుకునేలా చేశానన్నారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ కోసం ఉద్యమించి ప్రజల ఆశలు నెరవేర్చిన నేత పొన్నం ప్రభాకర్ అన్నారు. తన పార్లమెంట్ పరిధిలో నాలుగు స్థానాలు గెలిపించుకున్నానని తెలిపారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ నియంతృత్వ ప్రభుత్వం కూలిపోయి, ప్రజాప్రభుత్వం వచ్చిందన్నారు. విద్యార్థి నాయకుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన పొన్నం ప్రభాకర్ మంత్రిగా బాధ్యతలు చేపట్టడం శుభసూచకమన్నారు. కరీంనగర్, హుజూరాబాద్ కాంగ్రెస్‌నియోజకవర్గ ఇన్‌చార్జీలు పురుమల్ల శ్రీనివాస్, వొడితెల ప్రణవ్, నాయకులు వైద్యుల అంజన్‌కుమార్, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మెనేని రోహిత్‌రావు, మంజులారెడ్డి, కటకం వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

పార్లమెంట్‌తో పాటు స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. డీసీసీ కార్యాలయంలో మాట్లాడుతూ.. తాము రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామంటే కార్యకర్తల కృషి ఎంతో ఉందన్నారు. పదేళ్ల పాటు బీఆర్‌ఎస్ బెదిరింపులకు పాల్పడినా, ప్రలోభాలకు గురి చేసినా పార్టీని వీడని గొప్ప కార్యకర్తలదే ఈ విజయమన్నారు. నగరంలో జువ్వాడి చొక్కారావు విగ్రహం తొలగించారని, మళ్లీ ఏర్పాటు చేయకపోతే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

దారి పొడవునా నీరాజనం

రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్, అనుబంధ విభాగాలు,అభిమానులు, కుల, బీసీ సంఘాలు ఘనస్వాగతం పలికాయి. సాయంత్రం ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యంలతో కలిసి ఓపెన్‌టాప్ వాహనంలో నగరానికి చేరుకున్నప్రభాకర్‌కు నగరంలోని వివిధ ప్రాంతాల్లో పార్టీ నాయకులు పూలవర్షంతో నీరాజనం పట్టారు. కోలాటాలు, నృత్యాలు, డప్పు వాయిద్యాలు, మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. గొల్లకురుమలు గొంగడితో సత్కరించారు. సిక్‌లు కరవాలం బహూకరించారు. ఆర్టీసీ కార్మికులు గజమాలతో సన్మానించారు. ఇందిరా చౌక్ వద్ద విజయభేరి సభ ముగిసిన తరువాత పొన్నం ర్యాలీగా డీసీసీ కార్యాలయానికి చేరుకున్నారు. నాయకులు కట్ల సతీశ్, కొడూరి రవీందర్‌గౌడ్, మునిగంటి అనిల్, దన్ను సింగ్, ఖమర్, సిరాజొద్దిన్, మొహమ్మద్ అమీర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్డుల్లేవ్.. చేర్పుల్లేవ్

- కొత్త రేషన్ కార్డులకు మోక్షమెప్పుడో?
- నాలుగేళ్లుగా వేలమంది పడిగాపులు
- కొత్త ప్రభుత్వంపైనే ఆశలు



జిల్లా మొత్తంగా 2018లో గణాంకాలిలా..

రేషన్‌కార్డుకు మొత్తం దరఖాస్తులు: 34,293

తిరస్కరణ: 831

మొత్తం పెండింగ్: 18,348

గిర్దావర్ వద్ద పెండింగ్: 9,626

తహసీల్దార్ వద్ద పెండింగ్: 456

డీఎస్వో కార్యాలయంలో: 8,266

జారీ అయిన సంఖ్య: 15,114

'కరీంనగర్ రూరల్ మండలం నగునూరు గ్రామానికి చెందిన కస్తూరి కీర్తికుమార్‌కు 2018 ఏడాదిలో వివాహమైంది. రేషన్ కార్డులో తన భార్య పేరును చేర్చాలని 2019లో దరఖాస్తు చేశాడు. కార్డు జారీ కాకపోగా ఇప్పుడతనికి ఇద్దరు పిల్లలు. వారి పేర్లను చేర్చాలని దరఖాస్తు కోసం మీ సేవకు వెళ్తే గత దరఖాస్తు రిజెక్ట్ లేదా యాక్సెప్ట్ అయితేనే దరఖాస్తు చేయొచ్చని చెప్పారు. నాలుగేళ్లయినా దరఖాస్తుకు మోక్షం లేదు. ఇది ఒక కీర్తికుమార్ పరిస్థితి అనుకుంటే పొరపాటే.. జిల్లాలోని వేలమంది ఆవేదన'.

కరీంనగర్ అర్బన్: రేషన్ కార్డు అందని ద్రాక్షగా మారింది. దరఖాస్తు చేయడం.. ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం.. ఆపై కార్యాలయాల చుట్టూ తిరిగి నిరాశగా వెనుదిరగడం తంతుగా మారింది. బోగస్ కార్డులు ఏరివేసేందుకు 2019లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించగా అప్పటి నుంచి కొత్తకార్డుల జారీకి బ్రేక్ వేసింది. అప్పటి నుంచి దరఖాస్తులకు మోక్షం లేకపోగా కొత్తగా పెళ్లయినవారు, సంతానం కలిగినవారికి నిరీక్షణ అనివార్యమవుతోంది. గతంలో అవకాశమిచ్చినా పౌరసరఫరాల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో వేలమంది నిట్టూర్చాల్సిన పరిస్థితి. కొత్త ప్రభుత్వంలోనైనా త్వరగా కార్డులు వస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్లుగా రేషన్‌కు దూరం

జిల్లాలో 2018లో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 34,293 కాగా మంజూరైనవి 15,114 మాత్రమే. కరీంనగర్ అర్బన్‌తో పాటు 16 మండలాల్లో భారీగా అర్జీలు రాగా పరిశీలించి మంజూరు చేయాల్సిన యంత్రాంగం మొద్దునిద్రలో జోగడం ప్రస్తుత దుస్థితికి కారణం. అర్జీల్లో వివిధ కారణాలతో 831 తిరస్కరణకు గురవగా వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నవి 18,348. కరోనా సమయంలోనూ వీరంతా రేషన్‌కు దూరమే. ఇదిలా ఉండగా గత రెండేళ్లుగా మీ సేవలో రేషన్ కార్డులకు దరఖాస్తు చేసే అవకాశం లేదు. సైట్ తెరుచుకోకపోగా దరఖాస్తు చేసుకునేవారి సంఖ్య మరో 20వేల వరకు ఉంటుందని అంచనా.

తొలగింపులో శ్రద్ధ.. మంజూరులో ఏది?

పేదలకు ప్రామాణికం రేషన్ కార్డు. రేషన్ సరుకులతో పాటు వైద్య సేవలు, ఇతర పథకాలకు రేషన్ కార్డు తప్పనిసరి. ఈ క్రమంలో దరఖాస్తు చేయడమే తరువాయి క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం కార్డు మంజూరు చేయాల్సి ఉండగా అధికారుల నిర్లక్ష్యం వెంటాడటం విడ్డూరం. అయితే కొత్త కార్డులు, కార్డులో పేర్ల చేర్పు వంటి వాటికి గత మూడేళ్లుగా అవకాశం లేకపోగా తొలగింపుల ప్రక్రియ ఏటా సాగుతోంది. పింఛన్‌దారు మరణిస్తే వాటి వివరాలతో ఆటోమెటిక్‌గా కార్డులో పేరు తొలగిస్తున్నారు. ఇక కొత్తగా పెళ్లయి మెట్టినింట అడుగు పెట్టిన కోడళ్లకు పుట్టినింట రేషన్ కార్డులో పేరు తొలగించారు. అలాగే రేషన్ కార్డు యజమానితో పాటు కార్డులోని సభ్యుల వివరాలతో ఆధార్ కార్డులను అనుసంధానించారు. ఇదంతా ప్రక్రియ సాగుతుండగా కొత్త కార్డుల జారీ, పేర్ల చేర్పు లేకపోవడం ఆందోళనకర పరిణామం.

అసలు ప్రక్రియ ఇది..

మీ సేవ కేంద్రాల ద్వారా అర్జీదారులు దరఖాస్తు చేయగా వాటిని ఆర్‌ఐ(గిర్దావర్) క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైతే తహసీల్దార్‌కు నివేదిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలకు మించని కుటుంబాలే అర్హులు. కుటుంబంలోని సభ్యులందరి ఆధార్ జిరాక్స్ ప్రతులను దరఖాస్తుకు జత చేయాల్సి ఉంటుంది. మీ సేవలో స్వీకరించిన దరఖాస్తులను రెవెన్యూ అధికారులు పలు దశల్లో క్షేత్రస్థాయిలోకి వెళ్లి నిశితంగా పరిశీలిస్తారు. అర్జీదారు ఆదాయ వనరులు, నివాస ప్రాంతం తదితరాలపై ఆరా తీసి అర్హులనిపిస్తే కార్డు జారీకి ఆమోదముద్ర వేస్తారు.

మండలాల వారీగా వివిధ దశల్లో పెండింగ్ ఇలా

మండలం	ఆర్‌ఐ	డీఎస్వో
చిగురుమామిడి	257	495
చొప్పదండి	649	338
ఇల్లందకుంట	214	303
గంగాధర	323	562
గన్నేరువరం	179	250
హుజూరాబాద్	1,001	382
జమ్మికుంట	603	677
కరీంనగర్‌రూరల్	698	477
కరీంనగర్ అర్బన్	2,630	1,861
శంకరపట్నం	264	538
కొత్తపల్లి	988	251
మానకొండూర్	206	590
రామడుగు	120	425
సైదాపూర్	498	227
తిమ్మాపూర్	385	564
వీణవంక	611	326
మొత్తం	9,626	8,266

లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలి



ప్లాన్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, వివిధ బ్యాంకుల అధికారులు

- ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించండి
- బ్యాంకర్లతో కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: జిల్లాలో వివిధ ఆర్థిక మద్దతు పథకాల లక్ష్యసాధనకు రుణాలు అందించడంలో బ్యాంకర్లు పూర్తిస్థాయిలో సహకరించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, వివిధశాఖల జిల్లా అధికారులతో రైతులకు రుణాలు, స్వయం సహాయక సంఘాల రుణాలు, రికవరీ, పీఎంజీపీపై రుణాలు, ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమశాఖల పథకాలకు రుణలక్ష్య పురోగతిపై డీసీసీడీఎల్ఆర్‌సీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమరుణాలు రెన్యూవల్ చేసుకునే అంశంపై అవగాహన కల్పించాలని తెలిపారు. రైతుబంధు, రైతు బీమా, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధులను పంట రుణాలకు జమ చేసుకోవడానికి వీలులేదని, సదరు నియమాలను బ్యాంకర్లు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ నెల వరకు రూ.5648.12 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో వ్యవసాయానికి రూ.2233.69కోట్లు, ఎంఎస్ఎంఈ రంగంలో రూ.1212.49కోట్లు, విద్యారుణాలకు రూ. 8.78కోట్లు, హౌసింగ్ లోన్స్ రూ.145.96కోట్లు, స్వయం సహాయక సంఘాలకు రూ.386.69 కోట్లు, ఇతర రంగాలకు రూ.1660.51కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉన్న లక్ష్యాల్లో 75.49శాతం పూర్తయిందని, పెండింగ్‌లో ఉన్న రుణాల ప్రతిపాదనలు సైతం బ్యాంకర్లకు అందించి త్వరగా మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం నాబార్డ్ 2024–25 జిల్లా ప్రొటెన్షియల్ లింక్డ్ ప్లాన్ పుస్తకం ఆవిష్కరించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్, జీఎం ఇండస్ట్రీ నవీన్, డీఆర్డీవో శ్రీలత, ఎల్డీఎం ఆంజనేయులు, ఆర్‌బీఐ అధికారి సాయితేజ, ఏజీఎం నాబార్డ్ ప్రకాశ్, ఎస్‌బీఐ ఏజీఎం రవి శంకర్, యూబీఐ సీఎం కలీమ్, టీజీబీ ఏజీఎం ప్రభుదాస్, కేడీసీసీ సీఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.

క్వింటాల్ పత్తి రూ.6,700

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర గరిష్టంగా రూ.6,700 పలికింది. మార్కెట్‌కు 176 వాహనాల్లో 1,813 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తెచ్చారు. మోడల్ ధర రూ.6,500, కనిష్ట ధర రూ.6,100 పలికింది. గన్నీ సంచుల్లో 14 మంది రైతులు 24 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తెచ్చారు. గరిష్ట ధర రూ.6,400, మోడల్ ధర రూ.6,200, కనిష్ట ధర రూ.5,900కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. సీసీఐ సంస్థ 68మంది రైతుల నుంచి 1,025.95 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. గరిష్ట ధర రూ.7,020, మోడల్ ధర రూ.6,995, కనిష్ట ధర రూ.6,735 పలికింది.

వాహనదారులకు మెరుగైన సేవలు



అధికారులతో మాట్లాడుతున్న డీటీసీ చంద్రశేఖర్ గౌడ్

- ఉమ్మడి జిల్లా డీటీసీ మామిండ్ల చంద్ర శేఖర్‌గౌడ్

తిమ్మాపూర్: వాహనదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా రవాణాశాఖ అధికారులను డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ ఆదేశించారు. రవాణాశాఖ కార్యాలయాలలోని హెల్ప్‌డెస్కలను మరింత పటిష్ట పరచాలని, ఆన్‌లైన్ సేవలపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాల వారీగా, ఎంవీఐలతో సాధించిన ఆదాయ లక్ష్యాన్ని సమీక్షించారు. కరీంనగర్ జిల్లా రూ.90.81 కోట్లు, పెద్దపల్లి జిల్లా రూ.50.50 కోట్లు, జగిత్యాల జిల్లా రూ.37.53 కోట్లు, రాజన్న సిరిసిల్ల జిల్లా రూ.24.04 కోట్ల ఆదాయం సాధించినట్లు వెల్లడించారు. మొత్తంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా రూ.202.88 కోట్ల ఆదాయాన్ని సాధించినట్లు పేర్కొన్నారు. సొంత భవనాలు లేని కార్యాలయ అధికారులు సంబంధిత కలెక్టర్‌ను సంప్రదించి స్థలం పొందేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రిగా నియామకం అయిన పొన్నం ప్రభాకర్‌కు తిమ్మాపూర్ రవాణాశాఖ కార్యాలయం వద్ద ఘన స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలియజేశారు. రవాణాశాఖ అధికారులు రంగారావు, కొండల్‌రావు, నాగలక్ష్మి, వంశీధర్, గౌస్‌పాషా, మసూద్ అలీ, సిరాజ్ రెహమాన్, అల్లె శ్రీనివాస్, ఉమా మహేశ్వరరావు, భీంసింగ్, రవి కుమార్, రంజిత్, వెంకటరమణ, కిశోర్, చంద్రారెడ్డి, రజనీదేవి పాల్గొన్నారు.

సర్వే ల్యాండ్ రికార్డు ఏడీగా ప్రభాకర్

కరీంనగర్ అర్బన్: సర్వే ల్యాండ్ రికార్డు ఏడీగా ప్రభాకర్‌ను నియమించారు. ఏడీ రావిరాల అశోక్ వ్యక్తిగత కారణాలతో సెలవులో వెళ్లగా వరంగల్ ఏడీ ప్రభాకర్‌ను ఇన్‌చార్జిగా నియమించారు.

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11 కే.వీ.విద్యానగర్ ఫీడర్‌పరిధిలోని విజయదుర్గకాలనీ, విద్యానగర్, ఆర్టీసీ వర్క్‌షాపు వెనకప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11 కే.వీ.మంకమ్మతోట ఫీడర్ పరిధిలోని మంకమ్మతోట, పొన్నం కాంప్లెక్స్, కాశ్మీర్ గడ్డ, గోపాల్‌రావు భవనం ప్రాంతాలతో పాటు 11 కేవీ గీతాభవన్ ఫీడర్ పరిధిలోని రాంనగర్, పద్మనగర్, మంకమ్మతోట, సహజ అపార్ట్‌మెంట్, దన్గరివాడీ స్కూల్, కలమనిర్మల్ అపార్టుమెంట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ పేర్కొన్నారు.

జిల్లా కోర్టు ఆవరణలో పీహెచ్‌సీ ఏర్పాటు



బీపీ పరీక్షించుకుంటున్న సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్‌క్రైం: జిల్లాకోర్టు ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం జిల్లా జడ్జి బి.ప్రతిమ, కలెక్టర్ పమేలాసత్పతి, సీపీ అభిషేక్ మహంతితో కలిసి ప్రారంభించారు. జిల్లా కోర్టులకు హాజరయ్యే కక్షిదారులకు ఆరోగ్య సమస్యలు ఏర్పడగా, వారితో పాటు న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి ప్రాథమిక అత్యవసర చికిత్స అవసరాన్ని గుర్తించి జిల్లా జడ్జి చొరవతో ఈ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో ఒక డ్యూటీ డాక్టర్, స్టాఫ్‌నర్స్ అందుబాటులో ఉండనున్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో లలితాదేవి, ఉప వైద్యాధికారి జువేరియా, మున్సిపల్ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, న్యాయమూర్తులు శ్రీవాణి, లక్ష్మీకుమారి, కుమార్ వివేక్, నీరజ, అరుణ, వెంకటేశ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రఘునందన్‌రావు, ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు, కేవీ వేణుగోపాలరావు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వి.వెంకటేశ్వర్లు, పీపీలు గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్, జూలూరు శ్రీరాములు, అరెల్లి రాములు, కోర్టు పరిపాలన అధికారి లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

క్రిస్మస్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: క్రిస్మస్ సందర్భంగా విద్య, వైద్యం, సాహిత్యం, కళలు, క్రీడారంగాల్లో ఉత్తమసేవ, ప్రతిభ కనబరిచిన క్రైస్తవులు, సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం సత్కరించనుంది. ఇందుకోసం ఈనెల 15 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నామని, 30 ఏళ్లకు పైబడిన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి పవన్ ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్ ఫారాలు మేనేజింగ్ డైరెక్టర్, తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ(మైనార్టీస్)ఫైనాన్స్ కార్పొరేషన్, కరీంనగర్ కార్యాలయం నుంచి వ్యక్తిగతంగా కానీ లేదా www. tscmfc. in వెబ్‌సైట్‌లో నుంచి అయినా పొందవచ్చని తెలిపారు. పూర్తిచేసిన నామినేషన్లను సంబంధిత జిల్లా మైనార్టీల సంక్షేమ అధికారి కార్యాలయంలో ఈనెల 15 తేదీ వరకు అందజేయవచ్చునని పేర్కొన్నారు. వివరాలకు 99897 27382 నంబరును సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

క్లుప్తంగా

రేషన్‌బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యంతో అధికారులు

వీణవంక(హుజూరాబాద్): మండల కేంద్రంలో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని స్థానిక తహసీల్దార్, పోలీసులు పట్టుకున్నారు. సుమారు 45 నుంచి 50 క్వింటాళ్ల బియ్యాన్ని గ్రామానికి చెందిన కడమంచి యాదగిరి, ఉబిది నరేశ్, అనిల్, పర్థం శ్రీనివాస్ నుంచి స్వాధీనం చేసుకొని సివిల్ సప్‌లై అధికారులకు అందించినట్లు ఎస్సై ఆసిఫ్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిరుమల్‌రావు, డీటీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్: యువకుడి మృతి

తిమ్మాపూర్(మానకొండూర్): బైక్‌పై వెళ్తూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధి అల్గునూరులో మంగళవారం రాత్రి జరిగింది. ఎల్‌ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి కథనం ప్రకారం.. కరీంనగర్ మధురనగర్‌కు చెందిన శనిగరపు సాయికుమార్(16), చిలువేరు విజయ్ ద్విచక్రవాహనంపై నెల్లూరు నుంచి కరీంనగర్ వస్తున్నారు. అజాగ్రత్తగా బైక్ నడపడంతో అల్గునూరు బ్రిడ్జిపై అదుపు తప్పి స్తంభానికి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాయికుమార్, స్వల్ప గాయాలైన విజయ్‌ని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ సాయికుమార్ మృతిచెందాడు. మృతుడి తండ్రి శనిగరపు బానేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్‌ఎండీ పోలీసులు తెలిపారు.

గుంతను తప్పించబోయి..

గొల్లపల్లి(ధర్మపురి): ద్విచక్రవాహనం అదుపు తప్పి మహిళ మృతిచెందిన ఘటన గొల్లపల్లి మండలం చందోళి గ్రామ శివారులో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం పెద్దాపురం గ్రామానికి చెందిన చొప్పరి భూలక్ష్మి (52) అల్లుడు తాళ్ల కృష్ణకు పసరికలు కాగా, పసరికల మందు కోసం భూలక్ష్మి అల్లుడితో కలిసి బైక్‌పై గొల్లపల్లి మండల కేంద్రానికి బయలుదేరింది. మార్గమధ్యలో చందోళి శివారులో రోడ్డుమీద గుంతను తప్పించబోయి బైక్ అదుపుతప్పగా, బైక్ పైనుంచి కిందపడిన భూలక్ష్మి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. అతివేగంగా బైక్ నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు మృతురాలి భర్త వెంకటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

బస్సు నుంచి కిందపడి విద్యార్థికి గాయాలు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బస్‌డిపో వద్ద జగిత్యాల– కరీంనగర్ ప్రధాన రహదారిపై ఓ విద్యార్థి ఆర్టీసీ బస్సు నుంచి కిందపడగా స్వల్పగాయాలైనాయి. స్థానికుల వివరాలు.. జిల్లా కేంద్రానికి చెందిన నవీన బుధవారం పాత బస్టాండ్‌లో వేములవాడ డిపోకు చెందిన బస్సు ఎక్కింది. బస్‌డిపో వద్ద దిగేందుకు బస్సు ఆపాలని కండక్టర్, డ్రైవర్‌కు చెప్పగా వారు విన్పించుకోలేదు. విద్యార్థి దిగుతుండగా కిందపడటంతో స్వల్పగాయాలయ్యాయి. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు డ్రైవర్, కండక్టర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే విద్యార్థిని స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ధర ఉన్నా.. మిగిలేది సున్నా



పంటకోత ప్రయోగానికి వరి కోత (ఫైల్)

- అన్నదాతకు ఎప్పుడూ గడ్డుకాలమే
- పంట కోత ప్రయోగాల్లో వెల్లడి
- డ్రై స్పెల్‌తో తగ్గిన దిగుబడి.. ముసురుకున్న తెగుళ్లు

పంట కోత ప్రయోగం ఎలా చేశారంటే..

ప్రయోగానికి ఎంత విస్తీర్ణం	: పావు గుంట
వచ్చిన ధాన్యం దిగుబడి	: 14–15 కిలోలు
రావాల్సిన దిగుబడి	: 20 కిలోలు

పంట కోతలో ఉండే శాఖలు: ప్రణాళిక, రెవెన్యూ, వ్యవసాయ

పత్తి వచ్చిన దిగుబడి	: 5–6 కిలోలు
రావాల్సిన దిగుబడి	: 10–12

కరీంనగర్ అర్బన్: అన్నదాతకు ఎప్పుడూ గడ్డుకాలమే. అటు అకాల వర్షాలు.. ఇటు వర్షాభావంతో కర్షకులు కలవరపడుతుండగా దళారుల దోపిడీతో చిక్కిశల్యమవుతున్నారు. అరకొర పంట దిగుబడులకైనా గిట్టుబాటు ధర లభిస్తుందని ఆశిస్తే దళారులు గద్దల్లా తన్నుకుపోతున్నారు. ప్రభుత్వం నిర్వహించిన పంట కోత ప్రయోగాల్లోనూ దిగుబడి తగ్గినట్లు తేటతెల్లమైంది. జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ప్రయోగాల్లో అన్ని పంటలది అదే దుస్థితి.

సమృద్ధిగా జలాలున్నా..

ఒకప్పుడు వర్షాలు లేక పంటలు దెబ్బతినగా దిగుబడి అంతంతమాత్రమే వచ్చేది. రెండేళ్ల నుంచి వర్షాలు సమృద్ధిగా కురుస్తుండగా సకాలంలో కురవాల్సింది అకాలంలో విరుచుకుపడుతున్నాయి. మరోవైపు డ్రై స్పెల్ (వర్ష విరామం) తీరని నష్టాన్ని మిగిల్చింది. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో భారీవర్షాలు కురుస్తుండగా పంటలు జలసమాధి అయిన ఘటనలు లేకపోలేదు. మొక్కజొన్న ఎదుగుదల లేకపోగా పత్తి పంటకు సంబంధించి పూత రాలి, కాత నల్లగా మారి పత్తి రూపుకోల్పోయింది. కరీంనగర్ అర్బన్ మినహా 15 మండలాల్లో ప్రధాన వనరు సాగు రంగమే కాగా మెట్ట ప్రాంతాల్లో అరకొర దిగుబడులు రాగా లోతట్టు ప్రాంతాల్లో పెట్టుబడిలో సగమే వచ్చే పరిస్థితి. సైదాపూర్, వీణవంక, చిగురుమామిడి, గంగాధర, జమ్మికుంట, హుజూరాబాద్, గన్నేరువరం, తిమ్మాపూర్, శంకరపట్నం, మానకొండూరు తదితర ప్రాంతాల్లో అతి వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి.

ఆశలు ఆడియాసలే..

జిల్లాలో 2 లక్షలకు పైగా ఎకరాల్లో వరి, 60 వేల ఎకరాలకు పైగా పత్తి సాగు చేశారు. ఆరంభంలో పంటలు కళకళలాడటంతో అన్నదాతలు దిగుబడులపై ఆశలు పెంచుకున్నారు. కానీ అకాలంలో కురిసిన వర్షాలు ఆశలను అడియాసలు చేశాయి. సకాలంలో వర్షాలు లేక దిగుబడిపై ప్రభావం పడింది. వరి గొలక వేసిన దశలో వర్షాలు కురవడంతో పూత రాలిపోయింది. దీనికి తోడు తెగుళ్లు ముప్పిరిగొన్నాయి. అలాగే పత్తి పంట ఎదుగుదల దెబ్బతినగా దోమ, ఇతర చీడపీడల ఉధృతితో పెట్టుబడి మరింత పెరిగింది. 150కి పైగా పంట కోత ప్రయోగాలు చేపట్టగా దిగుబడులు తక్కువ రావడం అన్నదాత దుస్థితికి అద్దం పడుతోంది. పత్తి 5–6 కిలోలు రాగా మక్క 23 కిలోలు, ధాన్యం 14–15కిలోలు మాత్రమే రావడం శోచనీయం.

నష్టపరిహారం అందేనా?

ప్రకృతి వైపరీత్యాలతో పంట కోల్పోయిన రైతాంగానికి భరోసా కరువైంది. గత రెండు సీజన్లు కలిపి అకాల వర్షాలకు 30వేల ఎకరాల వరకు పంటలు దెబ్బతిన్నాయి. నామమాత్రంగా పంట నష్టానికి ప్రాథమిక అంచనా నివేదికలు తయారు చేసి చేతులు దులుపుకున్నారు. గతంలో బ్యాంకు రుణం పొందిన రైతులకు పరిహారమిచ్చేది. అలాగే పంటల బీమా ప్రీమియం చెల్లించిన వారికి పరిహారం అందేది. ఈ సారి ఆ ఊసే లేదు. దాదాపు అన్ని మండలాల్లోనూ పంటలు దెబ్బతిన్నాయి.

దళారుల రాజ్యం.. పర్యవేక్షణ పూజ్యం

జిల్లాలో కరీంనగర్, జమ్మికుంట, గంగాధర, గోపాల్‌రావుపేట, చొప్పదండి మార్కెట్లలో పత్తి కొనుగోళ్లు జరగడం పరిపాటి. జిన్నింగ్ మిల్లులు, అన్ని మార్కెట్లలో పత్తి కొనుగోళ్లు అరకొరగా సాగుతుండగా దళారులే ధరలను శాసించే పరిస్థితి. అలాగే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతుండగా రైతులు మిల్లర్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో తూకంలో కోత, తరుగు, నాణ్యత పేరుతో కిలోల కొద్ది కోతలు విధిస్తున్నారు. సిండికేట్‌గా మారి వీలైనంత మేర రైతులను దోచుకుంటున్నారు.

నిండ మునిగిన



మూడెకరాల్లో వరి వేసిన. ఫస్ట్ పంట మంచిగుండె. మధ్యలో వర్షాలు లేక తెగుళ్లసోకాయి. వానలు అనుకూలంగా పడితే మంచిగుండు. మూడెకరాల్లో వరి కోస్తే 19క్వింటాళ్ల వడ్లు వచ్చినయి. ఎప్పుడైనా 80క్వింటాళ్లు వచ్చేటివి. అటు వాన పగబట్టింది. ఇటు ఇదీ పరిస్థితి.

– జాగిరి లచ్చయ్య, రైతు, రేకుర్తి

వాలీబాల్ విజేత ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల



అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తదితరులు

కరీంనగర్‌స్పోర్ట్స్: శాతవాహన విశ్వవిద్యాలయంలో బుధవారం జరిగిన అంతర్ కళాశాలల వాలీబాల్ పోటీల్లో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. పోటీల్లో మొత్తం పది కళాశాలల జట్లు పాల్గొనగ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళా శాల జట్టు, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల తంగళ్లపల్లి జట్టుపై 25–14 తేడాతో గెలిచింది. ఈ సందర్భంగా గెలిచిన జట్టును అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపిక చేసినట్లు ఫిజికల్ డైరెక్టర్స్ పేర్కొన్నారు. విజేతగా నిలిచిన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జట్టును ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్‌రావు, డాక్టర్ రజనీదేవి, సతీశ్ కుమార్, బాలసుబ్రహ్మణ్యం అభినందించారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థి



సుదీష్ణను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

రామడుగు(చొప్పదండి): మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాల విద్యార్థి జి.సుదీష్ణ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 3న తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన జూనియర్ బాలికల పోటీల్లో సత్తాచాటి జాతీయ జట్టుకు ఎంపికైనట్లు అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 16 నుంచి 18 వరకు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా బుధవారం సుదీష్ణను అభినందించారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు పారమిత విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కరీంనగర్: నగరంలోని పారమిత ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న డి.ప్రణవ్‌తేజ, 8వ తరగతి విద్యార్థి పి.మధుహాసిని అండర్–14 ఎస్ జీ ఎఫ్ బాలబాలికల విభాగంలో జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం బాలాజీ తెలిపారు. ఇటీవల వరంగల్ జిల్లా తొర్రూరులో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభకనబరిచి కాంస్య పతకం సాధించారు. ఈనెల 14 నుంచి 16 వరకు గుజరాత్‌లోని నందియాడ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, అనుకర్‌రావు, వినోదరావు, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, సమన్వయకర్తలు, పీఈటీ వేణు, రాజశేఖర్, సాగర్ అభినందించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని తేజస్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ సీహెచ్ సతీశ్‌రావు తెలిపారు. కరీంనగర్‌లో ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు అండర్–19 విభాగంలో కె.శ్రీకర్, ఎస్.ఓంప్రసాద్, ఎండీ అలీమొద్దీన్, ఎం.సాయికిరణ్ అద్భుతంగా రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో సత్తాచాటి జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షిస్తూ బుధవారం వారిని పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో ప్రజాప్రతినిధులు

వేములవాడరూరల్: వేములవాడ అర్బన్ మండలం అనుపురం ప్రభుత్వ పాఠశాలలో బుధవారం అండర్–14 ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీల్లో రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లా క్రీడాకారులు పాల్గొన్నారు. జెడ్పీటీసీ మ్యాకల రవి టాస్ వేసి పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆర్‌సీ రావు, బీఆర్‌ఎస్ నాయకులు బూర బాబు, క్రీడాకారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జాతీయ కరాటే పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న రాజిరెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: న్యూ ఢిల్లీలో ఈనెల 15 నుంచి జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కరాటే పోటీలకు కరీంనగర్ ఆర్ఆర్ కరాటే అకాడమీ విద్యార్థులు ఎంపికైనట్లు అకాడమీ చీఫ్ కోచ్ గౌరు రాజిరెడ్డి తెలిపారు. ఇటీవల నల్గొండలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ కరాటే పోటీల్లో అండర్- 17, 50 కేజీల విభాగంలో బి.ఆర్యన్, 55 కేజీల విభాగంలో ఎం.విఘ్నేశ్ గోల్డ్ మెడల్ సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఆర్యన్ అల్ఫోర్స్ కళాశాల, విఘ్నేశ్ సప్తగిరి హైస్కూల్లో చదువుతున్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ఎస్జీఎఫ్ సెక్రెటరీ శ్రీనివాస్, జూడో అసోసియేషన్ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి తదితరులు అభినందించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని సైకిలిస్ట్ మృతి



ఒగ్గు సాయిలు(ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ సైకిలిస్ట్ మృతిచెందిన ఘటన తంగళ్లపల్లి మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు. స్థానిక కేసీఆర్‌నగర్(డబుల్ బెడ్‌రూం సముదాయం)లో నివసిస్తున్న ఒగ్గు సాయిలు(50) సిరిసిల్లలో గార్మెంట్‌లో బట్టలు కుడుతుండేవాడు. బుధవారం సైకిల్‌పై సిరిసిల్లకు పనికి వెళ్లి తిరిగి ఇంటికెళ్తుండగా తంగళ్లపల్లిలో ఎదురుగా వస్తున్న సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో సాయిలు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కొడుకు దిలీప్‌కుమార్(21) ఇటీవల క్యాన్సర్‌తో చనిపోయినట్లు తెలిసింది. మృతుడికి భార్య కమల, కూతురు అనూష ఉన్నారు. తంగళ్లపల్లి ఎస్సై వి.వెంకటేశ్వర్లు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సాయిలు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొలంలోనే కుప్పకూలిన కూలీ

- గుండెపోటుతో మృతి



రాయపోశం మృతదేహం

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని మొట్లపల్లికి చెందిన జిలుకర రాయపోశం(57) అనే వ్యవసాయ కూలీ గుండెపోటుతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. రాయపోశం మొట్లపల్లికే చెందిన ఓ రైతు పొలంలో బుధవారం ఒడ్లు పెట్టేందుకు వెళ్లాడు. పారతో ఒడ్లు పెడుతుండగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. చుట్టుపక్కల రైతులు గమనించి, చూసేసరికి మృతిచెందాడు. మృతుడి భార్య కొమురమ్మ ఏడాదిన్నర క్రితం చనిపోయింది. ఇద్దరు కుమారులు రమేశ్, బాలకృష్ణ ఉన్నారు. స్థానికులతో కలివిడిగా ఉండే రాయపోశం మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

తపాలాశాఖలో సమ్మె సైరన్

- గ్రామీణ ఢాక్ సేవకుల నిరసన
- విధులు బహిష్కరించి పోరుబాట
- పనిభారం..వేధింపులపై విమర్శలు
- కమలేశ్‌చంద్ర సిఫారసు అమలుకు డిమాండ్
- రెండు రోజులుగా సమ్మెబాటలో జీడీఎస్‌యూలు
- సిరిసిల్ల డివిజన్ పరిధిలో 160 మంది ఉద్యోగులు



నిరవధిక సమ్మెలో పోస్టల్ ఉద్యోగులు

సిరిసిల్లటౌన్: కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని తపాలా ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. రెండు రోజులుగా విధులు బహిష్కరించి సమ్మెబాట పట్టారు. తమ డిమాండ్లు అమలు చేయాలని కోరుతూ జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న గ్రామీణ ఢాక్ సేవకులు పోరుబాటపట్టారు. కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్లు అమలు చేసే వరకు పోరు సాగుతుందని స్పష్టం చేశారు. ఏఐజీడీఎస్‌యూ, ఎన్‌యూజీడీఎస్ యూనియన్ల ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె కొనసాగుతోంది. జిల్లావ్యాప్తంగా పోస్టల్ సేవలు నిలిచిపోవడంతో గ్రామీణులు ఇబ్బందులు పడుతున్నారు.

స్తంభించిన తపాలా సేవలు

జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ఢాక్ సేవకులు(తపాలా ఉద్యోగులు) 160 మంది ఉన్నారు. వీరు ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు విధులు నిర్వహిస్తే తప్ప రోజువారిలో పనిభారం తీరదు. నిబంధనల ప్రకారం 8 గంటలపాటు పనిచేయాలి. కానీ పనిభారం ఎక్కువై రోజులో 14 గంటల వరకు విధులు నిర్వర్తించాల్సి వస్తుందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తపాలాశాఖలో పోస్టల్ సేవలే కాకుండా బ్యాంకింగ్ సేవలు విస్తరించాయి. దీంతో గ్రామీణ ఢాక్ సేవకులపై పనిభారం పెరిగింది. వీరు గ్రామీణ ప్రజలకు ఇంటింటికెళ్లి వివిధ రకాల ప్రభుత్వ పథకాలు, బీమాలు, డబ్బులు విత్‌డ్రా, పోస్టులు, అంతర్జాతీయ ప్రైవేటు సంస్థల పార్సిల్స్ అందిస్తున్నారు.

జీడీఎస్‌యూల విధులు..సమస్యలు

గ్రామీణ ఢాక్ సేవకులు గ్రామాల్లో ఉంటూ పోస్టల్ బ్యాంకింగ్ ఆర్డీ, ఎస్బీ, సుకన్య అకౌంట్లు ప్రజలతో తీయిస్తున్నారు. జీవితబీమాలు, బజాజ్, టాటాఏజీ, వివిధ బ్యాంకుల ఇన్సూరెన్సులు, ఆధార్ ఆధారిత పేమెంట్లను అందిస్తున్నారు. రైతుబంధు, పీఎంకిసాన్, మనీ ఆర్డర్లు, ప్రధానమంత్రి జీవన జ్యోతి యోజన, డబ్బులను నేరుగా ఇంటికి వచ్చి లబ్ధిదారులకు అందిస్తున్నారు. పాన్, ఏటీఎం కార్డులు అప్లయ్ చేయించడం, పెన్షన్ల కోసం డిజిటల్ లైవ్ సర్టిఫికెట్లు, వివిధ బ్యాంకుల పేమెంట్లు అందించడం వంటి విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక రోజువారి పోస్టులు, ఉత్తరాలు, ప్రత్యుత్తరాల సేవలతోపాటు వివిధ ప్రైవేటు సంస్థల కొరియర్స్, పార్సిల్స్, బట్వాడా, స్పీడ్‌పోస్టులు, స్పీడ్ రిజిస్టర్ పోస్టులు సర్వీసులు అందిస్తున్నారు.

డిమాండ్లు ఇవీ..

- 8 గంటల పని, పెన్షన్ సహా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే ప్రయోజనాలు కల్పించాలి.
- 12, 24, 36 సంవత్సరాలు సర్వీసు పూర్తిచేసిన వారికి పదోన్నతులు కల్పించాలి. కమలేశ్ చంద్ర కమిటీ సిఫార్సులు అమలు చేయాలి.
- జీడీఎస్‌తోపాటు కుటుంబ సభ్యులకు రూ.5లక్షల బీమా, రెగ్యులర్ ఉద్యోగుల మాదిరి గ్రాడ్యుటీ పెంచాలి.
- ఇన్సెంటివ్స్, కమీషన్ పద్ధతులు రద్దు చేసి జీడీఎస్‌ల విధుల్లో ప్రతి పనిని వర్క్‌లోడ్‌లోకి తీసుకోవాలి.
- కొత్తగా నియమితులైన జీడీఎస్‌లకు 5 గంటల పనికి సెకండ్ టీఆర్‌సీఏ ఇవ్వాలి.
- బిజినెస్ టార్గెట్ల పేరుతో వేధించే అన్ని విధాల పద్ధతులు నిలిపివేయాలి.

ఆఫీసు ఖర్చులు మేమే భరిస్తున్నాం



అధిక పనిభారంతో ఎక్కువ గంటలు పనిచేయాల్సి వస్తుంది. ఇంట్లో పిల్లలు, వారి చదువులు, ఇంటిపనులు చేసుకోవడం ఇబ్బందులు తప్పడం లేదు. పెయిడ్ లీవులను 180 రోజుల వరకు దాచుకుని నగదు చేసుకునే అవకాశం కల్పించాలి. ఆఫీసు అద్దె, కరెంటు బిల్లు, స్టేషనరీ బిల్లులు మంజూరు చేయాలి.

– కోనేటి శిరీష, అల్మాస్‌పూర్ బీపీఎస్

పని ఎక్కువ.. జీతం తక్కువ



పనిభారం ఎక్కువ.. జీతం తక్కువ. ఉద్యోగాలు రెగ్యులరైజ్ అవుతాయన్న ఆశతో ఏళ్ల నుంచి విధులు నిర్వర్తిస్తున్నాం. ఫ్యామిలీ హెల్త్ ఇన్సూరెన్స్ అందించి, వేతనం నెలకు రూ.28వేలు అందివ్వాలి. అడ్రస్ తప్పుండి పార్శిల్, ఇతర సేవలు కాస్త లేటయినా మమ్మల్నే తిడుతుండ్రు. ఇలాంటి పద్ధతికి స్వస్తి పలకాలి.

– చింతల ధర్మయ్య, రాచర్ల బొప్పాపూర్, ఎస్పో

యువకుడి ఆత్మహత్యాయత్నం

రామగిరి: మండలంలోని పన్నూర్ పంచాయతీ పరిధి శివరాంనగర్‌లో యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికుల వివరాల ప్రకారం.. నాగెపల్లికి చెందిన మాటేటి సురేశ్(25) బుధవారం శివరాంనగర్‌లోని అత్తగారింటికి వచ్చాడు. తన భార్య కాపురానికి రావడం లేదని గొడవ పడి, వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. కుటుంబసభ్యులు మంటలు ఆర్పివేసి, గాయపడిన సురేశ్‌ను పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

వెళ్లిన నెల రోజులకే..

- బహ్రెయిన్‌లో ప్రమాదం.. బావుసాయిపేట వాసి మృతి



బాబు (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): బతుకుదెరువు కోసం నెల క్రితం గల్ఫ్ వెళ్లిన ఓ యువకుడు అక్కడ జరిగిన ప్రమాదానికి బలికాగా.. వారం రోజులకు శవపేటిక ఇంటికి చేరింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన లింగంపెల్లి రాజనర్సయ్య–లచ్చవ్వ కుమారుడు లింగంపల్లి బాబు(28) నెల రోజుల క్రితం బహ్రెయిన్ దేశం వెళ్లాడు. ఈ నెల 7న అక్కడ ఓ కంపెనీలో పనిచేస్తుండగా సెంట్రింగ్ పనికి వినియోగించే పెద్ద రాడ్ నాలుగో అంతస్తు మీద నుంచి బాబుపై పడింది. ఈ ప్రమాదంలో బాబు అక్కడికక్కడే మృతిచెందినట్లు తోటి స్నేహితులు గ్రామస్తులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి రాజనర్సయ్య కొన్నేళ్ల క్రితమే చనిపోగా, తల్లి లచ్చవ్వ, భార్య శిరీష, నాలుగేళ్ల వయస్సుగల కుమారుడు ఉన్నారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డాక్టర్ గోలి మోహన్ అక్కడి ఇండియన్ ఎంబసీ వారితో మాట్లాడి మృతదేహం ఇంటికి చేరేందుకు కృషి చేశారు. బాబు శవపేటిక ఇంటికి చేరడంతో కుటుంబసభ్యులు అశ్రునయనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

అనారోగ్యంతో యువకుడి బలవన్మరణం



సందీప్ (ఫైల్)

జ్యోతినగర్(రామగుండం): అనారోగ్య కారణాలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీపీసీ రామగుండం నగరంలోని ఆటోనగర్‌కు చెందిన రామంచ సందీప్(27) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కాసేపటికి వచ్చిన కుటుంబసభ్యులు వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి రాజయ్య ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం. కాగా కుటుంబసభ్యులు సందీప్ నేత్రాలను దానం చేయగా ఐ బ్యాంకు టెక్నీషియన్ బాలు సేకరించారు. అనంతరం హైదరాబాద్‌లోని ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రికి పంపించారు.

మద్యానికి బానిసై ఒకరు..

కమాన్‌పూర్(మంథని): మండలంలోని రొంపికుంట గ్రామానికి చెందిన తోట రవి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రవి–సరోజన దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. అతను మద్యానికి బానిస కావడంతో సరోజన పిల్లలను తీసుకొని, తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో రవి మంగళవారం రాత్రి ఇంట్లోనే క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తమ్ముడు రాకేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

కేసీఆర్‌ను పరామర్శించిన వినోద్‌కుమార్ దంపతులు



కేసీఆర్‌ను పరామర్శిస్తున్న వినోద్‌కుమార్ దంపతులు

కరీంనగర్: యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, డా.బోయినపల్లి మాధవి దంపతులు బుధవారం పరామర్శించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని వైద్యుల నడిగి తెలుసుకున్నారు.

రోడ్డు మరమ్మతు చేపట్టాలి

- వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్–రాయపట్నం రహదారిలో తీగలగుట్టపల్లి వద్ద నిర్మిస్తున్న ఆర్వోబీతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కె.నగేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్వోబీ నిర్మాణ పనులు జరుగుతున్న దాదాపు కిలోమీటరు వరకున్న డైవర్షన్ రోడ్డు పూర్తిగా గుంతలు పడినట్లు తెలిపారు. ప్రతిరోజు వేల సంఖ్యలో ప్రయాణం చేస్తున్న రోగులు, వృద్ధులు, మహిళలు వాహనాలు గుంతల్లో పడటంతో అవస్థలు పడుతున్నారన్నారు. ఆర్వోబీ పూర్తయ్యేవరకు డైవర్షన్ రోడ్డును గుంతల్లేకుండా మరమ్మతు చేసేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

నూతన కమిటీల ఎన్నిక

విద్యానగర్(కరీంనగర్): రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత సాధించడం కోసం ఈనెల నుంచి జనవరి 12 వరకు గ్రామాలు, మండలాల్లో ఎమ్మార్పీ నూతన కమిటీల నిర్మాణం చేపట్టనున్నట్లు జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ తెలిపారు. బుధవారం కరీంనగర్ ప్రెస్ భవన్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ ఉప కులాల వర్గీకరణ కోసం రాజ్యాంగ ధర్మాసనం తీర్పు వచ్చేసరికి గ్రామాలు, మండలాల్లో ఎమ్మార్పీ నూతన నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. నాయకులు చంచల నవీన్, దండు అంజయ్య, తుంగ ఆంజనేయులు, కనకం అంజిబాబు, చిలుముల రాజయ్య, తాండ్ర నర్సన్న, కొమ్ముల రాజమల్లు, నక్క లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మహానంది పురస్కారం అందుకున్న రవికుమార్



అవార్డు అందుకుంటున్న రవికుమార్

కరీంనగర్‌కల్చరల్: ఏస్ఎమ్ఎస్ 24 టీవీ ఆధ్వర్యంలో కాకతీయ మహానంది అవార్డును హైదరాబాద్‌లో ఇటీవల ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ పసుల రవికుమార్ అందుకున్నారు. బుధవారం కరీంనగర్ ఎక్సైజ్ భవన్‌లో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా మహానంది పురస్కారం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈపీవో శ్రీనివాసరావు, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ తాతాజీ, వేములవాడ ఎక్సైజ్ సర్కిల్ రాము, కరీంనగర్ జిల్లా కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్ అసోసియేషన్ అధ్యక్షులు పులి నగేష్‌గౌడ్, నుర్గిళ్ల కిషన్, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రెనె ఆసుపత్రికి బెస్ట్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న బంగారి స్వామి

కరీంనగర్‌టౌన్: న్యూఢిల్లీకి చెందిన వరల్డ్ అచివర్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన హెల్త్ కేర్ అచివర్స్ అవార్డ్స్–2023లో బెస్ట్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌గా కరీంనగర్‌కు చెందిన రెనె హాస్పిటల్ ఎంపికయిన సందర్భంగా న్యూఢిల్లీలోని శాంగ్రీలా ఎరోస్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి ఎస్.పి.సింగ్ బాగే చేతుల మీదుగా రెనె ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ బంగారి స్వామి అందుకున్నారు. బంగారి స్వామి మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ఉన్నతమైన వైద్య సేవలను అందించాలన్న మా లక్ష్యానికి ఇలాంటి అవార్డులు ఎంతో ప్రోత్సాహాన్నిస్తాయన్నారు. సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర సాంఘిక సంక్షేమ మంత్రి రాందాస్ అతవాలే, న్యూఢిల్లీ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి హర్షవర్దన్, అహ్మదాబాద్(వెస్ట్) పార్లమెంట్ సభ్యులు కీరిట్ ప్రేమ్ జీ భాయ్ సోలంకితో పాటు వరల్డ్ అచివర్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.



ఆహారం.. కొంగల ఆరాటం..

పొలంలో పంట పండించాలనే ఆరాటం రైతుది. తమ ఆకలి తీర్చుకోవాలనే పోరాటం కొంగలది. బుధవారం కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో యాసంగి సాగు కోసం పదాల తిరుపతి అనే రైతు పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నిస్తుండగా.. భూమిలో నుంచి బయటపడే పురుగులను తినడానికి కొంగలు పెద్ద సంఖ్యలో తరలివచ్చాయి. పొలంలో కొంగలు ఆహార పండుగను చేసుకుంటున్నాయా అన్నట్లుగా ట్రాక్టర్ చుట్టు గుంపులుగుంపులుగా తిరుగుతుండగా.. సమీప రైతులు ఆసక్తిగా తిలకించారు.

– కరీంనగర్‌రూరల్



ఆర్టీసీ ఫుల్.. ఆటో నిల్..

కరీంనగర్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తుండటంతో ఆటోవాలాలు ఉపాధి కోల్పోయారు. ప్రధానంగా రాజీవ్ రహదారిని ఆనుకొని ఉన్న గ్రామాల్లోని ఆటో డ్రైవర్లకు ప్రయాణికుల్లేకపోవడంతో ఖాళీగానే కాలం గడుపుతున్నారు. మహిళలంతా బస్సుల్లోనే ప్రయాణించడానికి మొగ్గు చూపుతుండటంతో.. కరీంనగర్, సుల్తానాబాద్, పెద్దపల్లి తదితర ప్రాంతాలకు గిరాకీలు దొరకక పూట గడవని పరిస్థితి నెలకొందని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రాజీవ్ రహదారిలోని మొగ్దుంపూర్ స్టేజీ వద్ద ఆటో లున్నా.. మహిళలు ఆర్టీసీ బస్సులో ఎక్కారు. బస్సు ఎక్కుతున్న మహిళలను చూస్తున్న ఆటో డ్రైవర్లు ఇదేమి ఖర్మరా మాకు అంటూ బిక్కమొహం వేసుకొని చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గంగులను కలిసిన బీఆర్ఎస్ నాయకురాళ్లు



ఎమ్మెల్యే గంగులకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకురాళ్లు

కరీంనగర్: కరీంనగర్ ప్రజల మన్ననలు పొంది వారి తీర్పుతో నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన గంగుల కమలాకర్‌ను బుధవారం బీఆర్ఎస్ నాయకురాలు గందె కల్పన మహిళలతో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కల్పన మాట్లాడుతూ.. కేబుల్ బ్రిడ్జి నిర్మాణం, అందమైన కూడళ్లు, రోడ్లు, సెంట్రల్ లైటింగ్ సిస్టం వారి సహకారంతోనే అభివృద్ధి చెందిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వొల్లాల సమత, నలమాచు రాణి, సల్వాజి దీప, గంగిపెల్లి అంజలి, వొల్లాల సంకీర్తన, మంగ తదితరులు పాల్గొన్నారు.

సన్నాలు కరువు..

- రైసుమిల్లర్ల కొనుగోళ్లతో డిమాండ్
- జైశ్రీరాం బియ్యం క్వింటాల్‌కు రూ.6వేలు



చెర్లభూత్కూర్‌లో జైశ్రీరాం ధాన్యం కుప్పలు

కరీంనగర్‌రూరల్: సన్న ధాన్యం సాగు తగ్గిపోవడంతో డిమాండ్ ఎక్కువై ధరలు పెరుగుతున్నాయి. సన్న బియ్యం వినియోగం ఎక్కువగా ఉండటం, అందుకు తగ్గట్టుగా ఉత్పత్తి లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. కరీంనగర్ మండలంలో వానాకాలం సీజన్‌లో 13వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. ఇందులో 10వేల ఎకరాల్లో దొడ్డు రకం, 3వేల ఎకరాల్లో మాత్రమే సన్న రకం పండించారు. దొడ్డు రకం ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. గతంలో సన్నాలను కూడా కేంద్రాల్లో విక్రయించిన రైతులు.. ప్రస్తుతం ఒక్క క్వింటాల్ కూడా తీసుకురాలేదు.

ధాన్యం నిల్వ..

సన్నాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడటంతో రైసుమిల్లర్లు పెద్దఎత్తున రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతు ధర గ్రేడ్–ఏ రూ.2203, సాధారణ రకం రూ.2180 చెల్లిస్తుంది. అయితే సన్నాలను ఈ ధరకు రైతులు అమ్ముకుంటే నష్టపోయే అవకాశముండటంతో రైసుమిల్లర్లకు విక్రయిస్తున్నారు. మిల్లర్లు సైతం హెచ్ఎంటీ, ఆర్ఎన్ఆర్, బీపీటీ వంటి సన్న రకాలకు క్వింటాల్‌కు రూ.2,600 నుంచి రూ.2,800 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల ధరను మించి రైసుమిల్లర్లు కొనుగోలు చేస్తుండటంతో రైతులు విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. అయితే కొంతమంది రైతులు ధరలు మరింత పెరిగే అవకాశముందనే ఉద్దేశంతో ధాన్యాన్ని విక్రయించకుండా నిల్వ చేస్తున్నారు. సన్నాలను బియ్యం పట్టించి నేరుగా వినియోగదారులకు విక్రయించేందుకు మిల్లర్లు ధాన్యాన్ని కొంటున్నారు. రైతులు సైతం రైసుమిల్లుల్లో సన్నాలను పట్టించి తినేందుకు వీలుగా సరిపడే బియ్యాన్ని నిల్వ చేసుకుంటున్నారు.

జైశ్రీరాంకు డిమాండ్

రెండేళ్లలో సన్న రకాలకు తక్కువ ధరలే ఉండగా.. ఈ సీజన్‌లో అనూహ్య రీతిలో ధరలు పెరిగాయి. ప్రధానంగా జైశ్రీరాం రకానికి రూ.3వేల వరకు ధర పలుకుతోంది. రైసుమిల్లర్లు ఈ ధరకే రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. వినియోగదారులు సైతం జైశ్రీరాం బియ్యం కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతుండటంతో మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. క్వింటాల్‌కు రూ.5,800నుంచి రూ.6వేల ధర ఉంది. బీపీటీ, ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ తదితర సన్న బియ్యానికి క్వింటాల్‌కు రూ.4,200 ధర పలుకుతోంది. రాబోయే రోజుల్లో సన్న బియ్యానికి మరింత ధరలు పెరిగే అవకాశముందనే ఉద్దేశంతో పలువురు వినియోగదారులు ఇపుడే బియ్యాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారు.

దివ్యాంగులు స్ఫూర్తి ప్రదాతలు



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్



చెస్ పోటీలను వీక్షిస్తున్న కలెక్టర్ పమేలా

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్‌స్పోర్ట్స్: సమాజంలో దివ్యాంగులు సాధారణ పౌరులతో సమానంగా అన్ని రంగాల్లో బాగా రాణిస్తూ స్ఫూర్తి ప్రదాతలుగా నిలుస్తారని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం కరీంనగర్ పట్టణంలోని డా.బి.ఆర్.అంబేడ్కర్ స్టేడియంలో మహిళా, శిశు , దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన జిల్లాస్థాయి దివ్యాంగుల ఆటల పోటీలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. అన్ని అవయవాలు సక్రమంగా పని చేసే వ్యక్తులు విజయాలను సాధిస్తే, ప్రతికూలతలను అధిగమిస్తూ అసమాన విజయాలను సాధించే దివ్యాంగులు ఎంతోమందికి స్ఫూర్తి ప్రదాతలుగా నిలుస్తారని అన్నారు. దివ్యాంగుల తల్లిదండ్రుల కన్న టీచర్లు, గార్డియన్లు పిల్లలకు తోడుగా నిలిచి వారికి సకాలంలో సరైన ప్రోత్సాహాన్ని అందిస్తూ ముందుకు నడిపిస్తున్నవారందరినీ కలెక్టర్ అభినందించారు. జిల్లాస్థాయి ఆటల పోటీల్లో పాల్గొన్నవారందరూ రాష్ట్రస్థాయిలో కూడా అద్భుతమైన విజయాలను సాధించాలని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అంధులు ఆడే చెస్ పోటీలను వీక్షించిన కలెక్టర్.. వారి ఆటతీరును తన ఫోన్‌లో వీడియో తీసుకోవడంతో పాటు వారి ప్రతిభను అభినందించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడారు. జిల్లాస్థాయి దివ్యాంగుల ఆటల పోటీల్లో శారీరక వైకల్య సమస్యలను అధిగమించి ఉత్సాహంగా పాల్గొంటున్నవారందరినీ అభినందించారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, క్రీడాభివృద్ధి అధికారి రాజవీర్, డీఆర్డీవో శ్రీలత, దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ నర్మద, కమల, ఏసీడీపీవోలు సౌందర్య, అరవింద, దివ్యాంగుల సంఘాల బాధ్యులు జక్కం సంపత్, వెన్నం శ్రీనివాస్, కొత్తూరు స్వామి, ఐలి లింగమూర్తి, శ్రీవాణి, మంచాల రాజేందర్, కైరి అంజయ్యగౌడ్, జాపాల భిక్షపతి పాల్గొన్నారు.

చేగుర్తి ఇసుక క్వారీ రద్దు చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిన నాయకులు

కరీంనగర్‌రూరల్: చేగుర్తిలోని ఇసుక క్వారీని రద్దు చేయాలని కోరుతూ బుధవారం అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌కు కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. కరీంనగర్ మండలం చేగుర్తి, మానకొండూరు మండలం లింగాపూర్ గ్రామాల పరిధిలోని మానేరు వాగులో డి–సిల్టేషన్ పేరుతో ఇసుక క్వారీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు మూడు జేసీబీలను ఉపయోగించి పెద్దఎత్తున లారీల్లో ఇసుకను తరలిస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంటిపోయినట్లు వివరించారు. మానేరు వాగులో ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని ఎన్‌జీటీ తీర్పు ఇచ్చినా.. అక్రమంగా క్వారీ నిర్వహిస్తున్నారని తెలిపారు. భాషవేణి మల్లేశం యాదవ్, మూల వెంకటేశం, సంపత్‌కుమార్, సంజీవ్, గోపాల్, ఎల్లయ్య, వెంకటస్వామి, సురేందర్, రవీందర్‌రావు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో క్రమశిక్షణ



నందినిని సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

కరీంనగర్‌రూరల్: విద్యార్థులకు క్రీడలతోనే క్రమశిక్షణ అలవడుతుందని ఆసియన్ గేమ్స్ కాంస్య పతక విజేత అగసరా నందిని అన్నారు. బుధవారం కరీంనగర్ మండలం నగునూరులోని ప్రతిమ వైద్య కళాశాలలో జరిగిన 20వ వార్షిక క్రీడోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులందరూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. క్రీడలతో సమయపాలన అలవాటవుతుందని తెలిపారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులందించారు. సీఏవో రాంచందర్‌రావు, డీన్ వివేకానంద, రిజిస్ట్రార్ ప్రసాద్‌రావు, ఏవో ప్రేంసాగర్‌రావు, పీడీలు వేణుకిషన్‌రావు, వెంకటేశ్వర్లు, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు టీకేకే నాయుడు, ఆనందం, కిషన్‌రెడ్డి, మానస్, రూప్‌శిఖ, ప్రణయ్, ప్రశాంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలకు ఆర్వో ప్లాంటు బహూకరణ



కరీంనగర్‌టౌన్: బీఎస్‌రావు హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు ఆర్వో వాటర్ ప్లాంటును బహూకరించారు. బుధవారం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎస్‌రావు ప్లాంటును ప్రారంభించారు. బీఎస్‌రావు మాట్లాడుతూ.. మెడికల్ కళాశాల విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటినందించాలనే ఉద్దేశంతో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను బహూకరించినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మినారాయణ, ఫౌండేషన్ బాధ్యులు డాక్టర్ ఝాన్సి, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ రాంకిరణ్, డాక్టర్ అలీం, కళాశాల అధ్యాపకులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనం.. కబ్జాకు యత్నం

- చెట్ల తొలగింపు.. ఆపై భూమి చదును
- అడ్డుకోవడంలో అధికారుల వైఫల్యం
- ఎలగందులలో స్థానిక నేతల ఇష్టారాజ్యం



ఎలగందులలో పల్లె ప్రకృతి వనం చెట్లను తొలగించిన స్థలం

కొత్తపల్లి: ఎలగందుల గ్రామంలో ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో జోరుగా కొనసాగుతున్న ఆక్రమణలను అడ్డుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. కోట్లాది రూపాయల విలువ గల భూమి కళ్లెదుటే ఆక్రమణకు గురవుతుంటే చూడలేని ప్రజలు ఉన్నతాధికారులకు విన్నవించినా ఎలాంటి చర్యలు లేకపోవడంతో నిరాశకు లోనవుతున్నారు. ఎలగందులలో పల్లె ప్రకృతి వనంలోని చెట్లను ధ్వంసం చేసి భూఆక్రమణకు పాల్పడుతున్నా అధికారులు మిన్నకుండిపోవటం అనుమానాలకు తావిస్తోంది. దీనికితోడు ఎన్నికల సమయంలో అధికారులు బిజీగా ఉండటం అక్రమార్కులకు వరంగా మారింది. పలుమార్లు ప్రజావాణిలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం స్థానికంగా ఆవేదనకు లోను చేస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనం ధ్వంసం చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చర్యలేవి..

ఎలగందులలో పల్లె ప్రకృతి వనం తొలగించి భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతి వనం చెట్లను సైతం అక్రమార్కులు వదలకపోగా.. పెరిగిన చెట్లను ధ్వంసం చేసి భూమి చదును చేపట్టి అక్రమ నిర్మాణాలకు సన్నద్ధమయ్యారు. ఎలగందుల గ్రామంలోని సర్వే నెంబర్ 28లో పల్లె ప్రకృతి వనం మొక్కల పెంపకానికి 20 గుంటల స్థలం కేటాయించారు. ఈ స్థలంలో సుమారు 1,800 మొక్కలు ఈజీఎస్ ద్వారా నాటి పంచాయతీకి బాధ్యతలు అప్పజెప్పారు. పంచాయతీ సిబ్బంది కళ్లుగప్పి పల్లె ప్రకృతి వనం చెట్లను ధ్వంసం చేసి, భూమిని చదును చేసి, అందులో బేస్మెంట్ నిర్మాణాలు చేపట్టగా.. వాటిని అధికారులు తొలగించారు. అయితే చెట్లు తొలగించిన వారిపై ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. స్థానిక నేతల ఒత్తిడితో అధికారులు చర్యలు తీసుకోవడం లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెట్లను ధ్వంసం చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చట్ట ప్రకారం చర్యలు



ఎలగందుల పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం చెట్లను ధ్వంసం చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. చెట్లు తొలగించిన వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని పోలీసు కేసు నమోదు చేస్తాం. సార్వత్రిక ఎన్నికల్లో నిమగ్నమై ఉండటంతో దృష్టి సారించలేకపోయాం.

– ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో, కొత్తపల్లి

జిల్లాస్థాయి చదరంగ పోటీలకు స్పందన



తలపడుతున్న క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం కరీంనగర్‌లోని జీనియస్ చెస్ అకాడమీలో జరిగిన జిల్లాస్థాయి అండర్ 14, 17 బాలబాలికల చదరంగ పోటీలకు విశేష స్పందన వచ్చింది. జిల్లావ్యాప్తంగా పలు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లాస్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులను కరీంనగర్ జోన్ స్థాయి పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారు. జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి పోతన శ్రీనివాస్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్‌కుమార్, పీఈటీలు, కోచ్‌లు, క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో బీజేపీ జెండా ఎగరేయాలి

- జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



కొత్తపల్లిలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

కొత్తపల్లి: లోక్‌సభకు జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంపై బీజేపీ జెండా ఎగరేసేందుకు కార్యకర్తలు కార్యోన్ముఖులు కావాలని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కొత్తపల్లిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ స్వల్ప తేడాతో ఓటమి చవిచూసినా.. నిరాశ చెందకుండా జరగబోయే పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి పెట్టాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ.. ప్రధాని నేతృత్వంలో దేశం ఎంత సురక్షితంగా ఉందో వివరించాలని సూచించారు. పట్టణ అధ్యక్షుడు కెంచ శేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేశ్, కౌన్సిలర్ వాసాల రమేశ్, నాయకులు వేముల చంద్రశేఖర్, దాడి సుధాకర్, కరం రవి, హరీష్, నరేష్, చింతల శ్రీనివాస్‌రెడ్డి, కొప్పుల హరిప్రసాద్, మునిందర్‌రెడ్డి, హరిబాబు, శ్రావణ్, సంతోష్, ప్రదీప్, మల్లికార్జున్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరు లేన్లు అయ్యేనా?

- 65 నంబర్ జాతీయ రహదారి విస్తరణపై మంత్రి కోమటిరెడ్డి ప్రకటన
- విస్తరణ పూర్తయితే రెండున్నర గంటల్లోనే హైదరాబాద్ నుంచి విజయవాడకు


ఆరు వరుసలుగా మార్చాల్సిన జాతీయ రహదారి ఇదే

చౌటుప్పల్: త్వరలో హైవే విస్తరణకు చర్యలు తీసుకుంటామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇటీవల ప్రకటన చేశారు. దీంతో హైదరాబాద్‌- విజయవాడ 65వ నంబరు జాతీయరహదారి ఆరు లేన్ల విస్తరణకు మోక్షం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం రెండున్నర గంటల్లోనే చేరుకోవచ్చు. మంత్రి ప్రకటనతో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన వాహనదారులు, ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

బీఓటీ పద్ధతిన నాలుగు లేన్లుగా విస్తరణ

హైదరాబాద్ – విజయవాడ మధ్య 275 కిలోమీటర్ల దూరం ఉంది. ఇందులో హైదరాబాద్ నుంచి యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం వరకు, ఏపీలోని విజయవాడ నుంచి నందిగామ వరకు నాలుగు లేన్ల రోడ్డుగా వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో విస్తరించారు. మిగిలిన 180 కిలోమీటర్లు మాత్రం బీఓటీ పద్ధతిన నాలుగులేన్లుగా నిర్మించారు. ఈ పనులను జీఎంఆర్ సంస్థ చేపట్టింది. ఈ పనులకు అప్పటి సీఎం రోశయ్య 2010 మార్చిలో నార్కట్‌పల్లి వద్ద శంకుస్థాపన చేశారు. రెండేళ్లలో నిర్మాణ పనులు పూర్తి చేసి మూడు ప్రాంతాల్లో టోల్‌ప్లాజాల వద్ద టోల్ రుసుము వసూలు చేస్తోంది.

కోర్టును ఆశ్రయించిన జీఎంఆర్ సంస్థ

ఈ హైవేను ఆరులేన్లుగా విస్తరించాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఎంపీలుగా ప్రాతినిధ్యం వహించిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు ఎప్పటికప్పుడు కేంద్రం దృష్టికి తీసుకెళ్లి ఒత్తిడి తీసుకొచ్చారు. అయితే హైవే విస్తరణ పనులు చేపట్టిన కాంట్రాక్టు సంస్థ జీఎంఆర్ ముందస్తుగా కోర్టును ఆశ్రయించింది. తాము బీఓటీ పద్ధతిలో రోడ్డు నిర్మాణ పనులు చేశామని, టోల్ వసూలు చేసుకునేందుకు తమకు ఇంకా గడువు ఉందని, పెట్టుబడి కింద టోల్ వసూళ్లు అనుకున్న మేరకు రానందున మరికొంత కాలం అనుమతి ఇప్పించాలని కోర్టుకు వెళ్లింది. దీంతో విస్తరణ ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది.

అత్యంత రద్దీ రహదారిగా గుర్తింపు

హైదరాబాద్‌- విజయవాడ హైవే దేశంలోనే అత్యంత రద్దీ రహదారిగా గుర్తింపు పొందింది. టోల్‌ప్లాజాల లెక్కల ప్రకారం రోజూ సగటున 40వేల నుంచి 50వేల వాహనాలు ఈ మార్గంలో వెళుతున్నాయి. దీనిపై ఏ చిన్నపాటి ప్రమాదం జరిగినా గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతోంది.

అన్ని విధాలుగా ప్రయోజనం



హైవేను ఆరు వరుసలుగా విస్తరిస్తే ప్రమాదాలు చాలా వరకు తగ్గుతాయి. వాహనదారులు, ప్రయాణికులకు సమయం కూడా కలిసివస్తుంది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో విస్తరణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని ఆశిస్తున్నాం.

– చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, చౌటుప్పల్ జెడ్పీటీసీ సభ్యుడు

సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలి



ప్రస్తుతం నాలుగు వరుసలుగా ఉన్న హైవేపై నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. దీనిని తగ్గించడానికి ఆరు వరుసలు అవసరం. విస్తరణతోపాటు హైవే వెంట ఉన్న అన్ని గ్రామాల వద్ద సర్వీసు రోడ్లు నిర్మించాలి.

– బాతరాజు సత్యం, పంతంగి సర్పంచ్





ఘనంగా భారత నావికా దళ వారోత్సవాలు

సాక్షి, హైదరాబాద్: భారత నావికాదళం వారోత్సవాల్లో భాగంగా బుధవారం సికింద్రాబాద్‌లో నావికా దళానికి చెందిన బ్యాండ్ విభాగం ఉత్సవాలు నిర్వహించింది. ఈ కార్యక్రమానికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నావికాదళ విజయాలను తెలిపే పలు బ్యానర్లను ఈ సందర్భంగా ప్రదర్శించారు. 1971లో జరిగిన యుద్ధంలో పాకిస్తాన్‌పై భారత్ సాధించిన విజయాన్ని గుర్తుచేస్తూ ఏటా ఈ వారోత్సవాలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో కమాండర్ మనోజ్ సెబాస్టియన్, అసిస్టెంట్ ప్రిన్సిపల్ కమాండర్ జే పద్మనాభన్ తదితరులు పాల్గొన్నారు.


ఈ నెల 12న పశువుల కాపరిపై దాడి చేసిన ఆడపులి (ఎస్9)

పులి భయం మళ్లీ మొదలైంది. కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ మండలం నందిగూడ అటవీ ప్రాంత శివారులో రెండురోజుల కిందట పశువును చంపేసి.. పశువుల కాపరి గులాబ్‌పై దాడి చేసిన ఘటన దరిమిలా ఆ ప్రాంత సమీప ప్రజల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఆ ఘటనలో గులాబ్ అప్రమత్తంగా వ్యవహరించి ప్రాణాలతో బయటపడగా, చేతికి గాయాలయ్యాయి. ప్రతీ ఏడాది పత్తి తీసే ఇదే సీజన్‌లోనే పులుల సంచారం పెరుగుతోంది. దీంతో పత్తి చేన్లకు వెళ్లాలన్నా, జీవాలను మేతకు తీసుకెళ్లాలన్నా కాపర్లు జంకుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, మంచిర్యాల

మళ్లీ పులి భయం

- ఏటా ఇదే సీజన్‌లో భయపెడుతున్న టైగర్
- నందిగూడ శివారులో పశువును చంపి.. కాపరిపై దాడి
- పత్తి చేన్లకు వెళ్లాలంటే జంకుతున్న స్థానికులు
- అటవీ సమీప ప్రాంతాల వరకు పులి సంచారం

మూడేళ్లుగా మనుషులపై దాడులు

గత మూడేళ్లుగా నవంబర్ నుంచి జనవరి మధ్యే పులుల దాడులు అధికంగా ఉంటున్నాయి. రాష్ట్రంలో తొలిసారిగా 2020 నవంబర్ 11న ఏ2 అనే పులి కుమురంభీం జిల్లా దహెగాం మండలం దిగిడకు చెందిన సిడాం విగ్నేశ్(21) పత్తి చేనుకు వెళ్తుండగా దాడి చేసి చంపేసింది. అదే నెల 29న పెంచికల్‌పేట మండలం కొండపల్లికి చెందిన పసుల నిర్మల(18)ను పొట్టన పెట్టుకుంది. కేవలం మూడు వారాల వ్యవధిలోనే ఇద్దరి మృతితో స్థానికుల నుంచి నిరసనలు వచ్చాయి. దాంతో అటవీ శాఖ సీరియస్‌గా తీసుకుని ఆ పులిని బంధించే ప్రయత్నం చేసినా.. సాధ్యపడలేదు. ఆ తర్వాత పులి మహారాష్ట్ర వైపు వెళ్లిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ గతేడాది నవంబర్‌లోనే కుమురంభీం జిల్లా వాంకిడి మండలం ఖానాపూర్‌కు చెందిన రైతు సిడాం భీము(69)ను పత్తి చేనులో ఉండగా దాడి చేసి చంపేసింది. తాజాగా పశువుల కాపరిపై దాడి జరిగింది.

జత కట్టే సమయంలో?

పులులు జత కట్టే సమయం నవంబర్ నుంచి ఏప్రిల్ మధ్యే కావడం, తోడు, ఆవాసం కోసం తోటి పులుల మధ్య ఆధిపత్య పోరు, వాగులు, నదులు, ప్రాజెక్టుల్లో నీటి లభ్యత ఉన్న చోట సంచరిస్తూ అనుకోకుండా మనుషులు ఎదురుపడితే దాడులకు ప్రధాన కారణమవుతున్నాయని అటవీశాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఉమ్మడి ఆదిలాబాద్ మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు.. పులుల రాకపోకలకు ప్రధాన కారిడార్‌గా ఉంది. ఆదిలాబాద్ నుంచి ఆసిఫాబాద్, మంచిర్యాల వరకు పులుల సంచారం ఉంటోంది. పెన్‌గంగా, ప్రాణహిత తీరాలు దాటి తిప్పేశ్వర్, తడోబా టైగర్ రిజర్వ్ పులుల అభయారణ్యాల నుంచి వలస వస్తుంటాయి. ఎనిమిదేళ్ల క్రితం పాల్గుణ అనే ఆడపులి కాగజ్‌నగర్‌లోనే స్థిర నివాసం ఉండటంతో సంతతి పెరిగింది. ఇలా అనేక పులులు ఒక్కొక్కటిగా తెలంగాణ భూభాగంలో ఆవాసం, తోడు వెతుక్కుంటూ అడుగుపెడుతున్నాయి. టైగర్ రిజర్వు పరిధి కోర్ ఏరియా మంచిర్యాల జిల్లా జన్నారం డివిజన్ కవ్వాల్‌లో మాత్రం ఇప్పటికీ ఒక్క పులి కూడా స్థిరంగా ఉండలేదు. కేవలం బఫర్ ప్రాంతాల్లోనే పులులు సంచరించడంతో సమస్య మొదలవుతోంది. ఆ ప్రాంతాల్లోనే పత్తి చేన్లు, మానవ సంచారం ఉండడంతో ఎదురుపడిన సందర్భంలో దాడి చేస్తున్నాయి.

బఫర్ జోన్‌లోనే సంచారం

నిత్యం ఆదిలాబాద్ డివిజన్‌లో తాంసి, భీంపూర్, ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ డివిజన్‌లో దహెగాం, పెంచికల్‌పేట, బెజ్జూరు, బెల్లంపల్లి, చెన్నూరు డివిజన్ల వరకు పులులు తిరుగుతుంటాయి. మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు పిప్పల్‌కోట్, కాగజ్‌నగర్ డివిజన్ అడవుల్లో అనేకసార్లు స్థానికులకు పులులు ఎదురుపడ్డాయి. అడవిలో వన్యప్రాణుల కంటే సులువుగా దొరికే మేతకు వెళ్లిన పశువులు, మేకలు, గొర్రెల పైనే దాడి చేస్తూ ఆకలి తీర్చుకుంటున్నాయి. అలా పశువులు నష్టపోయిన రైతులకు పరిహారం కూడా అటవీ శాఖ చెల్లిస్తోంది. అయితే ఇప్పుడు మనుషులపై దాడి చేయడమే ఆందోళన కలిగిస్తోంది.

పులుల కదలికలు పెరిగిన చోట్ల ప్రజలను అప్రమత్తం చేయండి

క్షేత్రస్థాయి అధికారులకు అటవీశాఖ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పులుల కదలికలు పెరిగి, కొన్నిచోట్ల మనుషులతో ఘర్షణ పూరిత వాతావరణానికి పరిస్థితులు దారితీస్తుండటంతో క్షేత్రస్థాయి అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అటవీశాఖ సూచించింది. ముఖ్యంగా అడవులకు ఆనుకుని ఉన్న గ్రామాలు, పులుల సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లోని ప్రజలు మరింత అప్రమత్తంగా వ్యవహరించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. మంగళవారం కుమురంభీం జిల్లాలో పశువుల కాపరిపై పెద్దపులి దాడి ఘటన, కొల్లాపూర్ సర్కిల్ పరిధిలో మరో పులి కనబడడం, మహారాష్ట్ర- ఆదిలాబాద్ టైగర్ కారిడార్ పరిధిలో పులుల కదలికలు పెరగడం వంటి ఘటనల నేపథ్యంలో ఆయా అంశాలు చర్చకు వచ్చాయి. పులులు లేదా అడవి జంతువుల దాడుల్లో పశువులు, ఇతర ఆస్తులకు నష్టం జరిగితే వెంటనే పరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని శాఖ అధికారులను అటవీశాఖ ఆదేశించింది. ఒకవేళ పులుల దాడిలో మనిషి చనిపోతే రూ. 5 లక్షల పరిహారం, గాయపడితే చికిత్సకు అయ్యే ఖర్చును అటవీశాఖ భరిస్తోంది. బుధవారం అరణ్యభవన్‌లో పీసీసీఎఫ్ ఆర్‌ఎం డోబ్రియాల్ అధ్యక్షతన జరిగిన సమీక్షలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, జోగుళాంబ సర్కిల్‌లో చేపట్టిన, వచ్చే ఏడాది చేపట్టబోయే కార్యకలాపాలపై చర్చించినట్టు తెలిసింది. వచ్చే ఏడాది...అటవీ శాఖ పరంగా అనుసరించాల్సిన ప్రణాళికలు- చేపట్టాల్సిన కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. 2024లో చేపట్టాల్సిన పథకాలు, వాటికయ్యే వ్యయం తదితరాలపై వార్షిక బడ్జెట్‌లో భాగంగా... శాఖకు సంబంధించి అందుబాటులో నిధులు, వాటి వినియోగం వంటి అంశాలపై చర్చించారు.

కోనోకార్పస్.. డేంజరస్

- 15 బల్దియాల్లో ఏపుగా పెరిగిన చెట్లు
- పుప్పొడి రేణువులతో శ్వాసకోశ వ్యాధులు
- పూల వాసనతోనూ ప్రమాదమంటున్న వైద్యులు
- మొక్కలు నాటడడంపై నిషేధం అమలు
- అయినా, నాటిన వాటిని తొలగించని వైనం


రామగుండంలో రాజీవ్ రహదారిపై ఏపుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లు

ఏపుగా, శంఖంలా పెరిగిన విషపు చెట్లు కోనోకార్పస్. రామగుండం కార్పొరేషన్ పరిధిలో భారీగా ఉన్నాయి. హరితహారంలో ప్రభుత్వం అన్నిరకాల మొక్కలు నాటించినా, అందులో సింహభావం వీటివే. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 15 మున్సిపాలిటీల్లోనూ కోనోకార్పస్ మొక్కలు నాటారు. సుందరీకరణ పేరిట జనసంచారం అధికంగా ఉండే, రహదారుల డివైడర్ల మధ్య ఈ మొక్కలు పెంచారు. ప్రస్తుతం ఇవి చెట్లుగా ఎదిగాయి. చలికాలంలో పూసే వీటి పూల ద్వారా అందులోని పుప్పొడి రేణువులు రోడ్డు వెంట వెదజల్లుతున్నాయి. వీటి వాసనతో అలర్జీ, ఆస్తమా బారిన పడడమే కాకుండా ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుందని, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు ప్రబలుతున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు.. బల్దియా అధికారులు కొమ్మలు కత్తిరించకపోవడంతో ఏపుగా పెరుగుతున్నాయి. సీసీ కెమెరాలు, సైన్‌బోర్డులను కప్పేస్తున్నాయి. దారులు, ఎదుటివారు, వాహనాలు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు.

సాక్షి, పెద్దపల్లి: పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లుగా భావిస్తూ ప్రభుత్వం హరితహారం అమలు చేస్తోంది. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా కొనసాగిస్తోంది. ఇందులో వేగంగా పెరిగే లక్షణ ఉండి, పచ్చంగా, అందంగా, శంకుఆకారంలో కనిపించే కోనోకార్పాస్ మొక్కలు ఎంచుకుంది. రోడ్లు అందంగా కనిపిస్తాయనే ఉద్దేశంతో డివైడర్ల మధ్య, ఫుట్‌పాత్‌ల చెంత ఈ మొక్కలు నాటించింది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. బాగా ఎదిగాక ఇవి మానవాళితోపాటు పర్యావరణానికీ ముప్పుగా మారుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్లాంటేషన్ ఆపేశారు.. కానీ, చెట్ల తొలగింపు ఎప్పుడు?

- కోనోకార్పస్‌తో లాభం కన్నా నష్టమే అధికంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.
- ఈ చెట్ల పూల నుంచి పుప్పొడి రేణువులు అధికంగా వస్తాయి.
- ఇవి గాలిలో కలువడం, మనుషులు పీల్చుకుంటే శ్వాసకోశ సమస్యలు ఎదురవడం వంటి దుష్ప్రభావాలు ఎదురవుతున్నాయి.
- ముఖ్యంగా శీతాకాలంలో ఈ సమస్య అధికంగా ఉంటోంది.

ఆ మొక్కలు తొలగించాలి



ప్రమాదకరంగా మారిన కోనోకార్పస్ మొక్కలను ప్రధాన రహదారుల మధ్య నాటించారు. ఇప్పుడవి భారీగా పెరిగాయి. వీటి పుప్పొడి రేణువుల నుంచి వచ్చే వాసనలు ప్రమాదకరమైనవి. కొత్త ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఈ మొక్కలు తొలగించాలి. వాటిస్థానంలో ప్రమాదరహిత మొక్కలు నాటించాలి.

– ఎరుకల ప్రదీప్‌కుమార్, అడ్వకేట్, గోదావరిఖని

- ఇప్పటికే పలుదేశాలే కాదు.. మనదేశంలోని గుజరాత్ రాష్ట్రంలోనూ ఈ మొక్కలను నిషేధించారు.
- తొలుత ఈ మొక్కలను విరివిగా నాటినా.. నష్టాలను గుర్తించిన మన ప్రభుత్వం ప్లాంటేషన్‌ను నిలిపివేసింది.
- కానీ, ఇప్పటికే నాటిన వాటిని తొలగించి, వేరే మొక్కలు నాటడంపై బల్దియాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి.
- చూడ్డానికే కోనోకార్పస్ మొక్కలు అందంగా ఉంటాయని, వీటిపై పక్షులు కూడా వాలవని పట్టణవాసులు అంటున్నారు.
- ఇంతటి ప్రమాదకరమైన కోనోకార్పస్ మొక్కల్ని తొలగించి, వాటిస్థానంలో దేశీయ మర్రి, రావి, వేప, కానుగ వంటి మొక్కలు నాటాలని బల్దియావాసులు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోతోంది.
- కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వీటిపై విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు, ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అలవర్చాలి

- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్
- ముగిసిన జోనల్ స్థాయి సైన్స్‌ఫేర్
- ఆరు అంశాల్లో రాష్ట్రస్థాయికి విద్యార్థుల ఎంపిక
- విజేతలకు బహుమతుల ప్రదానం


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో అదనపు కలెక్టర్ రాహుల్, ఆర్‌సీఓ స్వరూపరాణి

బెల్లంపల్లి: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అలవర్చేలా ఉపాధ్యాయులు బోధన చేసి సమాజ మార్పుకు దోహదపడాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల జూనియర్ కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన జోనల్ స్థాయి సైన్స్‌ఫేర్ బుధవారం అట్టహాసంగా ముగిసింది. ఉత్తమ ప్రదర్శనలను రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపిక చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ బి.రాహుల్ మాట్లాడుతూ తరగతి గదులు విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతాయని అన్నారు. అంధ విశ్వాసాలను సమాజం దూరం పెట్టినప్పుడే మెరుగైన సమాజం ఆవిష్కృతమవుతుందని తెలిపారు. అందుకోసం నేటి విద్యార్థులకు శాస్త్రీయ బోధనలు అవసరమని అన్నారు. విద్యార్థులు ప్రతీ విషయాన్ని ఎందుకు అని తనకు తాను ప్రశ్నించుకుంటూ రోజుకో కొత్త అంశాన్ని నేర్చుకోవడానికి ప్రయత్నించాలని సూచించారు. అనంతరం ప్రదర్శలను తిలకించి ఒక్కో ప్రదర్శనపై విద్యార్థులను అడిగి తెలుసుకుంటూ అవగాహనను పరిశీలించారు. మొత్తం 116 ప్రదర్శనలు రాగా అంశాల వారీగా విద్యార్థులు ఎలా తయారు చేశారో గురుకుల విద్యాలయాల సంస్థ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్సీఓ కొప్పుల స్వరూపరాణి వివరించారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయని అదనపు కలెక్టర్ ప్రశంసించారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

జోనల్‌స్థాయిలో ఉత్తమంగా నిలిచిన ఆరు ప్రదర్శలను రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపిక చేశారు. అంశాల వారీగా ప్రదర్శలను ఎంపిక చేసిన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ప్రథమ శ్రేణిలోని విద్యార్థుల ప్రదర్శలను రాష్ట్ర స్థాయికి పంపించనున్నట్లు ప్రకటించారు. వీరిలో కె.అక్షిత్, డి.మనీష్(సంక్షేమ బాలుర గురుకుల కళాశాల, కాసిపేట), ఐ.తేజ, సాయిరాం(సీఈఓ బాలుర గురుకుల విద్యాలయం, బెల్లంపల్లి), ఎం.అక్షయ, టి.గంగభవానీ(సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, నిజామాబాద్), జె.అంజన్న, జి.డేవిడ్(సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, ఏటూరు నాగారం), ఏ.శివచరణ్, ఎం.సాయికిరణ్(సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, ఆర్మూర్), వి.సుందర్, బి.శివచరణ్(సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, మంచిర్యాల) ఉన్నారు. ముగింపు కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్, కుమురంభీమ్ జిల్లాల కో ఆర్డినేటర్లు ఎస్.శ్రీనివాస్, పి.బాలరాజు, బెల్లంపల్లి బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.స్వరూప, వైస్ ప్రిన్సిపాల్ పి.స్వరూప, బెల్లంపల్లి సీఈఓ బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, రీజియన్ పరిధిలోని సంక్షేమ గురుకులాల ప్రిన్సిపాల్స్ ప్రేమరాణి, జ్యోతి, రమేష్‌బాబు, సంతోష్, శ్రీనాథ్, సంగీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రథమ బహుమతి అందజేస్తున్న అధికారులు

వరల్డ్‌కప్ జట్టులో పోతుగల్ యువకుడు

- అండర్-19 వరల్డ్‌కప్‌లో పాల్గొననున్న అవినాశ్‌రావు
- పోతుగల్‌వాసుల ఆనందం
- దక్షిణాఫ్రికాలో జరుగనున్న పోటీలు
- బ్యాట్స్‌మెన్, కీపర్‌గా భారతజట్టులో స్థానం




తల్లిదండ్రులు లక్ష్మణ్‌రావు, సుష్మలతో అవినాశ్‌రావు

ముస్తాబాద్(సిరిసిల్ల): ఇండియా అండర్–19 వరల్డ్ కప్ జట్టులో రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్‌కు చెందిన క్రికెటర్ ఎరవెల్లి అవినాశ్‌రావు ఎంపికయ్యాడు. హైదరాబాద్ జట్టులో అండర్–14, అండర్–16 స్థాయిలో ఆడిన అవినాశ్‌రావు.. తన ప్రతిభతో అండర్–19 జట్టుకు ఎంపికయ్యాడు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అవినాశ్‌రావు ప్రతిభను గుర్తించి చాలెంజర్స్ టోర్నీకి ఎంపిక చేసింది. అలాగే ఇండియా అండర్–19 'ఏ' జట్టులో అవినాశ్‌రావు బ్యాట్స్‌మెన్, వికెట్ కీపర్‌గా రాణించాడు. అత్యధిక పరుగులు సాధించి భారత సెలెక్టర్ల దృష్టిలో పడ్డాడు. ప్రస్తుతం దుబాయ్‌లో ఆసియాకప్‌లో ఆడుతున్న అవినాశ్‌రావు దక్షిణాఫ్రికాలో డిసెంబర్ 19 నుంచి జరిగే ఇండియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ ట్రై సిరీస్‌కు ఎంపికయ్యాడు. అలాగే జనవరి 19 నుంచి దక్షిణాఫ్రికాలో జరిగే అండర్–19 వరల్డ్ కప్‌కు ఎంపికయ్యాడు. అవినాశ్‌రావు తల్లిదండ్రులు లక్ష్మణ్‌రావు, సుష్మ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న లక్ష్మణ్‌రావు తన కుమారుడు ఇండియా జట్టుకు ఎంపికవడం వెనుక ఉన్న కష్టాన్ని వివరించారు. తొమ్మిదేళ్ల నుంచే క్రికెట్ ప్రాక్టీస్ మొదలుపెట్టినట్లు తెలిపారు. తన కృషితోనే అండర్–19 జట్టుకు ఎంపికయ్యాడని వివరించారు. బ్యాట్స్‌మెన్‌గా, వికెట్ కీపర్‌గా రాణిస్తున్న అవినాశ్‌రావు వరల్డ్ కప్‌కు ఎంపికవడంపై ఎంపీపీ శరత్‌రావు, ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్, సర్పంచ్ తన్నీరు గౌతంరావు, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు డాక్టర్ ఎరవెల్లి చంద్రశేఖర్‌రావు అభినందించారు.

గణితం అధ్యాపకుడిపై విచారణ


మాట్లాడుతున్న డీఐఈవో శంకర్

బెజ్జూర్(సిర్పూర్): నకిలీ సర్టిఫికెట్లతో గణితం లెక్చరర్‌గా పనిచేస్తున్న కలవేని నాగరాజుపై విచారణ చేపట్టినట్లు డీఐఈవో శ్రీధర్ సుమన్ తెలిపారు. బెజ్జూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు కేజీబీవీని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బెజ్జూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నకిలీ పీజీ సర్టిఫికెట్లు సమర్పించి కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తున్న నాగరాజుపై కేసు నమోదైందని పేర్కొన్నారు. విచారణ పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ రాజయ్య తదితరులు ఉన్నారు.

పచ్చళ్ల తయారీపై రైతులకు శిక్షణ


పచ్చడి తయారీని చూపిస్తున్న శాస్త్రవేత్త

బెల్లంపల్లి: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో పచ్చళ్ల తయారీపై గ్రామీణులకు అవగాహన కల్పించారు. రైతులకు చేపలపెంపకం, విలువ ఆధారిత ఉత్పత్తులపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మూడో రోజు బుధవారం పచ్చళ్ల తయారీ, నిల్వ విధానాలపై అవగాహన కల్పించారు. నేషనల్ ఫిషరీ డెవలప్‌మెంట్ బోర్డు సౌజన్యంతో శిక్షణ కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ పర్యవేక్షణలో మత్స్య విభాగ శాస్త్రవేత్త మహేష్‌కుమార్ రొయ్యల పచ్చడిని తయారు చేసి చూపించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాట్లాడుతూ గ్రామీణులు వ్యవసాయంపైనే ఆధారపడకుండా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చేపలు, రొయ్యల పెంపకంపై దృష్టి సారించి వ్యవసాయాన్ని లాభసాటిగా మలుచుకోవాలని కోరారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి వీలు ఉంటుందన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు తిరుపతి, సతీష్, శిక్షణ రైతులు పాల్గొన్నారు.

22న భారత్ బంద్‌కు పిలుపు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఈ నెల 22న భారత్ బంద్‌లో పాల్గొని తెలంగాణలో విజయవంతం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు పార్టీ) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ బుధవారం పత్రిక కార్యాలయాలకు విడుదల చేసిన లేఖలో పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా మావోయిస్టు ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రజా ఉద్యమాలను అణచి వేయడానికి కేంద్ర, రాష్ట్ర సాయుధ పోలీస్ బలగాలను పెద్దయెత్తున మోహరించి దాడులు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ దాడులను ఎదుర్కొంటూ ప్రజల, ప్రజా ఉద్యమాల రక్షణలో నిమగ్నమైన పీఎల్‌జీఏ, విప్లవ ప్రజా సంఘాలు అభినందనీయమని ప్రకటనలో పేర్కొన్నారు.

పర్యావరణం



శిలాజ ఇంధనాలను అంతం చేయండి... భవిష్యత్తును, భూగోళాన్ని కాపాడండి.
- లిసిప్రియ

నిండు సభలో...
నిగ్గదీసి అడిగిన అగ్నిస్వరం

వాన కురిస్తే, హరివిల్లు విరిస్తే మురిసే చిన్నారి హృదయాలకు ప్రకృతి ఆత్మీయ నేస్తం. అలాంటి అందమైన, ఆత్మీయమైన ప్రకృతి ఎదుట విలయ విధ్వంసం కరాళనృత్యం చేస్తుంటే... లిసిప్రియలాంటి చిన్నారులు 'పాపం, పుణ్యం ప్రపంచ మార్గం' అని ఊరుకోరు. ప్రకృతికి సంబంధించి మనం చేస్తున్న పాపం ఏదో, పుణ్యం ఏదో కళ్లకు కట్టేలా ప్రచారం చేస్తారు. దుబాయ్‌లో జరిగిన 'యునైటెడ్ నేషన్స్ క్లైమెట్ చేంజ్ కాన్ఫరెన్స్-2023'లో తన నిరసనను బహిరంగంగా తెలియజేసింది మన దేశానికి చెందిన పన్నెండు సంవత్సరాల లిసిప్రియ కంగుజామ్. 'శిలాజ ఇంధనాలను అంతం చేయండి... భవిష్యత్తును, భూగోళాన్ని కాపాడండి' అంటూ నినదించింది. కొద్దిసేపు ప్రసంగించింది. ఆమె నిరసనను ప్రపంచ ప్రతినిధులు కొందరు చప్పట్లతో ఆమోదం పలికారు. ప్రపంచ దృష్టిని ఆకర్షించిన మణిపుర్‌కు చెందిన క్లైమెట్ యాక్టివిస్ట్ లిసిప్రియ గురించి....

లిసిప్రియ కంగ్‌జామ్ మణిపుర్‌లోని బషిక్‌హోంగ్‌లో జన్మించింది. తల్లిదండ్రుల ద్వారా, స్కూల్లో ఉపాధ్యాయుల ద్వారా విన్న పర్యావరణపాఠాలు ఈ చిన్నారి మనసుపై బలమైన ప్రభావాన్ని చూపాయి. పర్యావరణ సంరక్షణ కోసం తన వంతుగా ఏదైనా చేయాలనుకుంది. ఏడు సంవత్సరాల వయసులోనే అందరూ ఆశ్చర్యపడేలా పర్యావరణ సంబంధిత విషయాలు మాట్లాడేది.

నా నేరం ఏమిటి?

నిరసన తరువాత అధికారులు నన్ను 30 నిమిషాలకు పైగా నిర్బంధించారు. నేను చేసిన నేరం ఏమిటంటే పర్యావరణ సంక్షోభానికి ప్రధాన కారణం అయిన శిలాజ ఇంధనాలను దశల వారీగా తొలగించమని అడగడం. నన్ను 'కాప్ 28'లో లేకుండా చేశారు.

– లిసిప్రియ, యాక్టివిస్ట్

యాక్ట్ నౌ

దుబాయ్‌లో జరిగిన క్లైమేట్ కాన్ఫరెన్స్-2023లో 190 దేశాల నుంచి 60,000 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. చిన్నారి ప్రియ ధైర్యంగా వేదిక మీదికి వచ్చి 'అవర్ లీడర్స్ లై. పీపుల్ డై' అని గట్టిగా అరిచింది. సదస్సు ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆ తరువాత ప్రేక్షకుల నుంచి ప్రశంసలు లభించాయి.

'ఎవరు ఈ అమ్మాయి?' అంటూ చాలామంది ఆరా తీశారు. చిన్న వయసు నుంచే పర్యావరణ ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహిస్తున్న ప్రియ గురించి తెలుసుకొని ఆశ్చర్యానందాలకు గురయ్యారు.

2018లో ప్రకృతి విధ్వంసంపై మంగోలియాలో ఐక్యరాజ్య సమితి నిర్వహించిన సదస్సులో తండ్రితో కలిసి పాల్గొంది. ఈ సదస్సులో వక్తల ఉపన్యాసాల నుంచి ఎన్నో కొత్తవిషయాలు నేర్చుకుంది.

ఈ సదస్సు ప్రియ జీవితాన్ని మార్చేసిన సదస్సు అని చెప్పవచ్చు.

ఈ సదస్సు స్ఫూర్తితో 'చైల్డ్ మూమెంట్' అనే సంస్థను మొదలుపెట్టింది. మొక్కల పెంపకం వల్ల ప్రకృతికి జరిగే మేలు, ప్రకృతి విధ్వంసం వల్ల జరిగే నష్టాలు... మొదలైన వాటి గురించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎన్నో స్కూల్స్‌లో ప్రచారకార్యక్రమాలు విరివిగా నిర్వహించింది.

2019లో స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో జరిగిన యునైటెడ్ నేషన్స్ క్లైమేట్ ఛేంజ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొంది. ఇదే సంవత్సరం అంగోలా దేశంలో జరిగిన ఆఫ్రికన్ యూనియన్ సదస్సులో పాల్గొంది. ఈ సదస్సులో ఎంతోమంది దేశాధ్యక్షులతో పాటు ప్రియ ప్రసంగించడం విశేషం.

చిన్నవయసులోనే ఎన్విరాన్‌మెంటల్ యాక్టివిస్ట్‌గా ప్రపంచవ్యాప్తంగా పెద్ద పేరు తెచ్చుకుంది లిసిప్రియ.

ప్రియకు డబ్బులను పొదుపు చేయడం అలవాటు. అవి తన భవిష్యత్ అవసరాలకు ఉద్దేశించి కాదు. సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించడం కోసం పొదుపు చేస్తుంటుంది. 2018లో కేరళ వరద బాధితులకు సహాయంగా ముఖ్యమంత్రి సహాయనిధికి లక్షరూపాయలు విరాళంగా ఇచ్చింది. ఢిల్లీలోని వాయు కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని 'సర్వైవల్ కిట్ ఫర్ ది ఫ్యూచర్' అనే డివైజ్‌కు రూపకల్పన చేసింది. ఈ జీరో బడ్జెట్ కిట్ వాయుకాలుష్యాన్ని తగ్గిస్తుంది. ఎవరైనా, ఎక్కడైనా సులభంగా తయారు చేసుకోవచ్చు. ఈ పరికరాన్ని పంజాబ్ అసెంబ్లీలో లాంచ్ చేసింది ప్రియ. వాతావరణ మార్పులపై కార్యచరణ కోసం, మన దేశంలో క్లైమెట్ లా కోసం వందలాదిమందితో కలిసి ఢిల్లీలోని ఇండియా గేట్ దగ్గర ప్రదర్శన నిర్వహించింది.

'సందేశం ఇవ్వాలనుకోవడం లేదు. సమస్యను అర్థం చేసుకోమని చేతులు జోడించి వినమ్రంగా వేడుకుంటున్నాను' అంటుంది లిసిప్రియ.

న్యూస్‌మేకర్ ఆషిక్



కుమారునికి వంట నేర్పితే?

ఏమవుతుంది?

బహుశా 'మాస్టర్ చెఫ్' విజేతగా 25 లక్షలు ఇంటికి తీసుకొస్తాడు. అబ్బాయిలు వంట గదిలోకి వస్తే 'ఏంట్రా ఆడపిల్లలాగా' అని మందలిస్తారు. కాని వంట స్త్రీలకూ, పురుషులకూ రావాలి. పిల్లలు ఎంత బాగా చదువుకున్నా వారికి కొద్దో గొప్పో వంట తెలిసుండాలి. 'మాస్టర్ చెఫ్' తాజా విజేత ఆషిక్ మా అమ్మ నేర్పిన వంట వల్లే గెలిచాను అన్నాడు. మంగళూరులో చిన్న జ్యూస్ షాప్ నడుపుకునే ఆషిక్ ఇంత పెద్ద గెలుపుతో ప్రపంచాన్ని ఆకర్షించాడు.

'సోనీ లివ్' చానల్ వారి ప్రఖ్యాత రియాలిటీ షో 'మాస్టర్ షెఫ్' సీజన్ 8 ఆడిషన్స్ రౌండ్‌లో ఆషిక్ చేసిన మంగళూరు స్టయిల్ ఫిష్ ఫ్రైను జడ్జీలు వెంటనే ఓకే చేయలేదు. 'కొంత బాగుంది కొంత బాగలేదు. మళ్లీ చెప్తాం' అన్నారు. కాని ఆ తర్వాత ఆషిక్‌కు అవకాశం ఇచ్చారు. అప్పటినుంచి అంటే అక్టోబర్ 18 నుంచి డిసెంబర్ 8 ఫైనల్స్ వరకూ ఆషిక్ చేసిన వంటకాల ప్రయాణం ఉద్వేగభరితంగానే సాగింది. ఎందుకంటే అతడు వంటను శాస్త్రోక్తంగా నేర్చుకోలేదు. అమ్మ దగ్గర ఇంట్లో వంటగదిలో నేర్చుకున్నాడు.

24 ఏళ్ల కుర్రాడు

మంగళూరుకు చెందిన ఆషిక్ వయసు 24 ఏళ్లు. దిగువ మధ్య తరగతి కుటుంబం. ఇంటర్ తర్వాత హోటల్ మేనేజ్‌మెంట్ చేద్దామనుకున్నాడు. కాని ఫీజు కట్టే పరిస్థితి లేక కట్టలేదు. ఏం చేయాలి. వంట బాగా వచ్చు. యూ ట్యూబ్‌లో చూసి రకరకాల వంటకాలు చేయడం నేర్చుకున్నాడు. దానికి కారణం చిన్నప్పటి నుంచి అతని ఆటలన్నీ వంట గదిలోనే సాగేవి. నానమ్మ వంట చేస్తుంటే అక్కడే కూచుని చెంబులు తప్పేళాలతో ఆడుకునేవాడు. అమ్మ హయాం వచ్చేసరికి వంటలో సాయం పట్టడం మొదలెట్టాడు. తల్లి – 'ఏమిటీ ఆడంగి పనులు' అని తిట్టకుండా కొడుకును ప్రోత్సహించింది. ఇంటికి ఎవరొచ్చినా ఆషిక్ వంట చేసే పద్ధతి చూసి ఆశ్చర్యపోయేవారు. ఆ ఆత్మవిశ్వాసంతో మంగళూరులో 'కులుక్కి' పేరుతో చిన్న జ్యూస్ షాప్ పెట్టాడు ఆషిక్. అయితే అది సగటు జ్యూస్‌షాప్ కాదు. ఆషిక్ కనిపెట్టిన రకరకాల ఫ్లేవర్లు, మిక్స్‌డ్ కాంబినేషన్లు అందులో దొరుకుతాయి. జనం బాగా కనెక్ట్ అయ్యారు. అతని జ్యూస్ షాప్ మంచి హిట్. కాని ఇంకా జీవితంలో సాధించాలి అంటే ఏదైనా పెద్దగా చేయాలనుకున్నాడు ఆషిక్. 'మాస్టర్ షెఫ్' అందుకు వేదికగా నిలిచింది.

విఫలమైనా ముందుకే

2022 మాస్టర్ షెఫ్ ఆడిషన్స్‌కు వచ్చిన ఆషిక్ రిజెక్ట్ అయ్యాడు. 'చాలా డిప్రెషన్‌లోకి వెళ్లాను. మళ్లీ ఏమీ వండలేననే అనుకున్నాను. కాని సాధించాలి... మనసుపెట్టి పోరాడాలి అని నిశ్చయించుకున్నాను. 2023 ఆడిషన్స్ వచ్చేవేళకు చాలా కష్టపడి తర్ఫీదు అయ్యాను సొంతగా. షో ముందుకు వెళ్లేకొద్దీ సవాళ్లు ఎదురైనా ఛేదిస్తూ విజేతగా నిలిచాను' అన్నాడు ఆషిక్.



తల్లితో ఆషిక్

ఫైనల్స్ ఎపిసోడ్‌లో ఆషిక్ తల్లిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఆమె సమక్షంలోనే ఆషిక్‌ను విజేతగా ప్రకటించారు. కొడుకు విజేత అవుతాడో లేదోనని ఆమె ఉత్కంఠగా ఎదురు చూసింది. ఆపై కొడుకు విజయానికి పులకించిపోయింది.

కాగా ఈ సీజన్‌లో మేఘాలయాకు చెందిన స్కూల్ ప్రిన్సిపల్ నంబి మొదటి రన్నర్ అప్‌గా, జమ్ము-కశ్మీర్‌కు చెందిన రుక్సర్ అనే ఫుడ్ టెక్నిషియన్ సెకండ్ రన్నర్ అప్‌గా నిలిచారు. ప్రసిద్ధ షెఫ్‌లు వికాస్ ఖన్నా, రణ్‌వీర్ బ్రార్, గరిమా అరోర జడ్జీలుగా వ్యవహరించారు. రొయ్యలతో ఆషిక్ చేసిన 'క్రిస్పీ ప్యారడైజ్' అనే వంటకాన్ని రుచి చూసిన జడ్జ్ రణ్‌వీర్ బ్రార్ తన సంతకం కలిగిన కిచెన్ నైఫ్ బహూకరించడం విశేషం.

హోటల్ రంగంలోగాని, స్వయం ఉపాధికిగాని పాకశాస్త్రం నేడు చాలా అవసరంగా ఉంది. మంచి షెఫ్‌లకు చాలా డిమాండ్ ఉంది. అదెలా ఉన్నా తెల్లారి లేస్తే మూడుపూట్లా తినాలి కనుక, వంట కేవలం ఆడవారి వ్యవహారం అనే భావన పోయి, ఇకమీదైనా అబ్బాయిలకు తల్లులు కనీసం అవసరమైనంత వంట నేర్పడం మంచిది. ఏమో... వారు ఇంకా బాగా నేర్చుకుంటే మరో మాస్టర్ షెఫ్ అవుతారేమో. ఏ ప్లేట్‌కు ఏ పదార్థం రాసి పెట్టుందో ఎవరు (రుచి) చూసొచ్చారు కనుక.

కిచెన్‌టిప్స్

కరకరలాడాలంటే...

బిస్కెట్లు మెత్తగా అవ్వకుండా కరకరలాడాలంటే ఇలా చేసిచూడండి...

- ప్లాస్టిక్, అల్యూమినియం డబ్బాలు, గాజు పాత్రల్లో బిస్కెట్లు, కుకీలను నిల్వచేయాలి. గాలి చొరబడకుండా పెడితే ఎక్కువరోజులపాటు క్రిస్పీగా ఉంటాయి.
- డబ్బాల్లో నిల్వచేసేటప్పుడు అడుగు భాగంలో రెండు మూడు వరుసల్లో టిష్యూపేపర్లు వేసి తరువాత బిస్కెట్లు పెట్టాలి. బిస్కెట్లపైన మరో రెండు వరుసల్లో టిష్యూపేపర్లు వేసి పైన బిస్కెట్లు పెట్టాలి. ఇలా నిండుగా పెట్టి గాలిచొరబడకుండా మూత పెట్టాలి.
- జిప్‌లాక్ పౌచ్‌లలో నిల్వచేస్తే కూడా కుకీలు తాజాగా ఉంటాయి.
- గాలి చొరబడని డబ్బాలు, జిప్‌లాక్ పౌచ్‌లను రిఫ్రిజిరేటర్‌లో పెడితే మరిన్ని రోజులు బిస్కెట్లు తాజాగా ఉంటాయి.
- అనుకోకుండా సరిగా నిల్వచేయనప్పుడు మెత్తబడిన కుకీలను అవెన్ లేదా ఎయిర్‌ఫ్రైయర్‌లో ఉంచి వేడి చేస్తే మళ్లీ క్రిస్పీగా మారతాయి. వీటిని కూడా నిల్వచేసుకోవచ్చు.



బ్యూటిప్స్ హెయిర్ కేర్

జుట్టుకు బలాన్నిచ్చే టానిక్

బీట్‌రూట్ ఒకటి తీసుకుని చెక్కు తీసి ముక్కలుగా తరగాలి. రెండు ఉసిరి కాయలను గింజలు తీసేసి ముక్కలుగా కోయాలి. వీటికి పన్నెండు రెమ్మల కరివేపాకు, గ్లాసు నీళ్లు కలపాలి. ఈ మిశ్రమాన్ని పదినిమిషాల పాటు మీడియం మంట మీద మరిగించాలి. చక్కగా మరిగాక దించేసి చల్లారిన తరువాత ఈ రసాన్ని వడగట్టి సీసాలో నిల్వచేసుకోవాలి. ఈ టానిక్‌ను వారానికి రెండు మూడుసార్లు కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించాలి. రెండు గంటల తరువాత సాధారణ షాంపుతో కడిగేయాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే కుదుళ్లకు పోషకాలు అందుతాయి. రక్తప్రసరణ చక్కగా జరిగి జుట్టు ఊడడం తగ్గుతుంది. చివర్లు చిట్లకుండా చక్కగా పెరుగుతాయి.



జెల్ మెరుపులు

టేబుల్ స్పూను పంచదార పొడిలో స్పూను వేడి నీళ్లు పోసి కలపాలి. దీన్లో రెండు టీస్పూన్ల పచ్చి పాలు, స్పూను అలోవెరా జెల్ వేసి కలపాలి. శుభ్రంగా కడిగిన ముఖానికి ఈ మిశ్రమాన్ని రాసి మర్దన చేయాలి. పదినిమిషాలపాటు ఆరనిచ్చి కడిగేయాలి. వారానికి మూడు సార్లు ఈ ప్యాక్ వేయడం వల్ల చర్మానికి తేమ అంది, మృదువుగా నిగారింపుతో కనిపిస్తుంది.



- మరుగుతున్న రెండు గ్లాసుల నీటిలో మూడు టేబుల్ స్పూన్ల టీపొడి, పది గులాబీ పువ్వులు వేసి పదినిమిషాలపాటు మరిగించాలి. ఇది చల్లారిన తర్వాత వడగట్టి ఒక సీసాలో పోయాలి. తలస్నానం చేసిన జుట్టుకు ఈ డికాషన్‌ను పట్టించి, టవల్ చుట్టుకోవాలి. నీటితో కడగకూడదు. ఇది కండీషనర్‌లా పనిచేసి జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.

హెల్త్‌కేర్ ఇండస్ట్రీలో మహిళలు తక్కువ ఆదాయాలను పొందే ఫ్రంట్‌లైన్ పాత్రలలోనే కనిపిస్తున్నారు అని దస్రా ఆర్గనైజేషన్ ఒక డేటా విడుదల చేసింది. మహిళలు వైద్యవిద్యలలో 29 శాతం ఉంటే, నర్సింగ్ సిబ్బందిలో 80 శాతం ఉన్నారు. ఇక 100 శాతం ఆశావర్కర్లుగా ఉన్నారు. ఆరోగ్య సంరక్షణలో నాయకత్వ స్థానాల్లో కేవలం 18 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. ఈ రంగంలో పురుషుల కంటే 34 శాతం స్త్రీలు తక్కువ సంపాదిస్తున్నారు.

* హెల్త్ కేర్ నివేదిక



'రోల్' లేదు 'మోడల్' లేదు!

హెల్త్‌కేర్‌లో మహిళలు ఫ్రంట్‌లైన్‌కే పరిమితం

ఫ్రంట్‌లైన్ పాత్రలలోనే..

భారతదేశంలో ప్రధానమైన హెల్త్‌కేర్ రంగం కొన్ని సంవత్సరాలుగా సాంకేతికత, నైపుణ్యాలు, విద్య, వృత్తిపరంగా గణనీయమైన అభివృద్ధి, విస్తరణను చవిచూసింది. అయినప్పటికీ ఆరోగ్య సంరక్షణ రంగంలో మహిళలు తక్కువ ఆదాయాలను పొందే ఫ్రంట్‌లైన్ పాత్రలలో కనిపిస్తున్నారని దస్రా నివేదిక సూచిస్తుంది. దస్రా డైరెక్టర్ శైలజా మెహతా మాట్లాడుతూ 'ఆరోగ్య సంరక్షణ రంగంలో మహిళల నాయకత్వంలో మార్పు తీసుకురావడం చాలా అవసరం. ఎందుకంటే, ఇతర రంగాలను కూడా హెల్త్‌కేర్ ప్రభావితం చేయడమే కారణం. లింగ సమానత్వం విషయంలో మా పనిలో మేం మహిళల పురోగతికి సంబంధించిన గ్యాప్‌పై దృష్టి పెట్టాలనుకున్నాం' అని తెలిపారు.

అతి తక్కువ శాతం

నివేదిక ఫలితాల ప్రకారం మొత్తం హెల్త్‌కేర్ వర్క్ ఫోర్స్‌లో 54 శాతం ఉన్న ప్రైవేట్ హాస్పిటల్ సెక్టార్‌లో మహిళలు దాదాపు 25 నుంచి 30 శాతం నాయకత్వ స్థానాలను ఆక్రమించారు. ఫార్మాస్యూటికల్, బయోటెక్ రంగాలలో 5 నుంచి 10 శాతం మాత్రమే నాయకత్వపాత్రల్లో మహిళలు ఉన్నారు. మార్కెటింగ్ కార్యకలాపాల స్థానాల్లో కూడా మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. ప్రవేశ స్థాయి స్థానాల్లో మహిళలు 40 నుంచి 50 శాతం ఉండగా, సీనియర్ పాత్రలలో ఈ శాతం గణనీయంగా 15 నుంచి 20 శాతానికి పడిపోయింది.

పరిమిత ప్రాధాన్యం

మహిళలు ఆర్ అండ్ డి, నర్సింగ్, హెచ్ఆర్, పరిపాలన, నాణ్యత హామీ, చట్టపరమైన, నియంత్రణ వ్యవహారాలు వంటి విధుల్లో బాగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇవి పరిమిత ప్రభావాన్ని కలిగి ఉంటాయి. ముఖ్యంగా ఎంట్రీ లెవల్ హెచ్ఆర్ పాత్రల కోసం మహిళలకు ప్రాధాన్యత ఉంటుంది. దీని ఫలితంగా గణనీయంగా 70-80 శాతం ప్రాతినిధ్యం ఉంది. ఇదే నాయకత్వ స్థానాల్లో 20 నుంచి 30 శాతానికి పడిపోతుంది. నివేదిక ఫలితాలు, రోగుల సేవా బృందాలు, ఎఫ్ అండ్ బి మొదలైన వాటిలో ఇదే విధమైన నమూనాను గమనించాయి. ప్రవేశ స్థాయులలో 40 నుంచి 60 శాతం మహిళలను ప్రాధాన్యంగా నియమించుకుంటారు. అయితే సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ స్థాయులకు వారి పురోగతి పరిమితంగా ఉంది. ఇది 15 నుంచి 20 శాతానికి మాత్రమే చేరుకుంది.

రోల్ మోడల్స్ లేకపోవడమే..

లీడర్‌షిప్ క్వాలిటీ పెంపొందించుకోవడానికి మహిళలకు ప్రధాన అవరోధం రోల్ మోడల్స్ లేకపోవడమే. మహిళల పనిని తక్కువ అంచనా వేయడం, అంతర్గత పక్షపాతాలు, లింగ సమానత్వం, వైవిధ్యం గురించి నమ్మదగిన సాంస్కృతిక కథనం లేకపోవడం అని నివేదిక హైలైట్ చేసింది. శైలజా మెహతా మరిన్ని వివరాలు చెబుతూ 'అడ్డంకులు చాలా రెట్లు ఉన్నాయి. మహిళలు నిజంగా ప్రభావవంతంగా ఉన్నారా.. మంచి నాయకులు కాదా... అని ప్రశ్నించే మూస పద్ధతి కూడా ఒక కారణంగా ఉంది. మహిళల నాయకత్వానికి వ్యతిరేకంగా ప్రతికూల పక్షపాతాలు, నిబంధనలు, ప్రవర్తనలు, ఊహాజనితాలు ఎన్నో ఉన్నాయి. వీటిని వదులుకోవడం అంత సులభం కాదు. సంస్థలు మెరుగైన వ్యాపారం కోసం ఆలోచిస్తాయే తప్ప మహిళా ఉన్నతిని పెద్దగా పట్టించుకోవు. హెల్త్‌కేర్ రంగంలో మహిళలు లీడర్‌షిప్ స్థాయిలో ప్రాతినిధ్యం వహించడానికి చాలా కష్టపడాల్సి ఉంటుంది. భారతదేశంలో చాలా మంది మహిళలకు వారి ఆకాంక్షలకు కఠినమైన అడ్డంకులు ఉంటాయి. మహిళల లక్ష్యం నర్సు కావడమే అన్నట్టుగా ఉంటుంది. మేనేజర్‌గా లేదా సీఇవోగా ఉండటానికి వారికి అవకాశం ఇవ్వరు.

'మహిళలు తమ పరిమితులను దాటి, విస్తరించాలి. అడ్డుగోడలను, నిబంధనలను తొలగించుకుంటూ తమను తాము ప్రోత్సహించుకుంటూ ముందడుగు వేయాలి. అప్పుడే భవిష్యత్తు తరాలకు రోల్‌మోడల్స్‌గా నిలుస్తారు' అని చెబుతున్న దస్రా నివేదిక మనందరినీ ఆలోచింపజేస్తుంది.

లాభాపేక్ష లేకుండా, అన్ని రంగాలలో సామాజిక మార్పునకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థ దస్రా. ఈ సంస్థ హెల్త్ కేర్ రంగంపై దృష్టి పెట్టి, ఓ నివేదికను రూపొందించింది. ఈ నివేదికలో పొందుపర్చిన విషయాలలో ముఖ్యంగా గమనించాల్సింది మహిళలకు రోల్‌మోడల్స్ లేకపోవడం, వారి పనిని తక్కువ అంచనా వేయడం, అంతర్గత పక్షపాతాలు, లింగ సమానత్వం గురించి సరైన అవగాహన లేకపోవడం అని పేర్కొంది.



'అర్జున' రేసులో మొహమ్మద్ షమీ

న్యూఢిల్లీ: భారత పేస్ బౌలర్ మొహమ్మద్ షమీకి జాతీయ క్రీడా పురస్కారం 'అర్జున' అవార్డు దక్కే అవకాశం ఉంది. ఈ మేరకు అతని పేరును అవార్డు కోసం బీసీసీఐ సిఫారసు చేసింది. ఇటీవలి వన్డే ప్రపంచకప్‌లో షమీ 24 వికెట్లతో చెలరేగాడు. ముందుగా నామినేట్ చేసిన జాబితాలో షమీ పేరు లేకపోయినా...బీసీసీఐ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేయడంతో అతని పేరును చేర్చారు. భారత బ్యాడ్మింటన్ డబుల్స్ జంట సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి కూడా ప్రతిష్టాత్మక 'ఖేల్‌రత్న' అవార్డు కోసం రేసులో నిలిచారు. షమీ కాకుండా మరో 16 మంది ఆటగాళ్లు అర్జున అవార్డు కోసం పోటీ పడుతున్నారు. ఇందులో తెలంగాణ బాక్సర్ మొహమ్మద్ హుసాముద్దీన్, తమిళనాడు చెస్ ప్లేయర్ వైశాలి తదితరులు ఉన్నారు.

మహిళల 'టెస్టు'కు సిద్ధం



హర్మన్

హీతర్ నైట్

నేటినుంచి భారత్, ఇంగ్లండ్ సమరం
ఆత్మవిశ్వాసంతో హర్మన్ సేన
ఇంగ్లండ్‌కు 100వ టెస్టు మ్యాచ్
ఉ.గం.9.30నుంచి స్పోర్ట్స్–18లో ప్రత్యక్ష ప్రసారం

ముంబై: రెండేళ్ల విరామం తర్వాత భారత మహిళల క్రికెట్ జట్టు టెస్టు మ్యాచ్ బరిలోకి దిగుతోంది. టి20 సిరీస్ తర్వాత ఇంగ్లండ్‌తో నేటినుంచి జరిగే ఏకైక టెస్టు (నాలుగు రోజుల మ్యాచ్)లో భారత్ తలపడుతుంది. వన్డేలు, టి20లను పక్కన పెడితే టెస్టుల్లో భారత జట్టు ప్రత్యర్థితో పోలిస్తే అనుభవం, ఫలితాలపరంగా చాలా వెనుకబడి ఉంది. మన అమ్మాయిలకు ఎప్పుడో గానీ టెస్టులు ఆడే అవకాశం రాదు. ఓవరాల్‌గా భారత్ ఇప్పటి వరకు 38 టెస్టులు మాత్రమే ఆడగా...99 మ్యాచ్‌లు ఆడిన ఇంగ్లండ్ ఇప్పుడు 100వ మ్యాచ్‌కు సిద్ధమైంది. 2014 తర్వాత భారత్‌లో మహిళల టెస్టు జరగడం ఇదే మొదటిసారి కావడం విశేషం. భారత మహిళల క్రికెట్ దిగ్గజాలు మిథాలీరాజ్, జులన్ గోస్వామిల రిటైర్మెంట్ తర్వాత జట్టు ఆడుతున్న మొదటి టెస్టు ఇదే కానుంది. ఈ నేపథ్యంలో టెస్టు అనుభవంపై ఇంగ్లండ్ ఆధారపడుతుండగా... సొంతగడ్డపై ఆడుతున్న అనుకూలతను హర్మన్ సేన నమ్ముకుంది. 2021 సెప్టెంబర్‌లో ఆఖరి సారిగా టెస్టు ఆడిన భారత్ ఆసీస్‌తో జరిగిన ఆ మ్యాచ్‌ను 'డ్రా'గా ముగించగలిగింది.

ఇంగ్లండ్ సమష్టిగా...

దేశవాళీలో నాలుగు రోజుల మ్యాచ్‌లు ఎక్కువగా ఆడటం పాటు 'యాషెస్' కారణంగా కూడా ఇంగ్లండ్ టీమ్ తరచుగా టెస్టు మ్యాచ్‌ల బరిలోకి దిగుతూ వస్తోంది. ఇప్పుడు కూడా ఆ జట్టు ఈ ఫార్మాట్‌లో తమ బలాన్నే నమ్ముకుంది. జట్టులో ఎక్కువ మంది సభ్యులకు టెస్టు అనుభవం ఉంది. కెప్టెన్ హీతర్ నైట్‌తో పాటు బీమాంట్, సివర్ బ్రంట్ కీలక బ్యాటర్లు కాగా...మిడిలార్డర్‌లో క్యాప్సీ, డాని వాట్ ప్రభావం చూపించగలరు. బీమాంట్‌తో పాటు రెండో ఓపెనర్‌గా డంక్లీ బరిలోకి దిగవచ్చు. కీపర్ ఎమీ జోన్స్ ధాటిగా ఆడగలదు. స్పిన్నర్ సోఫీ ఎకెల్‌స్టోన్ ఇంగ్లండ్‌కు బౌలింగ్‌లో ప్రధాన బలం. ఇతర బౌలర్లు క్రాస్, బెల్, డీన్ భారత పిచ్‌పై ఏమాత్రం ప్రభావం చూపించగలరో చెప్పలేం. ఇంగ్లండ్ జట్టు భారత గడ్డపై 2005 తర్వాత టెస్టు మ్యాచ్ ఆడటం ఇదే మొదటిసారి.

వారిద్దరే కీలకం...

భారత జట్టులో భారత కెప్టెన్‌కు 3 టెస్టుల, స్టార్ బ్యాటర్ స్మృతి మంధానకు 4 టెస్టుల అనుభవం మాత్రమే ఉండగా...మిగతా జట్టు సభ్యులకు ఆమాత్రం అనుభవం కూడా లేదు. వన్డేలు, టి20లతో పోలిస్తే క్రీజ్‌లో నిలవడంలో వీరు ఏమాత్రం పట్టుదల కనబరుస్తారనేది ఆసక్తికరం. అందుకే జట్టు విజయావకాశాలు ప్రధానంగా హర్మన్, స్మృతిలపైనే ఆధారపడి ఉన్నాయి. షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్ తమ బ్యాటింగ్ బలాన్ని ప్రదర్శించాల్సి ఉంది. ముఖ్యంగా పరిమిత ఓవర్ల క్రికెట్‌లో దూకుడుకు మారుపేరైన షఫాలీ ఇక్కడ కాస్త ఓపికను చూపించి ఆడితే భారీ స్కోరుకు అవకాశం ఉంటుంది. రోడ్రిగ్స్ కూడా టెస్టుకు తగినట్లుగా తన ఆటతీరును మార్చుకోగలదని టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. అనుభవజ్ఞులైన స్పిన్నర్లు స్నేహ్ రాణా, రాజేశ్వరి గైక్వాడ్ టెస్టులో ఎలాంటి ప్రభావం చూపిస్తారనేది చూడాలి. వీరితో పాటు దీప్తి శర్మ కూడా స్పిన్‌తో రాణించగలదు. భారత్ ఆడిన గత రెండు టెస్టులు కూడా విదేశీ గడ్డపైనే జరిగాయి. ఆ రెండు మ్యాచ్‌లలో జట్టు ముగ్గురు పేసర్లతో బరిలోకి దిగింది. అలా చూస్తే రేణుకా సింగ్, మేఘనా సింగ్‌లతో పాటు పూజ వస్త్రకర్‌కు అవకాశం ఉంటుంది. ఇద్దరు పేసర్లకే పరిమితమైతే మాత్రం పూజను పక్కన పెట్టి అదనపు బ్యాటర్‌గా రిచా ఘోష్‌ను తీసుకోవచ్చు.



సమం కోసం భారత్ సమరం

దక్షిణాఫ్రికాతో నేడు ఆఖరి టి20 ● జోరుమీదున్న సఫారీ
ఆల్‌రౌండ్ ప్రదర్శనపై సూర్య సేన దృష్టి ● రా.గం. 8.30 నుంచి 'స్టార్‌స్పోర్ట్స్-1'లో ప్రసారం

జొహన్నెస్‌బర్గ్: ఒకటి వాన ఖాతాలో... మరొకటి ఆతిథ్య ఖాతాలో పడిపోయాయి. ఇప్పుడు భారత్ ఖాతా తెరవాల్సిన సమయం వచ్చింది. దక్షిణాఫ్రికాతో ఆఖరి పోరులో టీమిండియా గెలిస్తేనే మూడు టి20ల సిరీస్‌ను 1-1తో సమం చేయగలదు. లేదంటే సిరీస్ చేజారుతుంది. ఈ నేపథ్యంలో ఆఖరి సమరం యువ భారత్ సత్తాకు పరీక్ష పెడుతోంది. గురువారం జరిగే మ్యాచ్‌లో సూర్యకుమార్ సేన గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. నిజానికి గత మ్యాచ్‌లో భారత్ చేసిన స్కోరు తక్కువేం కాదు. కానీ వాన ప్రతాపం, మంచ్ ప్రభావంతో బౌలర్లు కట్టు తప్పారు. ఇదే అదనుగా దక్షిణాఫ్రికా బ్యాటర్లు చెలరేగారు. ఇప్పుడు 'సీన్' అర్థమైన 'సూర్య అండ్ కో' తప్పకుండా సరైన ఎత్తుగడతోనే బరిలోకి దిగడం ఖాయం. ఇదే జరిగితే సిరీస్ చేతికి అందకపోయినా... చేజారడం మాత్రం జరగదు.

ఓపెనర్లు చెలరేగితే...

ఆస్ట్రేలియాతో సొంతగడ్డపై జరిగిన ఐదు టి20ల సిరీస్‌లో టాపార్డర్ కీలకపాత్ర పోషించింది. ఇక్కడ యశస్వి–శుబ్‌మన్ గిల్ జోడి డకౌట్లతో నిరాశపరిచింది. ఇది ఇన్నింగ్స్‌పై ప్రభావం చూపించింది. పొట్టి ఫార్మాట్‌లో పవర్ ప్లే, డెత్ ఓవర్లే స్కోరును ఒక్కసారిగా మార్చేస్తాయి. భారత్ విషయంలో అదే జరిగింది. తిలక్‌వర్మ ఉన్నంత సేపు ధాటిగా ఆడాడు. మ్యాచ్ మ్యాచ్‌కు రాటుదేలుతున్న రింకూ సింగ్‌పై అందరి దృష్టి పడింది. కచ్చితత్వంతో కూడిన భారీషాట్లు అతన్ని మరో మెట్టుపై నిలబెడుతున్నాయి. కెప్టెన్ సూర్యకుమార్ ఎలాగూ ఫామ్‌లోనే ఉన్నాడు. బ్యాటింగ్ ఆర్డర్‌పై పెద్దగా బెంగలేకపోయినా... బౌలింగ్ విభాగం తేలిపోవడమే జట్టు మేనేజ్‌మెంట్‌ను కలవర పెడుతోంది. అనుభవజ్ఞులైన రవీంద్ర జడేజా, సిరాజ్‌లు ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేయలేకపోగా...అర్ష్‌దీప్, ముకేశ్ విఫలమయ్యారు. కీలకమైన ఈ మ్యాచ్‌లో బౌన్సీ పిచ్ సహకారంతో భారత బౌలర్లు లైన్ అండ్ లెంత్‌కు కట్టుబడితే ఆశించిన ఫలితాల్ని అందుకోవచ్చు.

సిరీస్‌పై కన్నేసిన సఫారీ

రెండో మ్యాచ్ గెలిచి 1-0తో జోరుమీదున్న ఆతిథ్య దక్షిణాఫ్రికా ఇప్పుడు సిరీస్‌పై కన్నేసింది. ఆఖరి మ్యాచ్‌లోనూ భారత్‌ను కంగుతినిపించి 2-0తో సిరీస్‌ను వశం చేసుకోవాలనే లక్ష్యంతో మార్క్‌రమ్ సారథ్యంలోని సఫారీ బరిలోకి దిగుతోంది. రెండో మ్యాచ్‌లో ఓపెనర్ హెన్‌డ్రిక్స్, మార్క్‌రమ్ సుడిగాలి వేగం మిగతా బ్యాటర్లు కొట్టిన అడపాదడపా బౌండరీలతో కుదించిన లక్ష్యాన్ని దర్జాగా ఛేదించేలా చేసింది. అయితే రబడా, ఇన్‌గిడిలాంటి స్పీడ్‌స్టర్లు అందుబాటులో లేని సఫారీ బౌలింగ్ కూడా పేలవంగానే కనిపిస్తోంది. ఈ విభాగాన్ని మెరుగు పర్చుకుంటేనే సిరీస్‌ను చేజిక్కించుకుంటుంది. లేదంటే యువ భారత్ సిరీస్ సమం చేసుకుంటుంది.

జట్లు (అంచనా) భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), యశస్వి, శుబ్‌మన్, తిలక్‌వర్మ, రింకూ సింగ్, జితేశ్ శర్మ, జడేజా, అర్ష్‌దీప్, కుల్దీప్, సిరాజ్, ముకేశ్.

దక్షిణాఫ్రికా: మార్క్‌రమ్ (కెప్టెన్), హెన్‌డ్రిక్స్, బ్రీట్‌కి, క్లాసెన్, మిల్లర్, స్టబ్స్, ఫెలుక్వాయో, జాన్సెన్, కొయెట్జి, లిజాడ్ విలియమ్స్, షమ్సీ.

పిచ్-వాతావరణం

వాండరర్స్ వికెట్ బ్యాటింగ్‌కు స్వర్గధామం. భారీ స్కోర్లు, మెరుపులకు లెక్కేలేదు. అయితే పేస్ బౌలర్లకు కూడా కాస్త అనుకూలించే పిచ్ ఇది. టాస్ నెగ్గిన జట్టు ఛేదనకే మొగ్గు చూపవచ్చు. గురువారం వర్ష సూచన అయితే ఉంది. కానీ మ్యాచ్ సమయానికల్లా అనుకూల వాతావరణం ఉంటుంది.

భారత్ X జర్మనీ

జూనియర్ హాకీ వరల్డ్‌కప్‌లో నేడు సెమీస్



కౌలాలంపూర్: జూనియర్ ప్రపంచకప్ హాకీలో చక్కని ప్రదర్శన కనబరిచిన భారత్‌కు నేడు జరిగే సెమీ ఫైనల్లో జర్మనీతో క్లిష్టమైన పోరు ఎదురు కానుంది. పటిష్టమైన జర్మనీ అడ్డంకిని దాటితే ఇంచుమించు టైటిల్ గెలిచినట్లే! ఈ మెగా ఈవెంట్ చరిత్రలో జర్మనీ దుర్భేద్యమైన ప్రత్యర్థి. గత టోర్నీ రన్నరప్ జర్మనీ ఆరుసార్లు (1982, 85, 89, 93, 2009, 13) టైటిల్ గెలిచింది. మరో రెండుసార్లు (1979, 2021) రన్నరప్‌గా నిలిచింది. అంతటి ప్రత్యర్థిని దాటుకొని భారత్ నాలుగో సారి ఫైనల్ చేరడం అంత సులువు కాదు. అయితే క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ నెదర్లాండ్స్‌పై ఆడిన తీరు, చేసిన పోరాటం, గెలిచిన వైనం చూస్తే భారత్‌ను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. మేటి జట్టు చేతిలో 0-2తో వెనుకబడిన దశనుంచి భారత్ చివరికొచ్చే సరికి 4–3 గోల్స్ తేడాతో డచ్‌పై జయభేరి మోగించింది. ముఖ్యంగా ప్రత్యర్థి జట్టుకు పెనాల్టీ కార్నర్లు లభించినపుడు... గోల్ కీపర్ మోహిత్‌తో పాటు రక్షణశ్రేణి చూపించిన సయమస్ఫూర్తి, కనబరిచిన పోరాటం అద్వితీయంగా సాగింది. ఇప్పుడు కూడా ఉత్తమ్ సింగ్ నేతృత్వంలోని భారత్ ఇదే ఆటతీరును కొనసాగిస్తే జర్మనీని కట్టడి చేయగలదు. మరో సెమీ ఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్‌తో ఫ్రాన్స్ తలపడుతుంది.

ఆసీస్‌ను పాక్ ఆపతరమా!

- నేటినుంచి తొలి టెస్టు
- ఉ.గం.7.50నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



ఖాజా

పెర్త్: ప్రపంచకప్ గెలిచిన సమరోత్సాహంతో ఉన్న ఆస్ట్రేలియా, పేలవ ప్రదర్శనతో పరిమిత ఓవర్ల లోనూ తడబడుతున్న పాకిస్తాన్ మధ్య టెస్టు సమరానికి రంగం సిద్ధమైంది. నేటినుంచి జరిగే తొలి టెస్టులో ఇరు జట్లు తలపడనున్నాయి. సొంతగడ్డపై తిరుగులేని జట్టయిన ఆసీస్ అన్ని రకాలుగా బలంగా కనిపిస్తూ నిస్సందేహంగా ఫేవరెట్‌గా కనిపిస్తోంది. మరో వైపు వరల్డ్ కప్ వైఫల్యం తర్వాత జట్టు, కెప్టెన్ మార్పులతో పాక్ బరిలోకి దిగుతోంది. 1995లో ఆసీస్ గడ్డపై చివరి సారిగా టెస్టు మ్యాచ్ నెగ్గిన పాక్ ఒక్కసారి కూడా సిరీస్ గెలవలేదు. 1999 టూర్‌నుంచి ఆ జట్టు వరుసగా 14 టెస్టుల్లో ఓడింది. కనీసం 'డ్రా'గా కూడా ముగించలేకపోయింది. టెస్టుకు ముందు ఆసీస్ ఓపెనర్ ఉస్మాన్ ఖాజా గాజాలో పాలస్తీనాకు మద్దతు తెలుపుతున్నట్లుగా తన షూస్‌కు 'ఆల్ లైవ్స్ ఆర్ ఈక్వల్' అనే క్యాప్షన్‌తో ప్రాక్టీస్‌తో పాల్గొన్నాడు. అయితే ఐసీసీ నిబంధనల ప్రకారం ఇలాంటి క్రికెట్ మైదానంలో ప్రదర్శించరాదు. ఖాజాకు తన భావాలను ప్రదర్శించే స్వేచ్ఛ ఉందని ఆసీస్ బోర్డు, కెప్టెన్ కమిన్స్ అండగా నిలిచినా... అతను ఆ వ్యాఖ్యలు ఉన్న షూస్‌తో టెస్టు బరిలోకి దిగరాదని నిర్ణయించుకున్నాడు. తనది రాజకీయ ప్రకటన కాదని, మానవత్వం మాత్రమేనని ఖాజా అన్నాడు.

మళ్లీ ఓడిన టైటాన్స్

బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ జట్టు పరాజయాల పరంపర కొనసాగుతోంది. టోర్నీలో నాలుగో మ్యాచ్ ఆడిన జట్టు వరుసగా నాలుగో ఓటమిని ఎదుర్కొంది. బుధవారం హోరాహోరీగా జరిగిన పోరులో తమిళ్ తలైవాస్ 38–36 స్కోరుతో టైటాన్స్‌పై విజయం సాధించింది. టైటాన్స్ తరఫున కెప్టెన్ పవన్ సెహ్రావత్, రాబిన్ చౌదరి చెరో 7 పాయింట్లు సాధించారు. తలైవాస్ ఆటగాళ్లలో నరేందర్ 10, సాహిల్ 7 పాయింట్లతో జట్టు గెలిపించారు. మరో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 32–30తో జైపూర్ పింక్ పాంథర్స్‌పై గెలుపొందింది.

ప్రొ కబడ్డీ లీగ్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
బెంగాల్ వారియర్స్	4	3	0	1	18
గుజరాత్ జెయింట్స్	5	3	2	0	17
బెంగళూరు బుల్స్	6	2	4	0	14
యూపీ యోధాస్	4	2	2	0	12
పుణేరి పల్టన్	2	2	0	0	10
పట్నా పైరేట్స్	3	2	1	0	10
తమిళ్ తలైవాస్	3	2	1	0	10
జైపూర్ పింక్ పాంథర్స్	4	1	2	1	10
హరియాణా స్టీలర్స్	3	2	1	0	10
దబంగ్ ఢిల్లీ	3	1	2	0	6
యు ముంబా	3	1	2	0	6
తెలుగు టైటాన్స్	4	0	4	0	2

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

సినిమా



● మహేశ్‌బాబు, శ్రీ లీల

నా కంటి రెప్పలో కాటుక ముగ్గు నువ్వే...

''నా కాఫీ కప్పులో షుగరు క్యూబు నువ్వే నువ్వే.. నా కంటి రెప్పలో కాటుక ముగ్గు నువ్వే నువ్వే..'' అంటూ సాగుతుంది 'గుంటూరు కారం' సినిమాలోని 'ఓ మై బేబీ' పాట. హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం ఇది. శ్రీ లీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి మరో హీరోయిన్. బుధవారం ''ఓ మై బేబీ.. నీ బుగ్గలు పిండాలి.. ఓ మై బేబీ నీకు ముద్దులు పెట్టాలి..'' అంటూ సాగే 'ఓ మై బేబీ..' పాట పూర్తి లిరికల్ వీడియోను విడుదల చేశారు. సంగీత దర్శకుడు తమన్ స్వరకల్పనలో రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను శిల్పారావు ఆలపించారు. సూర్యదేవర రాధాకృష్ణ (చిన్నబాబు) నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 12న విడుదల కానుంది. ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ పరమహంస.



● రవితేజ

స్నేహమే ఇదిలే..

'సూరీడే గొడుగు పట్టి వచ్చాడే భుజము తట్టి, చిమ్మ చీకటిలోను నీడలా ఉండేటోడు..' అంటూ సాగే 'సూరీడే..' పాట 'సలార్: సీజ్ ఫైర్' చిత్రంలోనిది. ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ చిత్రంలో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించగా పృథ్వీరాజ్ సుకుమారన్, జగపతిబాబు కీలక పాత్రలు పోషించారు. రెండు భాగాల 'సలార్'లోని తొలి భాగం 'సలార్: సీజ్‌ఫైర్' ఈ నెల 22న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'సూరీడే..' పాట లిరికల్ వీడియోను బుధవారం విడుదల చేశారు. ''ఒకరికొకరని నమ్మి నడిచిన స్నేహమే ఇదిలే.. నూరేళ్ల నిలవాలే..' అంటూ స్నేహం విలువను చాటి చెప్పేలా ఈ పాట సాగుతుంది. తెలుగు వెర్షన్ పాటను రవి బస్రూర్ సంగీత సారథ్యంలో కృష్ణకాంత్ రాయగా, హరిణి వైతూరి పాడారు. ''ఒకే ఆత్మ అనేలా ఉండే ఇద్దరి స్నేహితుల గురించి ఈ పాట చెబుతుంది. వారే ఒకరికొకరు బలం.. వారే ఒకరికొకరు బలహీనత. 2 గంటల 55 నిమిషాల నిడివి ఉన్న ఈ సినిమా సెన్సార్ పూర్తయింది'' అని చిత్రబృందం పేర్కొంది.



● 'సలార్' పోస్టర్

ఇంకా స్పైసీగా...



● హరీష్ శంకర్

'మిరపకాయ్' వంటి మాస్ హిట్‌ను హీరో రవితేజకు ఇచ్చారు దర్శకుడు హరీష్ శంకర్. అలాగే రవితేజతో 'ధమాకా' వంటి మాస్ హిట్ చిత్రాన్ని నిర్మించారు పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్. ఇప్పుడు ఈ హీరో–డైరెక్టర్–ప్రొడ్యూసర్ కాంబినేషన్ ఒకే సినిమాకి కుదిరింది. రవితేజ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో ఓ సినిమా నిర్మించనున్నట్లు బుధవారం పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ప్రకటించింది. ''ఈసారి మాస్ రీ యూనియన్ ఇంకా స్పైసీగా ఉంటుంది. త్వరలో ఇతర వివరాలు తెలియజేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.

వ్యూహంకి క్లీన్ యు



● అజ్మల్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జీవితంలోని కొన్ని ఘటనల ఆధారంగా రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'వ్యూహం'. ఈ సినిమాకు కొనసాగింపుగా 'శపథం' సినిమా రానుంది. అజ్మల్, మానస ప్రధాన పాత్రల్లో రామదూత క్రియేషన్స్ పై 'వ్యూహం'ను దాసరి కిరణ్ కుమార్ నిర్మించారు. నవంబరు 10న విడుదల కావాల్సిన ఈ సినిమాకు సెన్సార్ ఇబ్బందులు రావడంతో రిలీజ్ వాయిదా పడింది. ఈ నేపథ్యంలో రివైజింగ్ కమిటీకి పంపారు. తాజాగా 'వ్యూహం' సెన్సార్ పూర్తయింది. ''బ్యాడ్ బాయ్స్‌కు బ్యాడ్ న్యూస్. 'వ్యూహం' సినిమా సెన్సార్ పూర్తయింది. క్లీన్ యు సర్టిఫికెట్ లభించింది. డిసెంబరు 29న చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నాం'' అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు రామ్‌గోపాల్ వర్మ. సెన్సార్ బోర్డ్ మూడు డైలాగ్‌లను మాత్రమే మ్యూట్ చేయమని పేర్కొందని, వేరే ఏ కట్ చెప్పలేదని చిత్ర యూనిట్ సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. 2 గంటల 6 నిమిషాల నిడివితో ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది.

ఆ విజయం నా బాధ్యత పెంచింది

- విరాజ్ అశ్విన్

విరాజ్ అశ్విన్, పూజిత పొన్నాడ జంటగా అను ప్రసాద్ దర్శకత్వంలో నిరీష్ తిరువీధుల నిర్మించిన చిత్రం 'జోరుగా హుషారుగా..'. ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో విరాజ్ అశ్విన్ మాట్లాడుతూ – ''ఈ సినిమాలో చేనేత కుటుంబంలో పుట్టిన మధ్యతరగతి యువకుడు సంతోష్ పాత్ర చేశాను. తన కొడుకును ప్రయోజకుడిని చేసేందుకు ఓ మధ్యతరగతి తండ్రి ఎలాంటి త్యాగాలు చేయాల్సి వచ్చింది? కుటుంబం కోసం ఆ యువకుడు ఎలాంటి బాధ్యతలు తీసుకున్నాడు? అనేది ఈ సినిమాలోని ఆసక్తికర అంశాలు. 'బేబీ' సినిమా విజయం సాధిస్తుందని ఊహించాం కానీ అంత పెద్ద విజయం సాధిస్తుందని ఊహించలేదు. 'బేబీ' సక్సెస్ నా బాధ్యతను పెంచింది. ఇక నేను ఓ లీడ్ రోల్ చేసిన 'మరీచిక' రిలీజ్‌కి రెడీగా ఉంది. మరో రెండు కథలు విన్నాను'' అని చెప్పుకొచ్చారు.



మాస్ డుగు.. డుగు...



● మీనాక్షీ గోస్వామి

సూర్యతేజ ఏలే హీరోగా కేవీఆర్ మహేంద్ర దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'భరతనాట్యం'. పాయల్ సరాఫ్ నిర్మిస్తున్న ఈ చిత్రంలోని 'డుగు.. డుగు..' అంటూ సాగే మాస్ సాంగ్‌ని దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేశారు. చిత్రకథానాయిక మీనాక్షీ గోస్వామిపై చిత్రీకరించిన ఈ పాటను చిత్ర సంగీత దర్శకుడు వివేక్ సాగర్ స్వరపరిచారు. సినిమానీ, నిజ జీవితాన్నీ పోలుస్తూ కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటను మంగ్లీ పాడారు. శేఖర్ మాస్టర్ నృత్య రీతులు సమకూర్చారు. ''త్వరలో ఈ చిత్రం విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

నాతో నేనే ప్రయోగాలు చేయాలనుకుంటున్నాను

- శ్రీనివాస్



''దర్శకత్వం, నటనల కంటే నాకు రైటింగ్ అంటే ఎక్కువ ఇష్టం. నేను 'ఊహలు గుసగుసలాడే' సినిమా తీసినప్పుడు ఆ తరహా చిత్రాలు అప్పుడు రాలేదు. అలానే 'జో అచ్యుతానంద' కూడా. ఇలా నా కథలతో నాతో నేనే ప్రయోగాలు చేయాలనుకుంటున్నా'' అని అన్నారు రచయిత, దర్శక–నటుడు అవసరాల శ్రీనివాస్. శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన హారర్ ఫిల్మ్ 'పిండం'లో అవసరాల శ్రీనివాస్ కీలక పాత్ర పోషించారు. సాయికిరణ్ దైదా దర్శకత్వంలో యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో అవసరాల శ్రీనివాస్ మాట్లాడుతూ– ''సాయి కిరణ్ చేసిన 'స్మోక్' షార్ట్ ఫిల్మ్ చూసి, తనలో రచన, దర్శకత్వ ప్రతిభ ఉందని గ్రహించాను. తను చెప్పిన 'పిండం' కథ నచ్చింది. ఈ సినిమాలో అతీంద్రియ శక్తులపై పరిశోధనలు చేసే లోక్‌నాథ్ పాత్ర చేశాను. 'ప్రేమకథా చిత్రమ్' చూసినప్పుడు కొంచెం భయపెడితే ప్రేక్షకులు సినిమాను శ్రద్ధగా చూస్తారని అర్థమైంది. కానీ కథలో హారర్‌తో పాటు భావోద్వేగ సన్నివేశాలు కూడా ఉండాలి. అప్పుడే కనెక్ట్ అవుతారు. ఇక ప్రస్తుతం 'ఈగల్', 'కిస్మత్', 'కన్యాశుల్కం' సినిమాల్లో నటిస్తున్నాను. రైటర్‌గా, దర్శకుడిగా ఓ మర్డర్ మిస్టరీ సినిమా స్క్రిప్ట్ రాస్తున్నాను. నా తర్వాతి చిత్రం ఇదే కావొచ్చు. అలాగే 'కుమారి శ్రీమతి' వెబ్ సిరీస్ సీజన్ 2 ఉంటుంది'' అని చెప్పుకొచ్చారు.

మాయ కొత్తగా ఉంటుంది

- హీరోయిన్ ఎస్తేర్ నోర్హానా



● కిరణ్ ఆవల, ఎస్తేర్, రమేశ్ నాని

''రమేశ్‌గారు చెప్పిన 'మాయ' కథ విన్న వెంటనే ఓకే చేశాను. ఈ చిత్రకథ కొత్తగా ఉంటుంది'' అని ఎస్తేర్ నోర్హానా అన్నారు. కిరణ్ ఆవల, ఎస్తేర్ నోర్హానా, సిరి చందన తదితరులు కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'మాయ'. రమేష్ నాని దర్శకత్వంలో జీరో ప్రొడక్షన్స్ సమర్పణలో రాజేశ్ గొరిజవోలు నిర్మించారు. రమేశ్ నాని మాట్లాడుతూ– ''ఎస్తేర్ నా దృష్టిలో సౌత్ విద్యాబాలన్. ఈ సినిమా బోర్ కొట్టకుండా అలరించేలా ఉంటుంది'' అన్నారు. ''మా సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతోంది'' అన్నారు రాజేశ్ గొరిజవోలు. ''చిన్న సినిమాలను తొక్కేస్తారని అంటుంటారు. కానీ, సినిమాలో విషయం ఉంటే ఎవరూ తొక్కలేరని మా చిత్రం నిరూపిస్తుంది'' అన్నారు కిరణ్ ఆవల.

నవ్వుల మాయలో..

నరేశ్ అగస్త్య, భావన, జ్ఞానేశ్వరి కాండ్రేగుల ప్రధాన పాత్రల్లో నటించిన ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్ 'హ్యాష్ ట్యాగ్ మాయలో..'. మేఘా మిత్ర పేర్వార్ దర్శకత్వంలో షాలినీ నంబు, రాధాకృష్ణ నంబు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న రిలీజ్ కానుంది. ఈ చిత్రం విలేకర్ల సమావేశంలో నరేశ్ అగస్త్య మాట్లాడుతూ– ''హాయిగా నవ్వుకునే చిత్రం ఇది'' అన్నారు. ''చక్కని వినోదం, మనసును హత్తుకునే భావోద్వేగాలు, ఆకట్టుకునే మాటలు ఉన్న కథ ఇది'' అన్నారు మేఘా మిత్ర. ''నిర్మాతగా నా తొలి సినిమా ఇది. నా సోదరుడితో కలిసి నిర్మించా. చాలా ప్రేమతో ఈ సినిమా చేశాం'' అన్నారు షాలినీ నంబు. ''మంచి ఫీల్‌గుడ్ మూవీ. ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు రాధాకృష్ణ నంబు.



● జ్ఞానేశ్వరి, నరేశ్ అగస్త్య, భావన

ఇలాంటి సినిమా రాలేదు

- నిర్మాత రాజేశ్వరి చంద్రజ



● కొండా రాంబాబు, అనురాగ్, సోనాక్షి, రాజేశ్వరి

''రాంబాబుగారు 'కలశ' కథ చెప్పినప్పుడు ఎగ్జయిట్ అయ్యాను. ఇప్పటివరకూ భారతీయ చిత్ర పరిశ్రమలో ఇలాంటి వైవిధ్యమైన పాయింట్‌తో సినిమా రాలేదని చెప్పగలను. సైకలాజికల్ థ్రిల్లర్, హారర్ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది''' అని రాజేశ్వరి చంద్రజ వాడవల్లి అన్నారు. భానుశ్రీ, సోనాక్షీ వర్మ, అనురాగ్ కీలక పాత్రల్లో కొండ రాంబాబు దర్శకత్వం వహించిన చిత్రం 'కలశ'. రాజేశ్వరి చంద్రజ వాడవల్లి నిర్మించిన ఈ సినిమా నెల 15న రిలీజవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌కి అతిథులుగా విచ్చేసిన నటుడు మురళీమోహన్ 'ఓ చిట్టి తల్లి..' అనే పాటని, దర్శకుడు వీర శంకర్ 'కలశ..' అనే టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కొండా రాంబాబు మాట్లాడుతూ– ''చంద్రజగారు, స్వామిగార్లకు ఇది తొలి సినిమా అయినా బడ్జెట్ విషయంలో రాజీ పడలేదు'' అన్నారు.

సాక్షి బిజినెస్
గురువారం
14-12-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	34	69,585
నిఫ్టీ ▲	20	20,926

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తెలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,533	▽	1
డోజోన్స్	36,579	▲	1
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,548	▲	6
డాక్స్	16,766	▽	26
షాంఘై	2,969	▽	35
నికాయ్	32,926	▲	83

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,201	▽	76
బంగారం (99.5 స్వచ్ఛత)	60,956	▽	76
వెండి (కిలో)	70,898	▽	677

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.97	83.99
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.45	106.00
€	యూరో	ఎస్‌బీఐ	88.72	91.07
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.67	57.96
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.06	55.99
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.38	63.37
SAR	సౌదీ రియాల్	ఫారెక్స్	21.22	21.98
UAE D	యూఏఈ దిర్హామ్	ఫారెక్స్	21.79	23.58
¥	చైనా యువాన్	ఫారెక్స్	10.45	12.56

అదానీ ఎనర్జీ భారీ పెట్టుబడులు

హరిత ఇంధనంపై రూ. 8,33,000 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ హరిత ఇంధనం(గ్రీన్ ఎనర్జీ)పై భారీ స్థాయిలో పెట్టుబడులకు సిద్ధపడుతోంది. రానున్న దశాబ్ద కాలంలో 100 బిలియన్ డాలర్లు(రూ. 8,33,000 కోట్లు) వెచ్చించేందుకు ప్రణాళికలు అమలు చేయనుంది. వెరసి కంపెనీ కార్యకలాపాలు విస్తరించిన నౌకాశ్రయాలు, విద్యుత్, సిమెంట్ బిజినెస్‌లలో 2050కల్లా కాలుష్య సృష్టిలేని(నెట్‌జీరో) గ్రూప్‌గా అవతరించాలని ఆశిస్తోంది. పునరుత్పాదక ఇంధన విభాగంలో సామర్థ్యాలను 45 గిగావాట్లకు విస్తరిస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా సోలార్ ప్యానల్స్, పవన విద్యుత్ టర్బయిన్లు, హైడ్రోజన్ ఎలక్ట్రోలైజర్స్ తయారీకి మూడు గిగా ఫ్యాక్టరీలను నిర్మిస్తోంది. గ్రూప్‌లోని ఐదు పోర్ట్‌ఫోలియో కంపెనీల ద్వారా 2050కల్లా నెట్‌జీరోగా ఆవిర్భవించాలని అదానీ లక్ష్యంగా పెట్టుకుంది.అదానీ గ్రీన్‌ఎనర్జీ ద్వారా పునరుత్పాదక ఇంధనం, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ ద్వారా విద్యుత్ ప్రసారం, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ ద్వారా నౌకాశ్రయాలు, మౌలిక సదుపాయాలు, ఏసీసీ, అంబుజా సిమెంట్స్ ద్వారా సిమెంట్ బిజినెస్‌లోనూ నెట్‌జీరో లక్ష్యాలను సాధించాలని చూస్తోంది. ఇందుకు అనుగుణంగా పునరుత్పాదకాలు, కార్యకలాపాల విద్యుదీకరణ, బయోఇంధనాల వినియోగం, వేస్ట్ హీట్ రికవరీ, ఎనర్జీ స్టోరేజీ టెక్నాలజీలకు తెరతీస్తోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
14-12-2023	
విశాఖ	590-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	579-00
విజయవాడ	579-00
రిటైల్ ధర (డజను)	72.00
13-12-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	560-00
వరంగల్	562-00
రిటైల్ ధర	6.20

గిగ్ వర్కర్ల కోసం.. టెక్ మహీంద్రా 'పాప్యులై' ప్లాట్‌ఫామ్



న్యూఢిల్లీ: తాత్కాలిక ఉద్యోగార్థులు (గిగ్ వర్కర్లు) ప్రముఖ కంపెనీల్లో చిరుద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేలా సహాయపడేందుకు ఐటీ దిగ్గజం టెక్ మహీంద్రా కొత్తగా 'పాప్యులై' పేరిట క్రౌడ్‌సోర్సింగ్ ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించింది. ఇందులో ఉద్యోగార్థుల కోసం కంటెంట్ రేటింగ్, డేటా కలెక్షన్, డేటా ట్రాన్స్‌క్రిప్షన్, డేటా అనోటేషన్ వంటి తాత్కాలిక ఉద్యోగావకాశాలు ఉంటాయి. అటు కంపెనీలపరంగా చూస్తే అర్హత కలిగిన నిపుణుల డేటాబేస్ అందుబాటులో ఉంటుంది. తద్వారా ఇటు ఉద్యోగార్థులకు, అటు కంపెనీలకు ఇది ప్రయోజనకరంగా ఉంటుందని టెక్ మహీంద్రా బిజినెస్ హెడ్ (బిజినెస్ ప్రాసెస్ సర్వీసెస్) బీరేంద్ర సేన్ తెలిపారు. తదుపరి తరం కృత్రిమ మేధ (ఏఐ) సొల్యూషన్స్‌ను రూపొందించాలంటే గణనీయంగా సమయంతో పాటు సాధారణంగా కంపెనీల్లో ఉండే ఉద్యోగులే కాకుండా బైటి నిపుణుల అవసరం కూడా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే పాప్యులై ప్లాట్‌ఫాం అంతర్జాతీయ స్థాయిలో గిగ్ నిపుణులను, కంపెనీలను అనుసంధానిస్తుందని తెలిపారు. దీనితో కంపెనీలు వ్యయాలు తగ్గించుకుంటూ, ఉత్పాదకత పెంచుకుంటూ .. ఏఐ సొల్యూషన్స్ రూపకల్పనను వేగవంతం చేసుకోవచ్చని సేన్ చెప్పారు. అలాగే గిగ్ నిపుణులు టాప్ ఏఐ ప్రాజెక్టులను దక్కించుకోవచ్చని, మరిన్ని వనరుల ద్వారా ఆదాయం పొందవచ్చని ఆయన పేర్కొన్నారు.

మెర్సిడెస్ బెంజ్ కార్ల ధరల పెంపు



న్యూఢిల్లీ: మెర్సిడెస్ బెంజ్ జనవరి ఒకటి నుంచి కొన్ని మోడళ్ల ధరలను 2% వరకు పెంచనున్నట్లు బుధవారం ప్రకటించింది. ఇన్‌పుట్ వ్యయాలు, కమోడిటీ ధరలు, రవాణా సరఫరా ఖర్చులు అధికమవడంతో పాటు ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల కారణంగా కార్ల ధరలు పెంచుతున్నట్లు కంపెనీ తెలిపింది. సీ-క్లాస్ కారుపై రూ.60,000 నుంచి, టాప్ ఎండ్ మెర్సిడెస్ మేబ్యాచ్ ఎస్680పై రూ.3.4 లక్షల వరకు పెంపుదల ఉంటుంది. మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఏ-క్లాస్ సెడాన్ నుంచి ఎస్‌యూవీ జీ63 ఏఎంజీ వరకు వివిధ మోడళ్ల కార్లను రూ.46 లక్షలు - రూ.3.4 కోట్ల ధరల శ్రేణిలో విక్రయిస్తుంది.

ఆఖర్లో 'కొనుగోళ్ల' రికవరీ

స్వల్ప లాభాల ముగింపు



ముంబై: ఆఖరి గంటలో ఆటో, యుటిలిటీ, ఎఫ్‌ఎంసీజీ, విద్యుత్, సర్వీసుల రంగాల షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు బుధవారం ఇంట్రాడే నష్టాలను భర్తీ చేసుకుని స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ఫెడరల్ రిజర్వ్ బ్యాంకు ద్రవ్య పాలసీ ప్రకటన (బుధవారం రాత్రి) ముందు ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. ప్రథమార్థంలో నష్టాల్లో కదలాడిన సూచీలు యూరప్ మార్కెట్ల లాభాల ప్రారంభం నుంచి సానుకూల సంకేతాలు అందిపుచ్చుకున్నాయి. ట్రేడింగ్‌లో 450 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్ చివరికి 34 పాయింట్ల లాభంతో 69,585 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 136 పాయింట్ల పతనం నుంచి తేరుకొని 20 పాయింట్ల స్వల్ప లాభంతో 20,926 వద్ద నిలిచింది. చిన్న, మధ్య తరహా రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.06%, 0.73 శాతం పెరిగాయి. మరోవైపు ఐటీ, టెలికం, బ్యాంకులు, ఇంధన, టెక్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.4,711 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.958 కోట్ల షేర్లు అమ్మేశారు. అమెరికా మార్కెట్లు లాభాల్లో కదలాడుతున్నాయి.

- ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్ల వెల్లడికి ముందు ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్ 2%, టెక్ మహీంద్రా 1%, విప్రో, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు అరశాతం చొప్పున నష్టపోయాయి.
- కమ్యూనికేషన్ సేవల సంస్థ తాన్లా ప్లాట్‌ఫామ్స్ షేరు 18% లాభపడి రూ.1092 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 20% ఎగసి రూ.1111 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకుంది.
- నిధుల సమీకరణ ప్రతిపాదనను పరిశీలించేందుకు డిసెంబర్ 15న డైరెక్టర్ల బోర్డు సమావేశం కానుందని వార్తలు వెలువడంతో బ్యాంక్ ఆఫ్ బరోడా షేరు 2% లాభపడి రూ.221 వద్ద స్థిరపడింది.

1.66 లక్షల కోట్లు 'సిప్' చేశారు!

- 11 నెలల్లో పెట్టుబడుల విలువ ఇది..
- గతేడాది కంటే అధికం
- 17 వేల కోట్లు దాటిన నెలవారీ పెట్టుబడులు



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్‌లో క్రమానుగత పెట్టుబడులకు (సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్/సిప్) ఇన్వెస్టర్లు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందుకు నిదర్శంగా ఈ ఏడాది 11 నెలల్లో (జనవరి-నవంబర్) సిప్ రూపంలో ఫండ్స్‌లోకి రూ.1.66 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. సిప్ కనిష్ట పెట్టుబడిని రూ.250కు తగ్గించే దిశగా పనిచేస్తున్నట్టు సెబీ చైర్‌పర్సన్ మాధురి పురి బుచ్ ఇటీవలే ప్రకటించడం గుర్తుండే ఉంటుంది. ఇది అమల్లోకి వస్తే సిప్ పెట్టుబడులు మరింతగా పెరుగుతాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. 2022 సంవత్సరం మొత్తం మీద సిప్ రూపంలో ఫండ్స్‌లోకి వచ్చిన పెట్టుబడులు రూ.1.5 లక్షల కోట్లుగా ఉంటే, ఈ ఏడాది మరో నెల మిగిలి ఉండగానే దీన్ని అధిగమించడం గమనార్హం. ఇక 2021లో సిప్ రూపంలో ఫండ్స్‌లోకి వచ్చిన పెట్టుబడులు రూ.1.14 లక్షల కోట్లుగా, 2020లో రూ.97,000 కోట్లుగా ఉన్నట్టు మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇక మీదట ఏటా సిప్ పెట్టుబడులు స్థిరంగా పెరుగుతూ వెళతాయని మోతీలాల్ ఓస్వాల్ ఏఎంసీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ అఖిల్ చతుర్వేది పేర్కొన్నారు. ఆర్థిక వృద్ధికి సంబంధించి ఆశావహ అంచనాలు, మార్కెట్లో ఇన్వెస్టర్ల ప్రాతినిధ్యం పెరగిన నేపథ్యంలో.. ఫండ్స్‌లో సిప్ ద్వారా పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు సానుకూలంగా ఉన్నట్టు చెప్పారు. మార్కెట్లు బలంగా ఉండడం, చక్కని రాబడులకు ఉన్న అవకాశాల నేపథ్యంలో 2024లో సిప్ రూపంలో వచ్చే పెట్టుబడులు పెరుగుతాయనే నమ్మకం బలపడుతున్నట్టు తెలిపారు.

మద్దతిస్తున్న అంశాలు

2022 డిసెంబర్ నెలలో సిప్ రూపంలో ఈక్విటీ పథకాల్లోకి వచ్చిన పెట్టుబడులు రూ.11,305 కోట్లు కాగా, 2023 నవంబర్ నెలకు ఈ మొత్తం రూ.17,073 కోట్లకు పెరిగాయి. ఈ ఏడాది అక్టోబర్, సెప్టెంబర్ నెలల్లోనూ రూ.16వేల కోట్లకు పైనే సిప్ పెట్టుబడులు వచ్చాయి. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల నిర్వహణలోని సిప్ ఆస్తులు నవంబర్ చివరికి రూ.9.31 లక్షల కోట్లకు పెరిగాయి. 2022 డిసెంబర్ చివరికి ఇవి రూ.6.75 లక్షల కోట్లుగా ఉన్నాయి. యాంఫి నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు, అధిక జనాభా, ఈక్విటీలపై అధిక రాబడులు, పెట్టుబడుల సౌలభ్యం తదితర అంశాలు మ్యూచువల్ ఫండ్స్‌లోకి పెట్టుబడుల రాక పెరగడానికి అనుకూలించే అంశాలుగా మార్కెట్ నిపుణులు ప్రస్తావిస్తున్నారు. ''సిప్, ఈక్విటీ పెట్టుబడుల వల్ల వచ్చే ప్రయోజనాలపై అవగాహన కల్పించడంలో యాంఫి ముఖ్య పాత్ర పోషిస్తోంది. ఈక్విటీలకు ఒక పెట్టుబడి సాధనంగా చూసే ధోరణి పెరగడం కూడా సిప్ పెట్టుబడులు పెరగానికి అనుకూలిస్తోంది''అని అఖిల్ చతుర్వేది వివరించారు. సిప్ ద్వారా ఇన్వెస్టర్ తాను ఎంపిక చేసుకున్న పథకంలో నిర్ణీత రోజులకు ఒకసారి పెట్టుబడి పెట్టుకోవచ్చు. మార్కెట్ ర్యాలీలు, పతనాల్లోనూ సిప్ పెట్టుబడి కొనసాగడం వల్ల కొనుగోలు ధర సగటుగా మారి, రాబడులు మెరుగ్గా ఉంటాయి. ప్రస్తుతం సిప్ కనీస పెట్టుబడి రూ.500గా ఉంది. అందరికీ ఆర్థిక సేవలను చేరువ చేయాలన్న లక్ష్యంలో భాగంగా సిప్ కనీస పెట్టుబడిని రూ.250కి తగ్గించాలని సెబీ భావిస్తోంది.

డోమ్స్ ఐపీవోకు రిటైలర్ల క్యూ..

తొలి రోజే 5.7 రెట్లు అధిక బిడ్స్



న్యూఢిల్లీ: పెన్సిళ్ల తయారీ దిగ్గజం డోమ్స్ ఇండస్ట్రీస్ పబ్లిక్ ఇష్యూకి తొలి రోజే(బుధవారం) ఇన్వెస్టర్లు క్యూ కట్టారు. కంపెనీ 88 లక్షలకుపైగా షేర్లను ఆఫర్ చేయగా.. 5 కోట్లకుపైగా షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. వెరసి 5.7 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్ లభించింది. ఎన్‌ఎస్‌ఈ గణాంకాల ప్రకారం రిటైల్ ఇన్వెస్టర్లు ఏకంగా 19 రెట్లు అధికంగా దరఖాస్తు చేయడం విశేషం! ఈ బాటలో సంస్థాగతేతర ఇన్వెస్టర్లు 8 రెట్లు బిడ్ చేయగా.. అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) నుంచి కేవలం 6% మాత్రమే స్పందన నమోదైంది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 350 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుండగా.. మరో రూ. 850 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచారు. వెరసి ఇష్యూ ద్వారా రూ. 1,200 కోట్లు సమీకరించనుంది. ఒక్కో షేరుకి రూ. 750-790 చొప్పున ధరల శ్రేణిని ప్రకటించిన కంపెనీ మంగళవారం యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 538 కోట్లు సమకూర్చుకుంది.

రేపు వేల్యూ జోన్ హైపర్ మార్ట్ ప్రారంభం



హైదరాబాద్: వేల్యూ జోన్ హైపర్ మార్ట్ కొత్త అవుట్‌లెట్ మాల్ హైదరాబాద్‌లోని పటాన్‌చెరులో గురువారం (రేపు) ప్రారంభం కానుంది. సినీ నటుడు బాలకృష్ణ లాంఛనంగా ఆవిష్కరించనున్నారు. ఇందులో ప్రముఖ బ్రాండ్లపై 40% డిస్కౌంట్ లభిస్తుంది. అవుట్‌లెట్ చుట్టుపక్కల ఇక్రిశాట్, నిమ్స్, ఐఐటీ, ప్రధాన సంస్థలు ఉండటంతో విద్యార్థులు, కుటుంబాలు, నిపుణులను మాల్ ఆకర్షిస్తుందన్న విశ్వాసాన్ని యాజమాన్యం వ్యక్తం చేసింది. ''మాల్ ఆర్కిటెక్చర్, లేఅవుట్ నిర్మాణం భాగ్యనగర సంస్కృతి, అభివృద్ధికి వేదికగా నిలిచింది. వెడల్పైన కారిడార్లు, సహజకాంతి, అధునాతన పద్ధతుల్లో రూపొందించిన స్టోర్ల మిశ్రమం సందర్శకులకు గొప్ప షాపింగ్ అనుభూతి పంచుతాయి'' అని యాజమాన్యం వివరించింది.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్ జాగ్రఫీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీలో 81 గ్రూప్-1 పోస్టులకు నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. వివిధ ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 81
» ఎంపిక విధానం: స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ల వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 01.01.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 21.01.2024.
» స్క్రీనింగ్ టెస్ట్(ప్రిలిమినరీ పరీక్ష) తేది:17.03.2024
» వెబ్‌సైట్: https://psc.ap.gov.in

ఇగ్నోలో 102 ఉద్యోగాలు

జాబ్స్ ఇన్ఫో

ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో).. తాజాగా 102 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ), స్కిల్ టెస్ట్/టైపింగ్ టెస్టుల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అర్హతలు, ఆసక్తి గల అభ్యర్థులు డిసెంబర్ 21వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

- మొత్తం పోస్టుల సంఖ్య: 102

జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్ (జేఏటీ)-50

- **అర్హత:** ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు 10+2 లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులవ్వాలి. కంప్యూటర్‌పై ఇంగ్లిష్‌లో నిమిషానికి 40 పదాలు/హిందీలో నిమిషానికి 35 పదాలు టైప్ చేయగలగాలి. డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది. **వయసు:** 21.12.2023 నాటికి 18-27 ఏళ్ల మధ్య ఉండాలి.

స్టెనోగ్రాఫర్ పోస్టులు-52

- **అర్హత:** ఇంటర్మీడియట్ లేదా 10+2 తత్సమాన విద్యార్హత కలిగిన అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్‌పై ఇంగ్లిష్‌లో నిమిషానికి 40 పదాలు /హిందీలో నిమిషానికి 35 పదాలు టైప్ చేయగలగాలి. షార్ట్‌హ్యాండ్‌లో నిమిషానికి 80 పదాల వేగం ఉండాలి. డిగ్రీ ఉత్తీర్ణత సాధించి, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు. **వయసు:** 21.12.2023 నాటికి 18-30 ఏళ్ల మధ్య ఉండాలి. గరిష్ట వయోపరిమితిలో ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ (ఎన్‌సీఎల్)కు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు 10-15 ఏళ్లు, ఎక్స్‌సర్వీస్‌మెన్‌కు వారికి మూడేళ్ల సడలింపు లభిస్తుంది.

ఎంపిక ఇలా

అభ్యర్థుల ఎంపికకు రెండు దశల్లో అర్హత పరీక్షలను నిర్వహిస్తారు. అవి..టైర్-1, టైర్-2 పరీక్షలు.

- **టైర్-1:** (జేఏటీ, స్టెనోగ్రాఫర్ పోస్టులకు): ఇందులో 5సెక్షన్‌లు ఉంటాయి. సెక్షన్-1లో మ్యాథమెటికల్ ఎబిలిటీస్-30 మార్కులు,సెక్షన్-2లో రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్-30 మార్కులు,సెక్షన్-3లో హిందీ/ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్-30 మార్కులు, సెక్షన్-4లో జనరల్ అవేర్‌నెస్-30 మార్కులు,సెక్షన్-5లో కంప్యూటర్ నాలెడ్జ్-30 మార్కులుంటాయి.
- **టైర్-2:** ఈ పరీక్ష రెండు పోస్టులకు వేర్వేరుగా ఉంటుంది.

సిలబస్ ఇలా

- **మ్యాథమెటికల్ ఎబిలిటీస్:** నంబర్ సిస్టమ్స్, ఆల్జీబ్రా, మెన్సురేషన్, ట్రిగనోమెట్రీ, స్టాటిస్టిక్స్-ప్రాబబిలిటీ తదితర అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్:** వెర్బల్-నాన్ వెర్బల్, వెన్‌డయాగ్రమ్స్, నంబర్ సిరీస్, క్రిటికల్ థింకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్, ఎమోషనల్, సోషల్ ఇంటెలిజెన్సీ, వర్డ్ బిల్డింగ్, కోడింగ్-డీకోడింగ్, న్యూమరికల్ ఆపరేషన్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.
- **ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్:** వొకాబ్యులరీ, గ్రామర్, సెంటెన్స్ స్ట్రక్చర్, సినానిమ్స్, యాంటనిమ్స్, స్పాట్ ద ఎర్రర్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, స్పెల్లింగ్స్, డిటెక్టింగ్ మిస్ స్పెల్డ్ వర్డ్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, యాక్టివ్, పాసివ్ వాయిస్ ఆఫ్ వెర్బ్స్, కాంప్రహెన్షన్ పాసేజ్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **జనరల్ అవేర్‌నెస్:** సమాజ పరిస్థితులపై అభ్యర్థుల అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలుంటాయి. అలాగే ఇండియన్ హిస్టరీ, కల్చర్, ఆర్థిక వ్యవస్థ, భౌగోళిక పరిస్థితులను గురించి ప్రశ్నలను అడుగుతారు.
- **కంప్యూటర్ నాలెడ్జ్:** కంప్యూటర్ బేసిక్స్, వర్కింగ్ విత్ ఇంటర్నెట్ అండ్ ఈ-మెయిల్స్, ఈ-బ్యాంకింగ్, సైబర్ సెక్యూరిటీ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 21.12.2023
- **దరఖాస్తు ఎడిట్ ఆప్షన్:** 2023 డిసెంబర్ 22-25 తేదీల వరకు
- **వెబ్‌సైట్:** https://exams.nta.ac.in

క్యాట్.. మలిదశలో మెరిసేలా!

» ముగిసిన క్యాట్-2023 పరీక్ష
» గత ఏడాదికంటే క్లిష్టంగా ప్రశ్నలు
» 77-80 మార్కులతో 99 పర్సంటైల్
» మలి దశకు సిద్ధమవ్వాలంటున్న నిపుణులు

కామన్ అడ్మిషన్ టెస్ట్.. క్యాట్‌గా సుపరిచితం! దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) క్యాంపస్‌లలో.. ఎంబీఏ, పీజీడీఎం తదితర మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! వీటితోపాటు దేశ వ్యాప్తంగా మరో 1200కు పైగా మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశాలకు ప్రామాణిక పరీక్ష క్యాట్! ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన క్యాట్-2023కు 2.88 లక్షల మంది హాజరయ్యారు. ఈ నేపథ్యంలో.. క్యాట్-2023 విశ్లేషణ, కటాఫ్ అంచనా, మలి దశలో ఐఐఎంల ఎంపిక ప్రక్రియ, సన్నద్ధత తదితర వివరాలు..



ఈ ఏడాది క్యాట్ పరీక్ష విధానంలో ఎలాంటి మార్పు లేదు. గత సంవత్సరం మాదిరిగానే మూడు విభాగాల నుంచి 66 ప్రశ్నలు అడిగారు. వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 24 ప్రశ్నలు; డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 20 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి 22 ప్రశ్నలు చొప్పున అడిగారు. ప్రతి విభాగంలోనూ బహుళైచ్ఛిక ప్రశ్నల(ఎంసీక్యూ)తో పాటు నాన్-ఎంసీక్యూలు కూడా ఉన్నాయి. వీఏఆర్‌సీ విభాగంలో నాలుగు;డీఐఎల్ఆర్‌లో 8; క్యూఏలో 7 నాన్-ఎంసీక్యూలు అడిగారు. దీంతో..అభ్యర్థులకు సమయాభావ సమస్య ఎదురైంది.

క్వాంటిటేటివ్ ఎబిలిటీ

- ఒకే రోజు మొత్తం మూడు స్లాట్లలో క్యాట్ నిర్వహించారు. ఈ పరీక్షలో క్వాంటిటేటివ్ ఎబిలిటీనే ఎక్కువ క్లిష్టంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదే విధంగా డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్‌లో ఓ మోస్తరు క్లిష్టతతో ప్రశ్నలు ఉన్నాయి. వీఏఆర్‌సీ మాత్రం కాసింత సులభంగా ఉందని అంటున్నారు.
- స్లాట్-1లో క్వాంటిటేటివ్ ఎబిలిటీలో ఆల్జీబ్రా నుంచి ఎక్కువ ప్రశ్నలు అడగడం అభ్యర్థులకు కొంత ఇబ్బందికరంగా మారింది. ఏడు ప్రశ్నలు అర్థమెటిక్ నుంచి, నాలుగు ప్రశ్నలు జామెట్రీ, సైక్లిక్ క్వాడ్రిలేటరల్‌పై అడిగిన ప్రశ్నలు పూర్తి స్థాయిలో గణితంపై పట్టు ఉన్న అభ్యర్థులు మాత్రమే సమాధానాలు ఇచ్చే విధంగా ఉన్నాయి.
- స్లాట్-2లో కూడా ఇదే తీరుగా క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి ప్రశ్నలు అడిగారు. మొత్తం 22 ప్రశ్నలకు గాను ఆల్జీబ్రా నుంచి 8, అర్థమెటిక్ నుంచి 7, జామెట్రీ నుంచి మూడు ప్రశ్నలు, మోడ్రన్ మ్యాథ్స్, నంబర్స్ నుంచి 2 ప్రశ్నలు చొప్పున అడిగారు.
- స్లాట్-3లో మాత్రం ఆల్జీబ్రా నుంచి నాలుగు ప్రశ్నలు; అర్థమెటిక్ నుంచి 8 ప్రశ్నలు అడగడం కాసింత ఉపశమనం కలిగించే అంశంగా అభ్యర్థులు భావిస్తున్నారు.

ఆ విభాగాలు ఓ మోస్తరు

వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్; డేటా ఇంటర్ ప్రిటేషన్ సెక్షన్లు ఓ మోస్తరు క్లిష్టతతో ఉన్నాయి. వెర్బల్ ఎబిలిటీలో అధిక భాగం ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు అడిగారు. ఇవి కూడా సమకాలీన అంశాలకు సంబంధించినవి కావడంతో కరెంట్ అఫైర్స్,కాంప్రహెన్షన్‌పై పట్టు ఉన్నవారు మాత్రమే సమధానాలు ఇచ్చే విధంగా ఉన్నాయి. డేటా ఇంటర్‌ప్రిటేషన్‌లో అరేంజ్‌మెంట్స్ ప్రశ్నలు సులభంగా ఉండడంతో అభ్యర్థులు ఊరట చెందారు.

కటాఫ్‌ల అంచనా.. ఇలా

- క్వాంటిటేటివ్ ఎబిలిటీ క్లిష్టంగా, మిగతా రెండు విభాగాలు ఓ మోస్తరుగా ఉండటంతో స్లాట్‌ల వారీగా వేర్వేరు కటాఫ్ అంచనాలు వ్యక్తమవుతున్నాయి.
- స్లాట్-1లో 89 స్కోర్‌తో 99.5 పర్సంటైల్, 80 స్కోర్‌తో 99పర్సంటైల్ సాధించొచ్చని అంచనా.
- స్లాట్-2లో 91 మార్కులతో 99.5 పర్సంటైల్; 81 మార్కులతో 99 పర్సంటైల్,59 మార్కులతో 95 పర్సంటైల్, 50 మార్కులతో 90 పర్సంటైల్ పొందొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.
- స్లాట్-3లో 86-88 స్కోర్‌తో 99.5 పర్సంటైల్; 76-77 స్కోర్‌తో 99 పర్సంటైల్; 56-58 స్కోర్‌తో 95 పర్సంటైల్; 48-50 స్కోర్‌తో 90 పర్సంటైల్ సాధించొచ్చని అంచనా.
- మొత్తంగా.. ఈ మూడు స్లాట్లను నార్మలైజేషన్ ప్రక్రియ ద్వారా క్రోడీకరించి పర్సంటైల్స్‌ను నిర్ధారించే క్రమంలో.. 77-80 స్కోర్‌తో 99 పర్సంటైల్; 56-60 స్కోర్‌తో 95 పర్సంటైల్; 48-50 స్కోర్‌తో 90 పర్సంటైల్ పొందే వీలుందని నిపుణులు పేర్కొంటున్నారు.

నిర్దిష్ట కటాఫ్ పర్సంటైల్

తొలితరం ఐఐఎంల్లో మలి దశ ఎంపిక ప్రక్రియకు క్యాట్ కటాఫ్ 99-100 పర్సంటైల్‌గా ఉంటుందని అంచనా. మిగతా ఐఐఎంల్లో మాత్రం 94-95 పర్సంటైల్‌తో కూడా మలి దశకు అర్హత పొందే అవకాశం ఉంది. ఐఐఎం-షిల్లాంగ్, బోధ్‌గయ వంటి క్యాంపస్‌ల్లో 90-92 పర్సంటైల్ వచ్చినా అర్హత లభించే వీలుంది. తుది జాబితా రూపకల్పన, గత రెండు, మూడేళ్ల ప్రవేశాలను పరిగణనలోకి తీసుకుంటే.. 93 శాతంపైగా పర్సంటైల్ ఉంటేనే ప్రవేశం ఖరారవుతోంది. ఐఐఎం-కోల్‌కత, ఐఐఎం-అహ్మదాబాద్ వంటి తొలి తరం ఐఐఎంలలో ప్రవేశం పొందాలంటే.. 99కి పైగా పర్సంటైల్ ఉంటేనే సాధ్యమని గత గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

మలి దశకు సిద్ధంగా

నిర్దిష్ట క్యాట్ స్కోర్ ఆధారంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి.. తదుపరి దశలో రిటెన్ ఎబిలిటీ టెస్ట్, గ్రూప్ డిస్కషన్‌లను నిర్వహిస్తున్నాయి. వీటిలో ప్రతిభ ఆధారంగా చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఈ పర్సనల్ ఇంటర్వ్యూలోనూ విజయం సాధిస్తే.. ఐఐఎంల్లో ప్రవేశం ఖరారవుతుంది.

గ్రూప్ డిస్కషన్

మలి దశకు అర్హత సాధించిన అభ్యర్థులకు ఆయా ఐఐఎం క్యాంపస్‌లలో గ్రూప్ డిస్కషన్ నిర్వహిస్తారు. అభ్యర్థులను బృందాలుగా విభజించి ఏదైనా ఒక అంశాన్ని ఇచ్చి దానిపై చర్చించమంటారు. కోర్ నుంచి కాంటెంపరరీ వరకు ఈ అంశాలు ఉంటున్నాయి. కాబట్టి అభ్యర్థులు సబ్జెక్ట్ నాలెడ్జ్‌తోపాటు సమకాలీన పరిణామాలపైనా ఇప్పటి నుంచే అవగాహన పెంచుకోవాలి.

రిటెన్ ఎబిలిటీ టెస్ట్

గ్రూప్ డిస్కషన్ తర్వాత రిటెన్ ఎబిలిటీ టెస్ట్(ఆర్ఏటీ) ఉంటుంది. నిర్దిష్టంగా ఏదైనా ఒక అంశాన్ని పేర్కొని అభ్యర్థుల అభిప్రాయం లేదా సలహాలు వ్యక్తీకరించే విధంగా ప్రశ్నలు అడుగుతున్నారు. ఒక అంశానికి సంబంధించి మూడు వందల నుంచి నాలుగు వందల పదాల మధ్యలో అభ్యర్థులు తమ సమాధానం రాయాల్సి ఉంటుంది. ఆర్ఏటీ టాపిక్స్ సబ్జెక్ట్ నాలెడ్జ్, సోషల్ అవేర్‌నెస్ సమ్మిళితంగా ఉంటున్నాయి.

పర్సనల్ ఇంటర్వ్యూ

గ్రూప్ డిస్కషన్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌లో విజయం సాధించిన వారికి చివరిగా పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఈ ఇంటర్వ్యూలో.. సదరు అభ్యర్థికి మేనేజ్‌మెంట్ విద్య పట్ల ఉన్న వాస్తవ ఆసక్తి, అతని భవిష్యత్తు లక్ష్యాలు, వాటిని అందుకునేందుకు ఎంచుకున్న మార్గాలు తదితర అంశాలను నిపుణులైన ప్రొఫెసర్స్ కమిటీ పరిశీలిస్తుంది.

వెయిటేజీ ఆధారంగా

వంద మార్కుల వెయిటేజీ ఫార్మట్‌లో 35 నుంచి 50 శాతం మేరకు జీడీ, పీఐలకు వెయిటేజీ లభిస్తోంది. దీంతోపాటు జండర్ డైవర్సిటీకి, అడమిక్ ప్రతిభకు కూడా తుది ఎంపికలో వెయిటేజీ ఉంటుంది. పదో తరగతి, ఇంటర్మీడియెట్, బ్యాచిలర్ డిగ్రీ కోర్సులకు ఒక్కో కోర్సుకు ప్రత్యేకంగా వెయిటేజీ ఉంటోంది. ఐఐఎంలు తుది జాబితా రూపకల్పనలో పని అనుభవానికి కూడా వెయిటేజీ కల్పిస్తున్నాయి.

అకడమిక్ డైవర్సిటీ

ఐఐఎంలలో ప్రవేశ ప్రక్రియ, క్యాట్‌లో ఉత్తీర్ణత సాధించడం వంటి విషయాల్లో.. ఇంజనీరింగ్ అభ్యర్థులే ముందంజలో ఉంటున్నారనే అభిప్రాయం నెలకొన్న సంగతి తెలిసిందే. ఫలితాలు కూడా ఈ అభిప్రాయాలు నిజమనేలానే ఉంటున్నాయి. దీంతో నాన్-ఇంజనీరింగ్ విద్యార్థులకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఐఐఎంలు అకడమిక్ డైవర్సిటీకి కూడా పెద్ద పీట వేస్తున్నాయి. నాన్-ఇంజనీరింగ్ బ్యాచిలర్ డిగ్రీ విద్యార్థులకు కనిష్టంగా 15 శాతం.. గరిష్టంగా 30 శాతం వెయిటేజీ కల్పిస్తున్నాయి.

'క్యాట్'కు 40 శాతం వెయిటేజీ

తుది జాబితా రూపకల్పనలో మొత్తం వంద మార్కులకు క్యాట్ స్కోర్‌కు 40 శాతంగానే వెయిటేజీ ఉంటోంది. గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలకు 40 నుంచి 50 శాతం వెయిటేజీ లభిస్తోంది. ప్రొఫైల్, పని అనుభవం తదితర అంశాలకు దాదాపు 20 శాతం మేరకు వెయిటేజీని ఐఐఎంలు కల్పిస్తున్నాయి.



సర్పంచ్‌ల సమస్యలపై సీఎంకు వినతి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని తెలంగాణ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ బుధవారం సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సర్పంచులు గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామం, రైతు వేదికలు, గ్రామ పంచాయతీ భవనాలు, సీసీ రోడ్ల నిర్మాణం బిల్లులు వెంటనే మంజూరు చేయించాలని కోరారు. సర్పంచుల పదవీ కాలం పొడిగించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలన్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం విజ్ఞప్తిపై మంత్రి సీతక్క హామీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్న రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం విజ్ఞప్తిపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క సానుకూలంగా స్పందించారు. త్వరలోనే సర్పంచ్‌ల సమస్యలను పరిశీలించి పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని హామీ నిచ్చారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సర్పంచ్‌లు పని చేయాలని కోరారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహారెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో కలిసి మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు చేసిన పలు అభివృద్ధి పనుల వివరాలను మంత్రికి తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు భూమన్న యాదవ్, మహిళా విభాగం అధ్యక్షురాలు జూలూరు ధనలక్ష్మి, కార్యవర్గ సభ్యులు వెంకటేష్,రామేశ్వర్ రెడ్డి ఉన్నారు.





మంచు కురిసింది.. వేకువ విరిసింది

మధ్యమానేరు బ్యాక్‌వాటర్‌పై బుధవారం సుందర దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. తొలుత పొగమంచు కమ్ముకోగా.. భానుడు చీకట్లను చీలుస్తున్న దృశ్యం కనువిందు చేసింది. ఉదయాన్నే జాలర్లు చేపల వేటకు వెళ్లిన తరుణంలో కనిపించిన సుందర దృశ్యాలివి.

- వంకాయల శ్రీకాంత్, సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల.

ఆరోగ్యానికి మరింత భరోసా

ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం

- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై సమీక్షలో ఏపీ సీఎం వైఎస్ జగన్.. ఉచిత వైద్య సేవల కల్పనలో మానవీయ దృక్పథం
- పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్య సేవల్లో మరో అడుగు ముందుకు
- ప్రజారోగ్య రంగంలో చరిత్రాత్మక నిర్ణయం
- 18న కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేయనున్న ముఖ్యమంత్రి



ఆరోగ్యశ్రీ పథకంపై సమీక్షలో సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: నిరుపేద, మధ్య తరగతి కుటుంబాల ప్రజలకు ఉచిత వైద్య సేవల కల్పన విషయంలో అత్యంత మానవీయ దక్పథంతో మనందరి ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ క్రమంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చామని స్పష్టం చేశారు. ఆరోగ్య పరంగా ఎలాంటి సమస్యలు వచ్చినా సరే ఆరోగ్యశ్రీ అండగా నిలుస్తుందన్నారు. ప్రజారోగ్య రంగంలోనే ఇది చరిత్రాత్మక నిర్ణయమని ఉద్ఘాటించారు. తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి రూ.25 లక్షల వరకు వైద్యం ఉచితంగా లభిస్తుందని తెలియజేయండి. ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందిన అనంతరం వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. చికిత్స చేయించుకున్న వారు తిరిగి ఫాలో అప్ చెకప్ కోసం డాక్టర్ వద్దకు వెళ్లేలా చూడాలి. ఇందులో భాగంగా ఫాలో అప్ కన్సల్టేషన్ కోసం రవాణా చార్జీల కింద రూ.300 చొప్పున అందజేయండి. మరోవైపు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నుంచి ఆస్పత్రులకు రెఫర్ చేసిన వారికి ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్యం అందిస్తున్నాం. వీరు ఆస్పత్రులకు వెళ్లడం కోసం రవాణా చార్జీల కింద రూ.500 చొప్పున అందిస్తున్నాం. మరో విషయం ఏమిటంటే.. ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్యం పొందడం ఎలా? అనే దానిపై రూపొందించిన వీడియో అందరికీ చేరేలా చూడండి. ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సహా ప్రజలందరికీ ఈ వీడియోను అందుబాటులో ఉంచాలి' అని ఆదేశించారు. శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ రోగులకు అందుతున్న వైద్య సేవలు రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో కూడా అందించాలని అధికారులను చెప్పారు.

18న సీఎం చేతుల మీదుగా ప్రారంభం

రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ఈ నెల 18వ తేదీన ప్రారంభించనుంది. 19వ తేదీ నుంచి ప్రతి నియోజకవర్గంలో 5 గ్రామాల చొప్పున జరిగే కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. మండలంలో వారానికి నాలుగు గ్రామాల చొప్పున కొత్త ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపడతారు. ప్రతి ఇంటికీ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ చేపట్టి, జనవరి నెలాఖరుకు పూర్తి చేయనున్నారు. ఆరోగ్రశ్రీ కింద ఉచితంగా ఎలా వైద్యం పొందవచ్చనే దానిపై పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఏఎన్‌ఎం, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో), ఆశా వర్కర్లు, వలంటీర్లు, మహిళా పోలీసులు ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ సహా, పథకంపై అవగాహన పెంచే కార్యక్రమంలో పాల్గొంటారు. ఆరోగ్యశ్రీ మొబైల్ యాప్‌ను ప్రజల సెల్‌ఫోన్‌లలో డౌన్లోడ్ చేసి, యాప్ ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తారు. పనిలో పనిగా దిశ యాప్‌ను కూడా డౌన్లోడ్ చేస్తారు. ఇదిలా ఉండగా జనవరి ఒకటో తేదీ నుంచి ఫేజ్-2 జగన్ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించనుంది. ప్రతివారం మండలానికి ఒక గ్రామ సచివాలయం, పట్టణ ప్రాంతాల్లో ఒక వార్డు పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నారు. జిల్లాల్లో సగం మండలాల్లో మంగళవారం, సగం మండలాల్లో శుక్రవారం శిబిరాల నిర్వహణ ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో బుధవారం నిర్వహిస్తారు.

జైళ్లు సరిపోవట్లే!

సామర్థ్యానికి మించి ఖైదీలున్నారని పార్లమెంటులో కేంద్రం వెల్లడి


- దేశవ్యాప్తంగా 1,330 జైళ్లు.. వాటి సామర్థ్యం 4.36 లక్షల మంది
- కానీ ఉన్న ఖైదీలు 5.73 లక్షలపైనే..
- ఢిల్లీ, యూపీ, ఎంపీ, బిహార్ సహా పలు రాష్ట్రాల జైళ్లలో అధికంగా ఖైదీలు..
- తెలంగాణ, ఏపీలలో సామర్థ్యానికన్నా తక్కువే..



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని జైళ్లలో ఉండాల్సిన సంఖ్య కంటే ఎక్కువమంది కిక్కిరిసి ఉంటున్నారని కేంద్ర ప్రభుత్వ గణాంకాలు చెప్తున్నాయి. దేశవ్యాప్తంగా మొత్తం 1,330 జైళ్లలో 4,36,266 మంది ఖైదీలను ఉంచేందుకు వీలుండగా.. గతేడాది డిసెంబర్ 31 నాటికి ఏకంగా 5,73,220 మంది ఖైదీలు ఉన్నారు. ముఖ్యంగా ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్, పంజాబ్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, జార్ఖండ్ జైళ్లలో సామర్థ్యానికి మించి ఖైదీలు ఉన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఈ పరిస్థితి కాస్త మెరుగ్గానే ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని జైళ్లలో సామర్థ్యం కంటే తక్కువగా ఖైదీలు ఉన్నారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని జైళ్లలో సామర్థ్యం కంటే స్వల్పంగా ఎక్కువ సంఖ్యలో ఖైదీలు ఉన్నారు. బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ కుమార్ మిశ్రా లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఈ వివరాలను వెల్లడించారు.

యూపీలో అత్యధికంగా..

- ➤ దేశంలోనే అత్యధికంగా ఉత్తరప్రదేశ్(యూపీ)లోని 77 జైళ్లలో 67,600 మంది ఖైదీల సామర్థ్యం ఉండగా.. ఏకంగా 1,21,609 మంది ఖైదీలు మగ్గుతున్నారు. బీహార్‌లోని 59 జైళ్లలో 47,750 మంది సామర్థ్యానికిగాను 64,914 మంది ఖైదీలు ఉన్నారు.
- ➤ మధ్యప్రదేశ్‌లోని 132 జైళ్లలో 48,857 మంది ఖైదీలు.. మహారాష్ట్రలోని 64 జైళ్లలో 41,070 మంది ఖైదీలు.. పంజాబ్‌లోని 26 జైళ్లలో 30,801 మంది ఖైదీలు.. జార్ఖండ్‌లోని 32 జైళ్లలో 19,615 ఖైదీలు.. ఢిల్లీలోని 16 జైళ్లలో 18,497 మంది ఖైదీలు ఉన్నారు.
- ➤ తెలంగాణలోని 37 జైళ్లలో 7,997 మంది సామర్థ్యానికిగాను 6,497 మంది ఖైదీలు ఉన్నారు. ఇందులో 2,102 మంది దోషులు, 4,221 మంది విచారణ ఖైదీలు, 174 మంది నిర్బంధిత ఖైదీలు ఉన్నారు.
- ➤ ఆంధ్రప్రదేశ్‌లోని 106 జైళ్లలో 8,659 ఖైదీల సామర్థ్యానికిగాను 7,254 మంది ఖైదీలు ఉన్నారు. ఇందులో 1,988 మంది దోషులు, 5,123 మంది విచారణ ఖైదీలు, 134 మంది నిర్బంధిత ఖైదీలు, 9 మంది ఇతరులు ఉన్నారు.



గిరిజన వర్సిటీ బిల్లుకు ఆమోదం

రాజ్యసభలో మూజువాణి ఓటుతో ఓకే

- రాష్ట్రపతి ఆమోదం తర్వాత వర్సిటీ ఏర్పాటుకు మార్గం సుగమం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్రంలో సమ్మక్క–సారక్క గిరిజన విశ్వవిద్యాలయ ఏర్పాటు బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. గతవారం లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లును బుధవారం రాజ్యసభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. అయితే ఈ బిల్లుపై చర్చ జరుగుతున్న సందర్భంగా లోక్‌సభలో బుధవారం మధ్యాహ్నం జరిగిన భద్రతా ఉల్లంఘనపై హోంమంత్రి అమిత్‌షా ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ సహా విపక్ష సభ్యులు వాకౌట్ చేశాయి. అనంతరం చర్చలో భాగంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం–2014 ప్రకారం తెలంగాణలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు తప్పనిసరి అయినా, గత తెలంగాణ ప్రభుత్వం సరైన సమయంలో సహకరించని కారణంగా వర్సిటీ ఏర్పాటు ఆలస్యమైందన్నారు. ఏపీలో ఇప్పటికే గిరిజన వర్సిటీ ఏర్పాటు చేసి క్యాంపస్‌ను సైతం ప్రారంభించామని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ బిల్లుకు రాష్ట్రపతి ఆమోద ముద్ర వేసిన తర్వాత సమ్మక్క–సారక్క గిరిజన విశ్వవిద్యాలయాన్ని త్వరగా ప్రారంభిస్తామని ధర్మేంద్ర ప్రధాన్ రాజ్యసభలో తెలిపారు. కాగా ఓటీసీలు, గిరిజన సంక్షేమానికి సంబంధించి ఏదైనా బిల్లు వచ్చిన ప్రతీసారి విపక్షాలు ఏదో ఒక కారణాన్ని సాకుగా చూపుతూ రాజకీయం చేసే ప్రయత్నంలో భాగంగా వాకౌట్ చేస్తున్నారని రాజ్యసభాపక్ష నేత పీయూష్ గోయల్ ధ్వజమెత్తారు.

అవసరమైన నిధులు వెచ్చించాలి: లింగయ్య

చర్చలో భాగంగా బీఆర్‌ఎస్ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ మాట్లాడుతూ వర్సిటీ ఏర్పాటు చేస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నామని, అయితే పదేళ్ల క్రితమే విశ్వవిద్యాలయ ఏర్పాటు జరగాల్సి ఉండగా, దురదృష్టవశాత్తు కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేసిందని విమర్శించారు. ఇప్పటికైనా గిరిజనులపై ఉన్న ప్రేమతో తాము కోరిన విధంగా వర్సిటీని ఏర్పాటు చేసినందుకు కేంద్రానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. వర్సిటీ ఏర్పాటులో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ పాత్ర గణనీయంగా ఉందని, ముఖ్యమంత్రిగా ఈ అంశంపై అనేకసార్లు ప్రధాని సహా కేంద్రమంత్రులకు కేసీఆర్ విజ్ఞప్తి చేశారన్నారు.

కళలను కాపాడుకుందాం!

'కళాదీక్ష' ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



పురస్కారాలు అందజేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: అంతరించిపోతున్న కళలను కాపాడుకుందామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కళావైవిధ్యతకు భారతదేశం నిలయమని.. అలాంటి దేశంలో అంతరించిపోతున్న కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని పేర్కొన్నారు. భారతదేశ సంప్రదాయంలో భాగమైన ఎన్నో కళలు ప్రస్తుతం ఆదరణకు నోచుకోక అంతరించిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలోని సంగీత, నాటక అకాడమీ ద్వారా.. విస్మరణకు గురవుతున్న కళలను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'కళాదీక్ష'కార్యక్రమాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతరించిపోతున్న కళలను కాపాడేందుకు కొందరు గురువులు చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. విలువైన సాంస్కృతిక పరంపరను ఒక తరం నుంచి మరోతరానికి అందించడంలో వారధిగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వం తరపున, ప్రధానమంత్రి మోదీ తరపున అభినందనలు తెలియజేశారు. కళాదీక్ష కార్యక్రమం ద్వారా కళల సంరక్షణ, విస్మరించబడుతున్న కళల సంరక్షణకోసం పాటుపడుతున్న గురువులకు ప్రోత్సాహం అందించేందుకు కృషి జరుగుతోందన్నారు. 100కుపైగా విస్మరణకు గురవుతున్న కళలకు 'కళాదీక్ష'కార్యక్రమం ద్వారా ఆర్థికంగా, ఇతర రకాలుగా సహాయం అందించేందుకు కేంద్రం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా.. దేశవ్యాప్తంగా 100 మంది గురువులను కేంద్రమంత్రి సన్మానించారు. ఇందులో తెలంగాణకు చెందిన చిందు యక్షగానం గురువు గడ్డం శ్రీనివాస్, బైండ్ల కథ గురువు పులి యాదగిరి ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి.. హరికథకు సంబంధించి పురాణం జయలక్ష్మి, తోలుబొమ్మలాటకు సంబంధించి.. తోట బాలకృష్ణ, పద్యనాటకానికి సంబంధించి పీజీ వెంకటేశ్వర్లు, ద్రౌపది తిరునాళ్ల గురువు పీసీ మణి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ, జాయింట్ సెక్రటరీ, ఉమా నందూరి, సంగీత నాటక అకాడమీ చైర్మన్ సంధ్యా పురేఛా, వివిధ రాష్ట్రాలనుంచి వచ్చిన కళాకారులు, వివిధ కళలకు సంబంధించిన గురువులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఏ బాధ్యతలిచ్చినా చేపడతా: స్మితా సబర్వాల్

సాక్షి, హైదరాబాద్:తాను కేంద్రానికి డిప్యుటేషన్‌పై వెళ్తున్నట్లు వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం తనకు అప్పగించే ఎలాంటి బాధ్యతలైనా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రగతి పథంలో భాగస్వామి కావడం తనకు గర్వకారణం అని సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నాటి సీఎం కేసీఆర్‌కు స్మితా సబర్వాల్ కార్యదర్శిగా 10 ఏళ్ల పాటు కొనసాగారు. నీటిపారుదల శాఖ ఇన్‌చార్జి కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఆమె.. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ సీఎం, తన శాఖ మంత్రిని ఇప్పటివరకు కలుసుకోకపోవడంతో స్మితా సబర్వాల్ కేంద్రానికి వెళ్తున్నట్లు ఊహాగానాలు వచ్చాయి.

ద.మ.రైల్వే అధికారులకు అతి విశిష్ట రైలు సేవా పురస్కారాలు



రామారావు | దినేశ్‌రెడ్డి | శ్రీకాంత్ | కశ్యప్



ప్రత్యూష | నటరాజన్ | రంగయ్య

సాక్షి, హైదరా బాద్: దక్షిణ మధ్య రైల్వేకు చెందిన ఏడుగురు అధికారులకు జాతీయ స్థాయి అతి విశిష్ట రైలు సేవా పురస్కారాలు లభించాయి. డిసెంబర్ 15న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వారికి పురస్కారాలను అందించనున్నారు. కాజీపేటకు చెందిన డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ (కన్‌స్ట్రక్షన్) డీఎస్ రామారావు, విజయవాడ లోకోషెడ్ ట్రాక్షన్ రోలింగ్ స్టాక్ డివిజనల్ ఎలక్ట్రిక్ ఇంజనీర్ దినేశ్‌రెడ్డి, సికింద్రాబాద్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ మల్లెల శ్రీకాంత్, సికింద్రాబాద్ డివిజనల్ సిగ్నల్ టెలికమ్యూనికేషన్స్ ఇంజనీర్ శివకుమార్ కశ్యప్, నిజామాబాద్ రైల్వే రక్షక దళం సబ్ ఇన్‌స్పెక్టర్ టి.ప్రత్యూష, సికింద్రాబాద్ డీసీఎమ్ స్క్వాడ్ ముఖ్య టికెట్ ఇన్‌స్పెక్టర్ నటరాజన్, బీదర్ ట్రాక్ మెయింటెయినర్ గ్రేడ్–1 సీనియర్ సెక్షన్ ఇంజనీర్ రంగయ్యలకు వారివారి విభాగాల్లో విశిష్ట పనితీరుకుగాను ఈ పురస్కారాలు దక్కాయి. ఉత్తమ పనితీరు కనబరిచి, ఇతర సిబ్బందికి ఆదర్శంగా నిలిచిన వారిని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ అభినందించారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.